thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక
Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 20 సంచిక - 272 కరీంనగర్ మంగళవారం, 9 డిసెంబర్ 2025 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## కులగణన ఉద్దేశం కేంద్రానికి లేదు

న్యూఢిల్లీ : కులగణనపై కాంగ్రెస్, బీజేపీ నడుమ మళ్లీ విమర్శల యుద్ధం మొదలైంది. జనాభా లెక్కల సేకరణకు కేంద్ర హోం శాఖ విడుదల చేసిన నోటిఫికేషన్‌లో కులగణన ప్రస్తావనే లేదని, అసలది జరిపే ఉద్దేశమే మోదీ ప్రభుత్వానికి లేదని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి సచిన్ పైలట్ ఆరోపించారు. రాజకీయ లబ్ధి పొందాలన్న లక్ష్యం నెరవేరకపోవడంతో ఆ పార్టీ దుష్ప్రచారాలకు దిగుతోందని బీజేపీ మండిపడింది. పైలట్ ఢిల్లీలో విలేకరులతో మాట్లాడారు. కులగణనకు కేంద్రం కావాలనే జాప్యం చేస్తోందన్నారు. 'ఎన్నో ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీ కులగణనకు డిమాండ్ చేస్తోంది. మోదీ ప్రభుత్వం రాహుల్ ఒత్తిడికి తలొగ్గి జనగణనతోపాటే కులగణన చేపడతామని ప్రకటించింది. కానీ క్షేత్ర స్థాయిలో వాస్తవాలు వేరుగా ఉన్నాయి. జనాభా లెక్కల సేకరణకు రూ.10 వేల కోట్లు అవసరం.

## వందేమాతర గేయం పోరాట గేయం కాదు

# ఒక మంత్రం!




### వందేమాతరంపై లోక్ సభలో చర్చ.. కాంగ్రెస్‌పై మోడీ ఘాటు విమర్శలు

150 ఏళ్ల వందేమాతర గీతం ప్రయాణం ఎన్నో ఘట్టాలను దాటుకుంటూ వెళ్లిందని ప్రధాని నరేంద్ర మోడీ అన్నారు. వందేమాతరం రాజకీయ అధికారం కోసం మాత్రమే ఉద్దేశించిన గీతం కాదని భారత దేశాన్ని బానిసత్వ సంకెళ్ల నుంచి విముక్తి కల్పించేందుకు నినదించిన గీతం అన్నారు. ఇవాళ లోక్ సభలో వందేమాతరం 150 ఏళ్ల ఉత్సవాలపై చర్చను ప్రధాని నరేంద్ర మోడీ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడిన మోడీ వందేమాతరం.. స్వాతంత్ర్య పోరాటంలో భారతీయుల గొంతు అని వందేమాతరం గీతంపై చర్చ చేపట్టినందుకు సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. వందేమాతర గీతం స్వాతంత్ర్య సమరయోధులకు ఊపిరిగా నిలిచిందని, భారతదేశాన్ని బానిసత్వ సంకెళ్ల నుంచి విముక్తి కల్పించేందుకు నినదించిన గీతం వందేమాతరం అన్నారు. అలాంటి కోట్ల మందికి స్ఫూర్తి నింపిన ఈ గీతంపై చర్చ జరపడం మనందరి అదృష్టం అని, ఈ చర్చలో పాల్గొనడం నాకు గర్వకారణం అన్నారు. బకించంద్ర చటర్జీ రాసిన వందేమాతరం దేశానికి పునరుజ్జీవాన్నిచ్చిందని 'గాడ్ సేవ్ ద క్వీన్' గీతంతో భారత్‌ను బ్రిటీష్ వారు మనల్ని అణచివేశారు. ఈ గాడ్ సేవ్ ద క్వీన్ గీతానికి పోటీగా వందేమాతరం గర్వంగా నిలబడిందన్నారు. జననీ జన్మభూమిశ్చ అన్న రాముడి మాటలకు మరో రూపం వందేమాతరం అన్నారు. కాంగ్రెస్ పై ఫైర్:ఈ చర్చ సందర్భంగా కాంగ్రెస్ పార్టీపై ప్రధాని నరేంద్ర మోడీ నిప్పులు చెరిగారు. కాంగ్రెస్ పార్టీ వందేమాతరంపై కాంప్రమైజ్ అయిందని ముస్లిం లీగ్ ముందు కాంగ్రెస్ లొంగిపోయిందని ధ్వజమెత్తారు. సామాజిక సామరస్యం పేరుతో జవహర్ లాల్ నెహ్రూ వందేమాతరాన్ని ముక్కలు ముక్కలు చేశారని, కాంగ్రెస్ ఇప్పటికీ వందేమాతరాన్ని అవమానిస్తోందని ఆరోపించారు. వందేమాతరానికి ద్రోహం చేశారని ధ్వజమెత్తారు. ఈ చర్చ చరిత్రతో ముడిపడిన అనేక ఘట్టాలను మన కళ్లముందుకు తీసుకొస్తుందని ఇవాళ్టి చర్చలు భవిష్యత్ తరానికి స్ఫూర్తిగా నిలుస్తాయన్నారు. ఈ ఉత్సవాలు ఏడాది పొడవునా వేడుకలు జరుపుకొంటున్నామన్నారు. వందేమాతరం అనేది ఒక మంత్రం అన్నారు. 1947 లో దేశానికి స్వాతంత్ర్యం రావడానికి ఎంతో తోడ్పడిందని 2047 వికసిత్ భారత్ నెరవేరాలంటే వందేమాతరం స్ఫూర్తి అవసరం అన్నారు. గంగా, సింధూ, గోదావరి, కావేరి నదుల వెంట ఉన్న సాంస్కృతిక వైభవాన్ని వందేమాతరం చాటిచెప్పిందన్నారు. భారత్ ను విడదీస్తే గానీ ఇక్కడ పాలించలేమని బ్రిటిషన్లు భావించారు. దేశాన్ని ముక్కలు చేయాలని కుట్రలు చేసి దానికి బెంగాల్ ను ఓ ప్రయోగ శాలగా మార్చారన్నారు. అనుకున్నట్టుగానే బెంగాల్ ను విభజిచారు. ఈ విభజన జరిగినా దేశం మొత్తం వందేమాతరం స్ఫూర్తితో కలిసికట్టుగా పోరాడిందన్నారు. అనేక మంది ప్రాణాలు పోతున్నా వందేమాతర నినాదాన్ని ఆపలేదన్నారు. వందేమాతరం ఉద్దేశాన్ని, గౌరవాన్ని మళ్లీ తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. వందేమాతరం ఆజాద్ భారత్ కు విజన్ గా మారిందని ఆ తర్వాత స్వదేశీ నినాదానికి స్ఫూర్తిగా నిలిచిందని అన్నారు.

## వికసిత్ భారత్ దిశగా తెలంగాణ: గవర్నర్ జిష్టు దేవ్ వర్మ


హైదరాబాద్, డిసెంబర్ 08: నిర్దేశించుకున్న లక్ష్యాలకు అనుగుణంగా తెలంగాణ ముందుకెళ్తోందని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ వెల్లడించారు. సోమవారం ఫ్యూచర్ సిటీలో తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా గవర్నర్ వర్మ మాట్లాడుతూ.. వికసిత్ భారత్ దిశగా తెలంగాణ రైజింగ్ కొనసాగుతోందన్నారు. 3 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా మారాలనేది తెలంగాణ ప్రభుత్వ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్రంలో అన్ని రంగాల్లో విప్లవాత్మక మార్పులు వస్తున్నాయని పేర్కొన్నారు. మహిళా రైతులను పలు విధాలుగా ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. బస్సుల నిర్వహణ కూడా మహిళా సంఘాలకు ఇచ్చామని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. తెలంగాణలో స్థిరమైన, పారదర్శకమైన ప్రభుత్వం ఉందని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ వివరించారు.




**ప్రత్యేక విజన్‌తో ముందుకెళ్తున్న తెలంగాణ: కైలాశ్ సత్యార్థి...** తెలంగాణ ప్రభుత్వ ఆధ్వర్యంలో గ్లోబల్ సమ్మిట్ విజయవంతమైందని నోబెల్ అవార్డు గ్రహీత కైలాశ్ సత్యార్థి తెలిపారు. తెలంగాణ ప్రత్యేక విజన్‌తో ముందుకెళ్తోందని ఆయన పేర్కొన్నారు. తెలంగాణలో 20 లక్షల మంది రైతులకు ప్రభుత్వం రుణమాఫీ చేసిందని చెప్పారు. మహిళలు ఉచితంగా బస్సుల్లో ప్రయాణిస్తున్నారని గుర్తు చేశారు. వికసిత్ భారత్ లక్ష్యం దిశగా తెలంగాణ వేగంగా అడుగులు వేస్తోందని పేర్కొన్నారు. సంస్కృతి,కళలు,టెక్నాలజీ,పరిశ్రమల హబ్‌గా తెలంగాణ ఉందన్నారు. ఐకమత్యంతోపాటు శాంతియుత పరిస్థితులతోనే అభివృద్ధి సాధ్యమని కైలాశ్ సత్యార్థి వివరించారు.

**మంగళవారంతో ముగియనున్న సమ్మిట్..** తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ సోమవారం ప్రారంభమైంది. ఈ సమ్మిట్ మంగళవారంతో ముగియనుంది. ఈ సమ్మిట్‌కు సీఎం రేవంత్ రెడ్డితోపాటు పలువురు కేంద్ర మంత్రులు, కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్‌తోపాటు వివిధ రాష్ట్రాల ప్రతినిధులు హాజరయ్యారు. దాదాపు 44 దేశాల నుంచి 154 మంది ప్రతినిధులు, అతిథులు ఈ సమ్మిట్‌కు హాజరయ్యారు. దేశ, విదేశీ ప్రముఖులు ఈ సమ్మిట్‌కు హాజరయిన నేపథ్యంలో భారీగా బందోబస్తును ఏర్పాటు చేశారు.

## తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌పై సీఎం చంద్రబాబు ఆసక్తికర ట్వీట్



హైదరాబాద్, డిసెంబరు 8 : తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ ఇవాళ(సోమవారం) నుంచి రెండు రోజులపాటు అత్యంత వైభవంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం నిర్వహిస్తోంది. అయితే, గత మూడు రోజుల క్రితం ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును అమరావతి నివాసంలో తెలంగాణ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి కలిసిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా గ్లోబల్ సమ్మిట్‌కు రావాలని ప్రత్యేకంగా ఆహ్వానించారు. తాను తప్పకుండా వస్తానని సీఎం చంద్రబాబు చెప్పారని కోమటిరెడ్డి తెలిపారు. ఈ నేపథ్యంలోనే గ్లోబల్ సమ్మిట్ దృష్ట్యా ట్విట్టర్ వేదికగా పోస్టు పెట్టారు సీఎం చంద్రబాబు. తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2025కి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సదస్సు తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి, పురోగతికి, ఆవిష్కరణలకు వేదిక కావాలని ఆకాంక్షిస్తున్నానని పేర్కొన్నారు సీఎం చంద్రబాబు. కాగా, హైదరాబాద్ ఫ్యూచర్‌సిటీ వేదికగా తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ రెండు రోజుల పాటు ఘనంగా జరగనుంది. ఇందుకోసం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. గ్లోబల్ సమ్మిట్‌ను ఇవాళ మధ్యాహ్నం 1:30లకు ప్రారంభించనున్నారు తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ. మధ్యాహ్నం 2:30 గంటలకు సీఎం రేవంత్‌రెడ్డి గ్లోబల్ సమ్మిట్‌పై ప్రసంగించనున్నారు. ఈ సమ్మిట్‌కు 44 దేశాల నుంచి 154 మంది అతిథులను కాంగ్రెస్ ప్రభుత్వం ఆహ్వానించింది.

గ్లోబల్ సమ్మిట్‌లో వివిధ అంశాలపై 27 సెషన్లలో చర్చలు జరగనున్నాయి. గ్లోబల్ సమ్మిట్‌కు ఆరు వేలమంది పోలీసులతో బందోబస్తు నిర్వహిస్తున్నారు. ఓఆర్ఆర్ ఎగ్జిట్ గేటు నుంచి సమ్మిట్ వేదిక వరకు పోలీసులు కట్టుదిట్టమైన బందోబస్తు చేస్తున్నారు.

అతిథుల భద్రత దృష్ట్యా పోలీసులు ప్రత్యేక భద్రత చర్యలు చేపట్టారు. ఈ సమ్మిట్ ద్వారా తెలంగాణకు ఎంతో విలువైన పెట్టుబడులు వస్తాయని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం భావిస్తోంది.

## పారిశ్రామికవేత్తలు, ఆర్థికవేత్తల సూచనలను...

# సాదరంగా స్వాగతిస్తున్నాం!




### తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్-2025లో సీఎం రేవంత్

హైదరాబాద్ : తెలంగాణ అభివృద్ధిలో దూసుకుపోతుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. సోమవారం ఫ్యూచర్ సిటీ వేదికగా జరుగుతున్న తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్-2025లో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. 2047కు సరికొత్త లక్ష్యాలను నిర్దేశించుకుని ముందుకు సాగుతున్నామన్నారు. తెలంగాణ రాష్ట్రం మూడు ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా ఎదగాలన్నదే తమ ఆశయమని ఆయన స్పష్టం చేశారు. ఈ విజన్ డాక్యుమెంట్ రూపకల్పనలో సహకరించిన వారందరికి ఈ సందర్భంగా సీఎం రేవంత్ ధన్యవాదాలు తెలిపారు. అభివృద్ధికి పారిశ్రామికవేత్తలు, ఆర్థికవేత్తల సూచనలను ఆహ్వానిస్తున్నామన్నారు. దేశ స్వాతంత్ర్యం అనంతరం మన నాయకులు కొత్త రాజ్యాంగాన్ని రూపొందించడం ద్వారా భవిష్యత్తుకు రోడ్ మ్యాప్ వేశారని వివరించారు. అలాగే తాము సైతం తెలంగాణ భవిష్యత్తు కోసం రోడ్ మ్యాప్ రూపొందించాలని అనుకున్నామన్నారు. అందుకు మహాత్మా గాంధీ, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తదితరుల నుంచి ఎంతో స్ఫూర్తి పొందామని చెప్పారు. తెలంగాణ ప్రజలు దశాబ్దాలుగా ప్రత్యేక రాష్ట్రం కోసం పోరాడారని గుర్తు చేశారు. 2014లో శ్రీమతి సోనియా గాంధీతోపాటు నాటి ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ నాయకత్వంలో తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కల సాకారమైందని తెలిపారు. భారతదేశంలో యువ రాష్ట్రంగా తెలంగాణ అవతరించిందని చెప్పారు. రానున్న పదేళ్లలో తెలంగాణను దేశంలోనే అత్యంత అభివృద్ధి చెందిన రాష్ట్రంగా, ప్రపంచంలోనే ఉన్నత రాష్ట్రంగా తీర్చిదిద్దడానికి ప్రయత్నిస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి వివరించారు.

**అలా బీజం పడింది: సీఎం రేవంత్...** దేశానికి స్వాతంత్రం సిద్ధించి.. 2047లో వంద సంవత్సరాలు పూర్తి చేసుకుంటుందని.. నాటికి మనం ఏం సాధించామో చెప్పాలని నిపుణులను కోరినట్లు సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఆ సమయంలోనే తెలంగాణ రైజింగ్-2047 దార్శనికతకు బీజం పడిందని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేసుకున్నారు. మనమేదైనా గొప్పగా చేయాలని భావించినప్పుడు తెలంగాణ సంస్కృతిలో ముందుగా దేవుళ్ల ఆశీర్వాదం తీసుకుంటాం ప్రజల మద్దతు కోరుతామన్నారు. భవిష్యత్తు కోసం మన కలలు నెరవేర్చుకోవడానికి ప్రజల ఆలోచనలు, అంచనాలు తెలుసుకున్నామన్నారు. అందుకు అధికారులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగం, ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్, నీతి ఆయోగ్ నిపుణుల సహాయం తీసుకున్నామన్నారు.

**అదృష్టంగా భావిస్తున్నా: సీఎం రేవంత్...** ఈ గ్లోబల్ సమ్మిట్‌కు అన్ని రంగాలకు చెందిన ప్రతినిధులు రావడం మన అదృష్టంగా భావిస్తున్నామన్నారు. వ్యాపారవేత్తలు, కార్పొరేట్ దిగ్గజాలు, విధాన నిర్ణేతలు, దౌత్యవేత్తలు, ప్రభుత్వ అధికారులతోపాటు వివిధ రంగాలకు చెందిన నిపుణులకు సీఎం రేవంత్ ధన్యవాదాలు చెప్పారు. ఈ సమ్మిట్‌లో మీ సూచనలు, సలహాలు, అభిప్రాయాలను స్వీకరించడానికి తాము సిద్ధంగా ఉన్నామన్నారు.

**అపారమైన అవకాశాలు..** తెలంగాణలో అపారమైన అవకాశాలు ఉన్నాయని వివరించారు. మంచి సానుకూల వాతావరణం కూడా ఉందన్నారు. 2034 నాటికి 1 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఉన్న రాష్ట్రాన్ని.. 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలని తాము సంకల్పించామని చెప్పారు. దేశంలో తెలంగాణ దాదాపు 2.9% జనాభా కలిగి ఉందని గుర్తు చేశారు. దేశ జీడీపీలో తెలంగాణ నుంచి దాదాపు 5% వాటాను అందిస్తున్నామని స్పష్టం చేశారు. 2047 నాటికి భారత దేశ జీడీపీలో 10 శాతం వాటాను తెలంగాణ నుంచి అందించాలన్నది తమ లక్ష్యమని ధీమా వ్యక్తం చేశారు.

**మూడు భాగాలుగా..** సేవారంగం, తయారీ రంగం, వ్యవసాయ రంగం.. ఇలా తెలంగాణను మూడు భాగాలుగా విభజించి.. ప్రాంతాల వారీగా అభివృద్ధి లక్ష్యాలను నిర్దేశించుకున్నామని వివరించారు. ఇలా లక్ష్యాన్ని నిర్దేశించుకున్న రాష్ట్రాల్లో తెలంగాణ దేశంలోనే మొట్టమొదటిదని సీఎం రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. అందుకోసం కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ, పెరి అర్బన్ రీజియన్ ఎకానమీ, రూరల్ అగ్రికల్చర్ రీజియన్ ఎకానమీ మోడల్స్ నిర్దేశించామని చెప్పారు.

**తాము సైతం అదే నమూనా..** ఈ సందర్భంగా చైనాలోని గ్వాంగ్-డాంగ్ ప్రావిన్స్ సాధించిన అభివృద్ధి గురించి సీఎం రేవంత్ రెడ్డి ప్రస్తావించారు. చైనాలోనే ఈ ప్రావిన్స్ అతి పెద్ద ఆర్థిక వ్యవస్థ అని తెలిపారు. 20 ఏళ్లలో వారు ప్రపంచంలోనే అత్యధిక పెట్టుబడుల తోపాటు వృద్ధి రేటు సాధించారని వివరించారు. తెలంగాణలో సైతం తాము అదే నమూనాను అనుసరించాలని భావిస్తున్నామని చెప్పారు. చైనా, జపాన్, జర్మనీ, దక్షిణ కొరియా, సింగపూర్ దేశాల నుంచి తామేంతో ప్రేరణ పొందామన్నారు. ప్రస్తుతం ఆయా దేశాలతో తాము పోటీ పడాలనుకుంటున్నామని తెలిపారు. ఈ తెలంగాణ రైజింగ్ ప్రయాణంలో సహకరించడానికి, పెట్టుబడి పెట్టడానికి, తమకు సంపూర్ణ మద్దతు ఇవ్వాలని ఆకాంక్షిస్తూ మీ అందరినీ ఆహ్వానించామన్నారు.

**బలంగా విశ్వసిస్తున్నా: సీఎం రేవంత్ రెడ్డి...** ఈ విజన్ కష్టంగా అనిపించవచ్చు.. కానీ ఆ విజన్‌ను సాధించగలమని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ విషయంలో తమ టీమ్‌కు తాను చెప్పేదొక్కటేనన్నారు. కష్టంగా ఉంటే..వెంటనే చేపడుదాం. అసాధ్యం అని అనుకుంటే.. వారికి కొంత గడువు ఇస్తానని పేర్కొన్నారు. ఇవాళ తాను నిన్నటి కంటే ఎక్కువ విశ్వాసంతో, నమ్మకంతో ఉన్నానన్నారు. నిన్నటిది ఒక కల, ఒక ప్రణాళిక ఇవాళ మీరందరూ తమతో చేరారని.. ఈ ప్రయాణంలో భాగస్వాములుగా ఉండాలని ఆశిస్తున్నామన్నారు. మీ అందరి మద్దతుతో తెలంగాణ రైజింగ్ లక్ష్యాలన్నింటినీ సాధించగలమని బలంగా విశ్వసిస్తున్నానన్నారు. ఈ తెలంగాణ రైజింగ్ నిరంతర ప్రక్రియ.. Come and join the rise.. అంటూ సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిస్తూ.. తన ప్రసంగాన్ని ముగించారు.

**ముగిసిన ఆరంభ వేడుకలు..** సీఎం రేవంత్ రెడ్డి ప్రసంగం అనంతరం ఈ సమ్మిట్ ప్రారంభ వేడుకలు ముగిశాయి. ఆనంతరం వివిధ రంగాలపై సదస్సులు ప్రారంభమైనాయి. సెమీకండక్టర్ రంగంపై చర్చలో మంత్రి శ్రీధర్ బాబు పాల్గొన్నారు. విద్యా రంగంలో గ్లోబల్ సెంటర్‌గా తెలంగాణ చర్చ గోష్టిలో మంత్రి దామోదర రాజనర్సింహ పాల్గొన్నారు.

చురకలు





## ట్రంప్ మీడియా టెక్నాలజీస్ భారీ పెట్టుబడి

హైదరాబాద్: తెలంగాణలో ట్రంప్ మీడియా టెక్నాలజీస్ సంస్థ భారీ పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చింది. ఫ్యూచర్‌సిటీలో నిర్వహిస్తున్న తెలంగాణ గ్లోబల్ రైజింగ్ సమిట్ వేదికగా సంస్థ డైరెక్టర్ ఎరిక్ ఈ మేరకు ప్రకటించారు. వచ్చే పదేళ్లలో రూ.లక్ష కోట్లు పెట్టుబడులు పెట్టనున్నట్లు వెల్లడించారు.

**తెలంగాణ విజన్‌లో భాగస్వాములయ్యేందుకు సిద్ధం: సీఐఐ మాజీ ఛైర్మన్...** ఫ్యూచర్ సిటీ పేరుతో కొత్త నగరం ఆలోచన అభినందనీయమని సీఐఐ మాజీ ఛైర్మన్ దినేశ్ అన్నారు. తెలంగాణ ఇప్పటికే వేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రంగా ఉందని తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న సంస్థలను ఒకే వేదికపైకి రప్పించడం గొప్ప విషయమని, తెలంగాణ విజన్‌లో భాగస్వాములయ్యేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు.

**రూ.25వేల కోట్లతో గ్రీన్ డేటా సెంటర్: కరణ్ అదానీ...** తెలంగాణ విజన్‌ను ఈ సమిట్ ప్రతిబింబిస్తోందని అదానీ పోర్ట్స్ అండ్ సెజ్ ఎండీ కరణ్ అదానీ అన్నారు. తెలంగాణలో ఇప్పటికే అదానీ గ్రూప్ పెట్టుబడులు పెట్టిందని చెప్పారు. " గ్రీన్ డేటా సెంటర్స్, రెన్యువబుల్ ఎనర్జీలో ఇప్పటికే పెట్టుబడులు పెడుతున్నాం. సిమెంట్ రంగంలో కూడా అదానీ గ్రూప్ పెట్టుబడులు పెడుతోంది. డిఫెన్స్, ఏరోస్పేస్ పార్క్‌ను ఏర్పాటు చేసింది. దేశంలో తొలిసారిగా యూఏవీ టెక్నాలజీ హైదరాబాద్‌లో రూపొందిస్తున్నాం. హైదరాబాద్‌లో తయారయ్యే యూఏవీలను సైన్యానికి అందిస్తాం. ప్రపంచమార్కెట్‌లోనూ విక్రయిస్తాం. రూ.25వేల కోట్లతో 48 మెగావాట్ల గ్రీన్ డేటా సెంటర్ ఏర్పాటు చేస్తాం. లాజిస్టిక్స్‌లో రాష్ట్రాన్ని అగ్రపథాన నిలిపేందుకు అదానీ గ్రూప్ ప్రయత్నిస్తోంది. రూ.4వేల కోట్లతో రహదారి సౌకర్యాలు కల్పించనున్నాం. రాష్ట్రంలో జిల్లాలను కలిపే రహదారులను అదానీ గ్రూప్ నిర్మిస్తోంది. రూ.2వేల కోట్లతో సిమెంట్ పరిశ్రమ ఏర్పాటు చేసింది" అని కరణ్ అదానీ పేర్కొన్నారు.



## బెంగళూరుతో.. హైదరాబాద్ పోటీపడుతోంది

హైదరాబాద్: అభివృద్ధి, పెట్టుబడుల విషయంలో బెంగళూరుతో హైదరాబాద్ నగరం పోటీపడుతోందని కర్ణాటక ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ అన్నారు. ఈ రెండు మహానగరాలూ ప్రపంచంతో పోటీపడుతున్నాయన్నారు. ఫ్యూచర్‌సిటీలో నిర్వహించిన తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమిట్‌లో ఆయన ప్రసంగించారు. తర్వాత తరానికి ఏం కావాలో ఈ ప్రభుత్వం ఆలోచించిందని అన్నారు. తెలంగాణ, సౌత్ ఇండియా అభివృద్ధికి కర్ణాటక సహకరిస్తుందన్నారు. "దేశ ఐటీ ఎగుమతుల్లో బెంగళూరు 40 శాతం కలిగి ఉంది. చిన్న రాష్ట్రమైనప్పటికీ తెలంగాణ కూడా గొప్ప వాటా కలిగి ఉంది. కాలిఫోర్నియా వంటి నగరాల్లో 13 లక్షల భారత ఇంజినీర్లు పని చేస్తున్నారు" అని శివకుమార్ తెలిపారు.



## హైదరాబాద్‌లో రియల్టర్ దారుణహత్య

### కత్తులతో పొడిచి.. తుపాకీతో కాల్చి.. హైదరాబాద్‌లో రియల్టర్ దారుణహత్య

హైదరాబాద్: నగరంలోని మల్కాజిగిరిలో దారుణం చోటుచేసుకుంది. జవహర్‌నగర్ పోలీసుస్టేషన్ పరిధిలో రియల్టర్ వెంకటరత్నం (46)ను దుండగులు అతి కిరాతకంగా హతమార్చారు. స్కూటీపై వెళ్తున్న రియల్టర్‌ను వెంబడించి మరీ హత్య చేశారు. నడిరోడ్డుపై కత్తులతో పొడిచి తుపాకీతో కాల్చి చంపేశారు. సాకేత్ కాలనీ ఫోస్టర్ బిల్లా బాంగ్ స్కూల్ సమీపంలో ఈ ఘటన చోటుచేసుకుంది. స్థానికుల సమాచారంతో పోలీసులు అక్కడికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వెంకటరత్నంపై ధూల్‌పేట్‌లో రౌడీషీట్ ఉన్నట్లు గుర్తించారు. గతంలో జంట హత్యల కేసులో ఆయన నిందితుడిగా ఉన్నారు.

ప్రత్యర్థులే చంపి ఉంటారా? ఇతర కారణాలేమైనా ఉన్నాయా? అనే కోణంలో పోలీసులు విచారణ చేపట్టారు. ఈ హత్యపై మల్కాజిగిరి డీసీపీ శ్రీధర్ మాట్లాడుతూ క్లూస్ టీమ్, ఫోరెన్సిక్ బృందాలతో విచారిస్తున్నట్లు తెలిపారు. వెంకటరత్నం తల, మెడ, పొట్ట భాగాల్లో దారుణంగా నరికారని చెప్పారు. హత్యకు ఆర్థిక లావాదేవీలే కారణంగా తెలుస్తోందన్నారు.



## భారత్.. గ్లోబల్ సంస్థలకు డెస్టినేషన్ హబ్

హైదరాబాద్: దశాబ్ద కాలంగా భారత్‌కు విదేశీ పెట్టుబడులు భారీగా పెరిగాయని కేంద్రం మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. కేంద్రం పాటిస్తున్న పారదర్శకత, జవాబుదారీతనం వల్లే పెట్టుబడులు పెరిగాయన్నారు. ప్రపంచ కంపెనీలకు వేదికగా భారత్ మారిందన్నారు. ఫ్యూచర్‌సిటీలో నిర్వహించిన తెలంగాణ గ్లోబల్ రైజింగ్ సమిట్‌లో ఆయన ప్రసంగించారు. "సెల్‌ఫోన్ల ఉత్పత్తిలో భారత్ ప్రస్తుతం రెండో స్థానంలో ఉంది. గత దశాబ్దకాలంగా భారత్‌లో ఎన్‌హెచ్‌ల నిర్మాణం 70శాతం పెరిగింది. పదేళ్ల క్రితం 240కి.మీ ఉన్న మెట్రో రైల్ నెట్‌వర్క్ ఇప్పుడు 1013 కి.మీకి పెరిగింది" అని పేర్కొన్నారు.

**పక్కా విజన్, ప్రణాళికతో ముందుకెళ్తున్నాం: శ్రీధర్‌బాబు...** కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా పాలనకు రెండేళ్లు పూర్తయిందని మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. ఉత్పత్తి, నిర్మాణ రంగాల్లో అనేక రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచామన్నారు. "అనేక విభాగాల్లో తెలంగాణ దూసుకెళ్తోంది. మౌలిక వసతుల కల్పనలో మనమే ముందున్నాం. వచ్చే పదేళ్లపాటు త్వరగా అభివృద్ధి చెందాలనే దిశగా చర్యలు చేపడుతున్నాం. దేశంలోనే తొలిసారిగా ఏఐ విలేజ్ నిర్మిస్తున్నాం. స్పష్టమైన లక్ష్యంతో.. ధైర్యంగా, వేగంగా అడుగులు వేస్తున్నాం. క్వాంటమ్ టెక్నాలజీ అభివృద్ధికి అనేక చర్యలు తీసుకుంటున్నాం. మాకు విజన్ ఉంది. తగిన ప్రణాళిక ఉంది" అని శ్రీధర్‌బాబు అన్నారు.

## కాంగ్రెస్ రెండేళ్ల పాలనపై హరీష్ రావు సంచలన కామెంట్స్



హైదరాబాద్, డిసెంబర్ 8: రెండేళ్ళ కాంగ్రెస్ పాలనపై మాజీ మంత్రి హరీష్ రావు తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. సోమవారం మీడియాతో మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి ప్రతి రోజు ప్రజా దర్బార్‌లో ప్రజలను కలుస్తా అన్నారని.. ఆ గొప్పలు ఏమయ్యాయని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి బిల్డప్ బాబాయ్ అంటూ వ్యాఖ్యలు చేశారు. జల్సాలకు, విందులకు పెళ్లిళ్లకు, సీఎల్పీ మీటింగ్‌లకు ప్రజా భవన్‌ను వాడుతున్నారని ఆరోపించారు. రేవంత్ రెడ్డి ప్రైవేట్ లిమిటెడ్ పాలన అంటూ దుయ్యబట్టారు. రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో రేవంత్ రెడ్డి ప్రజలకు వేదన, రోదన మిగిల్చారన్నారు. రేవంత్ పాలనలో హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ దెబ్బతిన్నదని విమర్శించారు. రెండేళ్ల పాలనలో ఆదాయం ఎందుకు తగ్గిందో చూసుకోవాలన్నారు. ఆర్గనైజ్డ్ కరప్షన్ పాలన రేవంత్ కుటుంబం, మంత్రులది అంటూ కామెంట్స్ చేశారు. కరప్షన్ ఎలా చేయాలో కాంగ్రెస్ పాలన చూసి నేర్చుకోవాలంటూ ఎద్దేవా చేశారు. వ్యవస్థీకృత అవినీతికి కాంగ్రెస్ అధిష్టానం బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. రెండేళ్ల కాంగ్రెస్ పాలన ప్రజలకు మొండి చేయి చూపించిందని... అన్ని వర్గాల ప్రజలను మోసం చేశారని మండిపడ్డారు. ప్రభుత్వం విజన్, విధానం ఏంటో ఎవరికి ఇప్పటికీ అర్థం కావడం లేదన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలు, అభివృద్ధి, సంక్షేమం ఏమీ చేయలేదని మాజీ మంత్రి ఫైర్ అయ్యారు. విజయోత్సవాలు కాదు.. అపజయోత్సవాలు జరుపుకోవాలన్నారు. బిల్లులు అడిగితే విజిలెన్స్ విచారణ, ఏసీబీ దాడులు చేయిస్తున్నారని ఆరోపించారు. ప్రశ్నించిన వారిపై పగబట్టి.. బ్లాక్ మెయిల్ పాలన చేస్తున్నారన్నారు. ఒక్క ఊరిలో కూడా పూర్తి రుణమాఫీ కాలేదని తెలిపారు. మొత్తం రుణమాఫీ అయ్యిందంటే తాను రాజీనామాకు సిద్ధం.. మీరు సిద్ధమా? అంటూ సవాల్ విసిరారు. రైతులకు బేడీలు వేసిన ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అంటూ విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్ రైతు సంక్షోభ ప్రభుత్వమన్నారు. జాబ్ నోటిఫికేషన్ ఇవ్వలేదు కానీ.. మద్యం దుకాణాలకు నోటిఫికేషన్ ఇచ్చారన్నారు. తాగుబోతుల తెలంగాణ వైపు రేవంత్ రెడ్డి అడుగులు వేస్తున్నారంటూ మండిపడ్డారు. రాష్ట్రంలో ఏ ఎన్నికలు వచ్చినా పెద్ద కాంట్రాక్టర్ల బిల్స్ క్లియర్ అవుతున్నాయని మాజీ మంత్రి హరీష్ రావు కామెంట్స్ చేశారు.

## కూకట్‌పల్లి అభివృద్ధిపై కవిత షాకింగ్ కామెంట్స్



హైదరాబాద్, డిసెంబర్ 8: హైదరాబాద్‌కు కూకట్‌పల్లి కామధేనువుగా మారిందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత అన్నారు. సోమవారం కూకట్‌పల్లిలో పర్యటించిన కవిత... వై జంక్షన్‌లో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ... మేడ్చల్ జిల్లా పర్యటనలో భాగంగా కూకట్‌పల్లి నియోజకవర్గంలో తమ పర్యటన సాగుతోందన్నారు. ఇక్కడ 2 వేల కోట్ల రూపాయల విలువైన భూములను ప్రభుత్వం అమ్మిందని... కానీ కూకట్‌పల్లి నియోజకవర్గం కోసం కనీసం రూపాయి కూడా ఖర్చు చేయలేదని విమర్శించారు. గ్లోబల్ రైజింగ్ సమ్మిట్ అని గొప్పగా పెడుతున్నారని.. కానీ కూకట్‌పల్లిలో కనీస వసతులు లేవన్నారు. ఇక్కడ ఒక్క స్టేడియం కూడా లేదని విమర్శించారు. అసలు హైదరాబాద్‌ను గ్లోబల్ సిటీ అని ఎలా చెబుతున్నారని ప్రశ్నించారు. జేఎన్టీయూ మెట్రో స్టేషన్ వద్ద విపరీతమైన ట్రాఫిక్ సమస్య ఉందన్నారు. కూకట్‌పల్లి అంటే ఒక మిని ఇండియా మాదిరిగా ఉందన్నారు. కానీ ఇక్కడ పేదవాళ్లు రెంట్‌కు ఇళ్లు తీసుకునే పరిస్థితి కూడా లేదని చెప్పుకొచ్చారు. ఎన్నికలు ఉన్నప్పుడు మాత్రమే వచ్చి ఓట్లు అడుగుతున్నారని.. ఓట్లు లేనప్పుడు వచ్చి ప్రజల సమస్యలు తెలుసుకోవటం లేదంటూ వ్యాఖ్యలు చేశారు. పాలక పక్షం పట్టించుకోవటం లేదని.. ప్రతిపక్షం అడగటం లేదన్నారు. అందుకే జాగృతి బాధ్యతను భుజాన వేసుకొని ప్రశ్నిస్తోందని తెలిపారు. కూకట్‌పల్లిలో భూములు అమ్మడే కాదు.. ఇక్కడ అభివృద్ధిపై కాంగ్రెస్ శ్రద్ధ పెట్టాలని కవిత డిమాండ్ చేశారు.



## ఐఏఎస్ ఆమ్రపాలికి హైకోర్టులో చుక్కెదురు

హైదరాబాద్: ఐఏఎస్ అధికారిణి ఆమ్రపాలికి తెలంగాణ హైకోర్టులో చుక్కెదురైంది. ఆమెను తెలంగాణకు కేటాయిస్తూ క్యాట్ ఇచ్చిన ఉత్తర్వులపై ఉన్నత న్యాయస్థానం స్టే విధించింది.

ఆమ్రపాలిని ఏపీకి కేటాయిస్తూ అక్టోబర్‌లో కేంద్ర సిబ్బంది, శిక్షణ వ్యవహారాల శాఖ (డీవోపీటీ) ఉత్తర్వులు జారీ చేసింది. దాన్ని ఆమె క్యాట్‌లో సవాల్ చేశారు. దీంతో ఆమ్రపాలిని తెలంగాణకు కేటాయిస్తూ క్యాట్ ఆదేశాలు జారీచేసింది. ఆ ఉత్తర్వులను డీవోపీటీ మళ్లీ హైకోర్టులో అప్పీల్ చేసింది.

విచారణ చేపట్టిన ఉన్నత న్యాయస్థానం.. క్యాట్ ఉత్తర్వులను నిలిపివేస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. దీనిపై కౌంటర్ దాఖలు చేయాలని ఆమ్రపాలి తరఫు న్యాయవాదికి ఆదేశించింది. అనంతరం తదుపరి విచారణను 6 వారాలకు వాయిదా వేసింది.

## ప్రత్యేక ఆకర్షణగా రోబో... సీఎంకు హాయ్ అంటూ పలకరింపు




హైదరాబాద్, డిసెంబర్ 8: భారత్ ఫ్యూచర్ సిటీలో తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్-2025 ప్రారంభమైంది. రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ముఖ్య అతిథిగా హాజరై ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అయితే ఈ గ్లోబల్ సమ్మిట్‌లో రోబో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. వచ్చిన అతిథులకు స్వాగతం పలకడంతో పాటు గ్లోబల్ సమ్మిట్ లక్ష్యాలను అందరికీ వివరిస్తోంది రోబో. ఇక గ్లోబల్ సమ్మిట్‌కు విచ్చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కూడా రోబో హాయ్ అంటూ పలకరించింది. తిరిగి ముఖ్యమంత్రి కూడా రోబోకు హాయ్ చెబుతూ ముందుకు సాగారు. గ్లోబల్ సమ్మిట్‌లో ఈ రోబో అందరినీ ఆకట్టుకుంటోంది.

అలాగే గ్లోబల్ సమ్మిట్‌లో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను సీఎం పరిశీలించారు. ముఖ్యమంత్రితో సినీ నటుడు నాగార్జున కూడా ఉన్నారు. గ్లోబల్ సమ్మిట్ ఆరంభ వేడుకలకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, రాష్ట్ర మంత్రులు, కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, డీజీపీ శివధర్ రెడ్డి, వివిధ రంగాలకు చెందిన దేశ, విదేశాల ప్రముఖులు హాజరయ్యారు. తెలంగాణ రైజింగ్‌పై ప్రత్యేకంగా రూపొందించిన సాంగ్‌ను వేదికపై ప్రదర్శించారు.

## ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించిన జూ. ఎన్టీఆర్.. వ్యక్తిగత హక్కుల రక్షణ కోరుతూ పిటిషన్

న్యూఢిల్లీ: ప్రముఖ నటుడు జూనియర్ ఎన్టీఆర్ తన వ్యక్తిగత హక్కులకు రక్షణ కోరుతూ ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. ఆయన తరఫున సీనియర్ న్యాయవాది సాయి దీపక్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ కామర్స్ సైట్స్, సోషల్ మీడియా వేదికల్లో కంటెంట్.. ఎన్టీఆర్ వ్యక్తిగత హక్కులను ఉల్లంఘించేలా ఉందని న్యాయవాది సాయి దీపక్ కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన జస్టిస్ మన్మీత్ ప్రీతమ్ సింగ్ అరోరా కీలక ఆదేశాలు జారీ చేశారు. జూనియర్ ఎన్టీఆర్ పిటిషన్‌ను ఐటీ నిబంధనలు -2021 కింద ఈ-కామర్స్ వేదికలు, సోషల్ మీడియా కంపెనీలు ఫిర్యాదుగా పరిగణించాలని పేర్కొన్నారు. మూడు రోజులలోపు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తదుపరి విచారణను డిసెంబర్ 22కు వాయిదా వేశారు. గతంలో ప్రముఖ నటులు నాగార్జున, బాలీవుడ్ నటుడు అజయ్ దేవ్‌గణ్, ఐశ్వర్యరాయ్ తదితరులు కూడా ఇదే విధమైన రక్షణను కోరుతూ న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. తమ ఫొటోలు, పేర్లు, వీడియోలను అనుమతి లేకుండా ఇతరులు వినియోగించరాదని కోర్టు ద్వారా ఆదేశాలు పొందారు. తాజాగా జూనియర్ ఎన్టీఆర్ కూడా ఇదే తరహా రక్షణ కోరుతూ కోర్టును ఆశ్రయించారు. వాణిజ్య అంశాల్లో కూడా తన వ్యక్తిగత హక్కులను ఉల్లంఘించరాదని పిటిషన్‌ను దాఖలు చేశారు. సోషల్ మీడియా వినియోగం విస్తృతమైన నేటి జమానాలో పెడ పోకడలు మితిమీరిన విషయం తెలిసిందే. సెలబ్రిటీలపై ట్రోలింగ్ విపరీతంగా పెరిగిపోయింది. ప్రముఖుల ఫొటోలు, ప్లేరు, ఇతర వివరాలతో కొందరు సోషల్ మీడియాలో ఇష్టారీతిన పోస్టులు పెడుతున్నారు. ఏఐని వినియోగిస్తూ కొత్త సమస్యలను సృష్టిస్తున్నారు. ఈ నేపథ్యంలో సెలబ్రిటీలు న్యాయపరమైన రక్షణలు కోరుతూ కోర్టులను ఆశ్రయిస్తున్నారు.



చురకలు



# సుదీర్ఘ రాజకీయ అనుభవ శాలి వి.బి.రాజు - డిసెంబర్ 9... వి.బి.రాజు జయంతి



వల్లూరి బసవరాజు అంటే చాలా మందికి తెలియక పోవచ్చు కాని, వి.బి.రాజుగానే పాతతరం సీనియర్ నాయకునిగా, సుపరిచితుడే. నెహ్రూ, పటేల్, లాల్ బహదూర్ తదితర కాంగ్రెస్ అగ్రనేతలతో నేరుగా సంబంధాలు కలిగి ఉన్న నేత. అయన ప్రసిద్ధులైన స్వాతంత్ర్య సమర యోధుడు, తెలంగాణా ప్రాంతంలో నైజాం పాలనకు వ్యతిరేకంగా, ఆంధ్రోద్యమ కారుడు, పత్రిక నిర్వాహకుడు, రచయిత, రాజకీయ నాయకుడు. హేతువాది. ఆయన పలువురు ముఖ్య మంత్రుల ప్రభుత్వాలలో పని చేశాడు. రెండు సార్లు రాజ్యసభ సభ్యులుగా, రాజ్యసభ ప్యానల్ ఛైర్మన్ గా ఉన్నాడు. ఐక్య రాజ్య సమితి జనరల్ అసెంబ్లీ సమా వేశాల్లో భారత ప్రతినిధిగా పాల్గొ న్నాడు. గోల్కొండ పత్రికలో పలు రచనలు చేశాడు. డైలీ న్యూస్ పత్రికను స్వీయ సంపాదకత్వంలో వెలువరించాడు. ఆంధ్ర ప్రదేశ్ పంచాయతీ రాజ్ రూపకర్త. తెలంగాణ సమస్యపై ప్రధాని ప్రతిపాదనలను సమగ్రంగా పరిశీలించి తగు చర్యలు సూచించ డానికై తెలంగాణ ప్రజాసమితి 1971 జనవరి 3న పధ్నాలుగు మంది సభ్యులతో మియమింప బడిన ఉప సంఘంలో, మర్రి చెన్నారెడ్డి, నూకల రామచంద్రారెడ్డి, ఎస్.బి. గిరి, మదన్ మోహన్, జి. వెంకటస్వామి, జె. ఈశ్వరీ బాయి తదితరులతో బి.బి.రాజు క్రియా శీలక పాత్ర పోషించాడు. వాస్తవానికి దశాబ్దాల క్రితం తెలుగువారి చరిత్రను ప్రభావితం చేసిన అగ్ర నేతలలో ఆయన ఒకరు, స్వయం కృషిలో ఒక గొప్ప నాయకుడుగా ఎదిగాడు. ఇంజనీరుగా వృత్తి కొనసాగిస్తూ, హైదరాబాద్ లో కార్మిక ఉద్యమానికి పునాదులు వేశాడు. హైదరాబాద్ విముక్తి పోరాటానికి, ఆంధ్రోద్య మానికి ఆకర్షితుడై, స్వామి రామానంద తీర్థ, బూర్గుల రామకృష్ణారావు, కొండా వెంకట రంగారెడ్డి, సురవరం ప్రతాపరెడ్డి వంటి అగ్ర నాయకులతో కలిసి పనిచేశాడు. హైదరాబాద్ సంస్థానం భారత దేశంలో విలీనమయ్యాక వెల్లోడీ నాయకత్వాన మొదటి మంత్రివర్గం ఏర్పడినప్పుడు రాజు అందులో స్థానం పొందాడు. వల్లూరి బసవరాజు 1914లో బాపట్లలో ఒక సాధారణ కుటుంబంలో జన్మించాడు. 1934లో మద్రాసు గిండిలోని ఇంజనీరింగ్ కళాశాలలో సివిల్ ఇంజనీరింగ్‌లో డిప్లొమా పొందాడు. చదువు పూర్తయిన తర్వాత 19 యేళ్ల వయసులో హైదరాబాద్ లో ఇంజనీరుగా స్థిరపడ్డాడు. హైదరా బాద్ లో స్థిరపడిన మొదటి ఏడాదే, 1934 లోనే ఖమ్మంలో జరిగిన మూడవ నైజాం రాష్ట్ర ఆంధ్ర మహా సభలలో ఒక సందర్శకునిగా పాల్గొన్నాడు. నిజాం పాలనలో రాజకీయాభిప్రాయాలను వ్యక్తం చేయటానికి గాని, కనీసం సంఘ సంస్కరణలను చర్చించడానికి గాని సంస్థాన ప్రభుత్వం అనుమతి ఇచ్చేవారు కారు. అక్కడ సురవరం ప్రతాప రెడ్డితో ఏర్పడిన సాన్నిహిత్యం వి.బి.రాజుకు తెలంగాణ ప్రజలకు సంబంధించిన కీలకమైన అనేక ముఖ్య విషయాలపై అభిప్రాయాలు ఏర్పరచు కొనటానికి అవకాశం కలిగించింది. 1936లో షాద్ నగర్‌లో 5వ ఆంధ్ర మహాసభ సభాస్థలి నిర్మాణ బాధ్యత తీసుకున్నాడు. 1937లో శ్రీకృష్ణ దేవరాయాంధ్ర భాషా నిలయానికి సురవరం ప్రతాపరెడ్డి అధ్యక్షులుగా, వి.బి.రాజు కార్యదర్శిగా పని చేశారు. శ్రీకృష్ణ దేవరాయాంధ్ర భాషా నిలయం సాహితీ వేత్తలకు జాతీయ వాదులకు, తెలుగు భాషా ప్రేమికులందరికీ ఆరోజుల్లో ప్రధాన కేంద్రంగా ఉండేది. సురవరం ప్రతాపరెడ్డి ఆధ్వర్యంలో వెలువడే గోలకొండ పత్రికలో ఆయన తెలంగాణ ప్రాంతాభివృద్ధికోసం పలు రచనలు చేశాడు. నిజాం రాష్ట్ర రైల్వే, రోడ్డు రవాణా సంస్థల కార్మిక సంఘాలకు, అఖిలభారత ఏర్‌వేస్ ఎంప్లాయిస్ ఫెడరేషన్‌కి ఆయన అధ్యక్షులుగా ఎన్నికైనాడు. 1950 జూన్ 12న వెల్లోడీ మంత్రివర్గంలో కార్మిక పునరావాస శాఖ మంత్రిగా పని చేశాడు. 1952లో జరిగిన సాధారణ ఎన్నికలలో సికిందరా బాదు నియోజకవర్గం నుంచి శాసనసభకు ఎన్నికైనాడు. బూర్గుల రామకృష్ణారావు మంత్రివర్గంలో పని చేశాడు. 1950లో నీలం సంజీవ రెడ్డి మంత్రివర్గంలో ప్రణాళికా మంత్రిగా, దామోదరం సంజీ వయ్య, కాసు బ్రహ్మానందరెడ్డి మంత్రివర్గాలలో కూడా వివిధ మంత్రిత్వ శాఖల పదవులు నిర్వహించాడు. ప్రణాళిక శాఖ మంత్రిగా ఆంధ్ర ప్రదేశ్‌లో పంచాయతీ రాజ్ వ్యవస్థ ఏర్పడటానికి కారకుడైనాడు. మంత్రి వర్గం నుండి బయటకు వచ్చాక ఆయన ఆంధ్ర ప్రదేశ్ రోడ్డు రవాణా సంస్థ చైర్మన్‌గా నియమింప బడినాడు. రెండేళ్ళ పదవీ కాలంలో మొదటి సారిగా రాష్ట్రంలో రాత్రి బస్ సర్వీసును పరిచయం చేసింది వి.బి. రాజే కావడం విశేషం. 1967లో పెద్దఎత్తున లేచిన తెలంగాణ ఉద్యమ నేపథ్యంలో వి.బి.రాజు తన మంత్రి పదవి త్యజించాడు. 1970నుండి రెండు పర్యాయాలు రాజ్యసభ సభ్యుడిగా కొనసాగాడు. అఖిల భారత కాంగ్రెస్ కమిటీకి కార్యదర్శిగా కూడా పని చేశాడు. రాజు 1986 డిసెంబరు తొమ్మిదో తేదీన మరణించాడు.

**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్... 9440595494**

# అపర శ్రీ శుకుడు రాజన్న శాస్త్రి

## డిసెంబర్ 9... పరమ భాగవత తోత్తముని జయంతి



కోటి రతనాల వీణ తెలంగాణ లోని కరీంనగర్ జిల్లా గోదావరి తీరం శ్రీలక్ష్మీనర సింహ దివ్య పుణ్యక్షేత్రం. ధర్మపురిలో వేద పురాణ జ్యోతిష, సంగీత, సాహిత్య కళా రంగాలకు చెందిన పండితులు, విద్వాంసులు, ఆధ్యాత్మిక వేత్తలు జన్మించి ఆఖండ కీర్తి ప్రతిష్టలు గడించారు. జీవితాంతం భాగవత చింతన తోనే గడుపుతూ 5 దశాబ్దాలుగా పలు వేదికలపై అద్భుత ప్రవచనాలు చేసిన మహానుభావుడు, కర్మ యోగి గుండి రాజన్న శాస్త్రి. ఆబాల గోపాలాన్ని పరవశింపజేసే శాస్త్రి ప్రవచనాలకు దేశవిదేశీయులు సైతం అభిమానులయ్యారు. అపరశుక, వాల్మీకి, వ్యాసునిగా ప్రసిద్ధిగాంచిన ఆయన పాలరాతి విగ్రహాన్ని ధర్మపురిలో నెలకొల్పారంటే శాస్త్రి గొప్పతనం అర్థం చేసుకోవచ్చు.

**జీవిత విశేషాలు..** గుండి లక్ష్మీనరసింహ ఘనాపాటీ, లక్ష్మీ నర్సమ్మ దంపతులకు 9,12.1898లో జన్మించిన శాస్త్రి గుండి పాపయ్యశర్మకు దత్త పుత్రుడయ్యాడు. ఉర్దూ మాద్యమంలో ప్రాథమిక విద్య, సంస్కృతాంధ్ర భాషల్లో పాండిత్యం వొఝల హన్మంతయ్య సిద్ధాంతి వద్ద లీలావతి గణితం, లౌకిక విద్యలు, తండ్రి వద్ద వేదాధ్యయనం మంథెన గట్టు కృష్ణమూర్తి వద్ద వేదాంగాలు, ఉపనిషత్తులు, ప్రస్తాన త్రయం, శాస్త్రాధ్యయనం, ఇతిహాస పురాణాదులలో శిక్షణ పొందారు. భార్య పేరు గుండమ్మ, ఆయనకు నలుగురు కుమారులు ఒక కుమార్తె కలిగారు. భాగవత, శ్రీవైష్ణవ సంప్రదాయానికనుగుణంగా ముకుందుడు, రఘురాముడు, అచ్యుతుడు, గోవిందుడు, హరిప్రియ అని నామకరణాలు చేశారు. మూర్తీభవించిన భాగవతంగా పేరొందిన నవయో గీంద్ర భిక్షుగీత, ఉద్దవ బోధనలు, రుక్మిణీ కల్యాణం గోపికాగీతాలు, కుంతి, భీష్మ, ధృవ, ప్రహ్లాద, గజేంద్ర బ్రహ్మాస్తవరములు, ఇతిహాసాలు, మృదుమధురంగా ప్రవచించేవారు. ఇప్పటికీ ఆయనను అందరూ అవతార పురుషుడుగా, దైవాంశ సంభూతుడుగా, వ్యాసుడే భువిపైకి రాజన్న పేరుతో వచ్చాడని భావిస్తారు. ఆయన కులమతాలకతీతంగా కలిసిపోవడం, ధర్మపురిలో వారసంత నిర్వహణకు ప్రేరణ, బాలబాలికలను చేరదీసి సంస్కృతం మాట్లాడించడం, వితంతువులకు విద్య అవసరమని భావించి వారిని చదివించడం లాంటి కార్యక్రమాలు నిర్వహించారు. భూస్వాములు, దొరలు వస్తే వారిని తన ప్రవచనాలతో దాతలుగా మార్చేవారు. భాగవతంలో 18వేల శ్లోకాలు కంఠతా చదువుతూ అర్థతాత్పర్యాదులను వివరించ గలిగే అసాధారణ ధారణ శక్తి కలవారు. శాస్త్రి పాలరాతి విగ్ర హాన్ని గోదావరి నది వద్ద శ్రీరామ ఆలయ సమీపంలో తాడూరి బాలకృష్ణ మహోపాధ్యాయుడు తన సొంత స్థలంలో ఆవిష్క రింప జేశారు. గుంటూరు వాసులు సంగా వెంకటనారాయ శర్మ ఆదిలక్ష్మీ దంపతులు, పెద్దపల్లి, కరీంనగర్ లో జరిగిన ప్రవచనాల్లో శాస్త్రి ప్రవచనాలను 2005లో శాస్త్రి కుమారుడు రామచంద్రుడు టేపులను సీడీలు, క్యాసెట్లుగా రూపొందించారు. ఇందులో ఉప్పుల రాధాకృష్ణ కృషి చాలా ఉంది. పలుమార్లు కాశీలో కూడా ప్రవచనం చేసిన శాస్త్రిచే కరీంనగర్ వీరాంజనేయ స్వామి దేవాలయంలో మంగళంపల్లి మురహరిశర్మ భాగవత సప్తాహం చేయించారు. శాస్త్రి ప్రవచనాలను 50 మంది లబ్ద ప్రతిష్టులు, శాస్త్రి బంధువులు రాసిన అభిప్రా యాలు, వ్యాసాలతో మనుమడు విష్ణుప్రసాద్ సతీమణి డాక్టర్ వారిజా రాణి సంపాదకురాలిగా, మరో మనుమడు గుండి విష్ణుప్రసాద్ ప్రేరణతో ఎం. శేషాచలం అండ్ కంపని "ఎమెస్కో" ఓ పుస్తకం ప్రచురించింది. ఇంకా ఎందరిదో కృషి ఫలితంగా ఈ మహనీయుని చరిత్ర వెలుగు చూసింది. 30 మే 1975లో 82వ యేట శాస్త్రి బ్రహ్మలీనులైనారు.

**శాస్త్రి ప్రతిభకు నిదర్శనాలు...** 1968లో జర్మనీ యువతి శాస్త్రిని సత్కరించి ప్రవచనాలను ఇంగ్లీషులో తర్జుమా చేయించుకొని సంస్కృతం నేర్చుకొంది. ఇంగ్లాండ్ ఎంపీ హ్యూస్ బ్రిటీష్ ప్రభుత్వ ప్రతినిధిగా వచ్చి ప్రవచానాన్ని విని భారత దేశ ధార్మిక ప్రవృత్తి గొప్పదని కొనియాడారు. ధర్మపురి సంస్కృతాంధ్ర కళాశాలకు శంకుస్థాపన చేయగా వేలాది ఉభయ భాషా పండితులకు కల్పతరువై విరాజిల్లుతోంది. ప్రాక్పశ్చిమ ఉత్తర దక్షిణ యాత్రలను సంపూర్ణంగా కాలినడకన పూర్తి చేశారు. జిల్లాకు ఒకప్పటి ముస్లిం కలెక్టర్‌కు ఉర్దూ పారశీక భాషల్లో భాగవత శ్లోకాలు అర్థతాత్పర్యాదులతో వివరించారు. మాజీ ప్రధాని పీవీ నరసింహారావు,
దివంగత మాజీ ముఖ్యమంత్రులు బూర్గుల రామృష్ణారావు, మర్రి చెన్నారెడ్డి, దామోదరం సంజీవయ్య, కెవీ కేశవులు, కవిసామ్రాట్ విశ్వనాథ, జువ్వాడి గౌతంరావు, జువాడి చొక్కారావు, తెన్నేటి విశ్వనాథం, కాసుగంటి నారాయణరావు, దివాకర్ల వెంకటావధాని, జువ్వాడి రత్నాకర్ రావు, కప్పగంతుల లక్ష్మణశాస్త్రి, వానమమాలై వరదాచార్యులు, మల్లాది, మార్కండేయశాస్త్రి, వేమూరి లక్ష్మీ నరహరి శాస్త్ర, వంటివారు ఆయన పురాణానికి శ్రోతలుగా పలు సందర్భాలలో శాస్త్రి స్వగృహానికి ఏతెంచి పురాణ శ్రవణం చేసి, పలు సందేహాలు నివృత్తి చేసుకున్నా రంటే గొప్పతనం కాక మరేమిటి. కరపాత్ర స్వామీజీ, శృంగేరీ, కంచి, కామకోటీ, పుష్పగిరి పీఠాధిపుతులు, మధ్వ పీఠాధిపతులు, తలపాక మహారాజు, త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ పెద్ద జీయర్ స్వామి వంటి వారు ధర్మపురిని సందర్శించినపుడు శాస్త్రి ప్రవచనాలు విని అభినందించి సన్మానించారు. కరీంనగర్ కాంగ్రెస్ కురు వృద్దులు మాజీ ఎంపీ, మాజీ మంత్రి జువ్వాడి చొక్కారావు ఇల్లు కట్టిస్తానన్నా, కాసుగంటి నారాయణరావు కొండగట్టు పై 200 ఎకరాల భూమిని రాసిస్తానన్నా, మానకొండూర్ సర్పంచ్ సదాశివరావు తన భూమినంతా దానం చేస్తానన్నా, నాయకులు రాష్ట్రపతి పురస్కార మిప్పిస్తా మన్నా సున్నితంగా తిరస్కరించిన ఉదాత్తుడు రాజన్న శాస్త్రి.

**రామ కిష్టయ్య సంగనభట్ల...9440595494**

# దైవ సమానులుగా గుడిలో నిత్య పూజలు అందుకుంటున్న గుండి రాజర్షి"

## డిసెంబర్ 9... కర్మయోగి జయంతి సందర్భంగా స్మృత్యంజలి



ఆయన కర్మయోగి. అష్టాదశ పురాణాలను ఔపోసన పట్టి, వేద వేదాంగ సకల శాస్త్రాలపై సాధికారికత కలిగి ఎలాంటి పౌరాణిక సందేహాన్ని అయినా నివృత్తి చేయగలిగిన అపర వేదవ్యాసుడు ఆయన. నిరంతర తపోనిష్టతో, నిత్య భాగవత పారాయణము మందే మునిగి తేలి, సిద్ధిపొందిన తాపసి ఆయన. దివంగత ప్రధాని పి.వి. నరసింహా రావు మొదలు గాగల అగ్ర నేతలు, కవిసామ్రాట్ విశ్వనాథ లాంటి సాంప్రదాయ కవులు, ప్రాచ్య పాశ్చాత్య విద్యావేత్తలు ఎందరి చేతనో పలుమార్లు దర్శింప బడి మహామహులచే పూజింప బడిన పరమ భాగవతోత్తముడు ఆయన. ఆయనే గుండి రాజర్షిగా పేరెన్నిక గన్న గుండి రాజన్న శాస్త్రి. ధర్మపురి క్షేత్ర గోదావరి తీరాన గుడి నిర్మించబడి, విగ్రహ ప్రతిష్ఠ జరిగి, నిత్య పూజలు అందుకుంటున్న దైవ సమానులు గుండి రాజర్షి. భారతీయ ప్రాచీన ఆర్ష విద్యలకు నెలవై, హైందవ సనాతన సాంప్రదాయాలకు పట్టు కొమ్మయై, వేద సంస్కృతి సభ్యతలకు ఆలవాలమై, వరదాయినిగా, భక్తి ముక్తి ప్రదాయినిగా తెలుగునేలపై వాసికెక్కిన, గోదావరి తీరస్త పవిత్ర తీర్థ రాజం ధర్మపురి క్షేత్ర కీర్తి ప్రతిష్టలను, దశదిశలా వ్యాపింప జేశారు, ఆపర వేదవ్యాసులుగా కీర్తించబడే గుండి రాజర్షి... వ్యాస, వాల్మీక, కాళిదాస, కాణాద, పైల, జెమిని, పరాశర ఆపస్తంభ అది మునులు ఋషులు, యోగులు, కర్మిష్ఠులు, పరివ్రాజకుల, ఆధ్యాత్మికుల వార సత్వాన్ని కొనసాగిస్తూ, దేవతా పూజలతో, ఆధ్యాత్మిక ఆది భౌతిక కార్యక్రమాలను, అక్షయ నిధులైన పురాణ ప్రవచనాలను, క్షేత్ర రాజం పరిరక్షిస్తూనే ఉంది. ఆ సంప్రదాయ ఆచరణ క్రమంలో "అపర వేదవ్యాసులు" గా పేరెన్నికగన్న రాజన్న శాస్త్రి తన స్వగృహంలో ప్రవచనాలను నిర్వహించగా, దివంగత భారత ప్రధాని పీవీ నరసింహారావు, దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ మర్రి చెన్నారెడ్డి, ఆచార్య దివాకర్ల వెంకటావధాని, తెన్నేటి విశ్వనాథం, విశ్వనాథ సత్యనారాయణ లాంటి మహామహులు ఎందరో, ప్రత్యేకించి ఈ క్షేత్రానికి వచ్చి, రాజన్న శాస్త్రి, భాగవత ప్రవచనాలను విని, ఆధ్యాత్మిక లోకాలలో విహరించి, ఆయనకు ప్రణమిల్లిన సంఘటనలు, క్షేత్ర వాసులకు చర్విత చర్వణలే. కవిసామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణచే "మ్రోయు తుమ్మెద" లో వర్ణించ బడినట్లుగా, గుండి రాజన్న శాస్త్రి అష్టాదశ పురాణాలను, నిరంతరం అధ్యయనం చేస్తుండగా పాశ్చాత్య పండితులెందరో, పౌరాణిక సందేహ నివృత్తికై శాస్త్రి వద్దకు వెళ్లిన సంఘటనలు, క్షేత్ర వాసులకు నిత్య జ్ఞాపకాలే. సాక్షాత్తు "వేదవ్యాస అవతారం"గా భావించబడే రాజన్న శాస్త్రి విగ్రహ ప్రతిష్ట చేసి, ఆలయం నిర్మించి, నిత్య పూజలు జరపడం విశేషం. ధర్మపురి క్షేత్రంలో గుండి లక్ష్మీ నరసింహ ఘనాపాఠి లక్ష్మీ నరసమ్మ దంపతులకు 1893 డిసెంబర్ 9న జన్మించిన శాస్త్రి, గుండి పాపయ్య కుటుంబానికి దత్తపుత్రులైనారు. బాల్యం నుండే ప్రహ్లాదాదుల వలె పరమాత్మ చింతనాపరులై, దివ్య ప్రబంధాదుల గానం చేస్తూ, ప్రాథమిక విద్య ఉర్దూ భాషలో జరిగినా, అష్ట వర్షములకే ఉపనయన సంస్కారులై, గాయత్రీ మంత్రోపాసకులై, వేదాధ్యయనాలు తండ్రి వద్ద చేసి, లీలావతి గణిత సాధన, మంథని చెందిన గట్టు కృష్ణశాస్త్రి వద్ద అమర భాష శాస్త్రాలను నేర్చుకున్నారు. అనంతరం వేద వేదాంగ, శాస్త్ర ఆగమ, ప్రస్థాన త్రయ, సాయణ భాష్య, శాంతి పాఠాలను రామాయణ, భారత, భాగవతాది పురాణాలు, ప్రధానంగా భాగవత బ్రహ్మసూత్రాలను కంఠోపాఠంగా చెప్పగలిగిన, అసాధారణ ధారణ శక్తి సంపన్నులైనారు. స్థానిక లక్ష్మీనరసింహ ఆలయంలో, కొంతకాలం నిరంతర భాగవత సప్తాహ యజ్ఞాలను నిర్వహించారు. ఉష: కాల మందే లేచి, నిత్య గోదావరి స్నానం, సంధ్యావందనం, ధ్యాన, ధారణ, పూజ, ఉపాసన, పారాయణ ఆది సత్కార్యా చరణలు నిత్య కృత్యాలుగా కలిగి ఉండేవారు. సమకాలీన సలక్షణ వేద ఘనాపాటిల సన్నిధిలో, వేదార్థ, ఉపనిషత్, భాష్య ప్రవచనం గావించేవారు. భక్త బృందం సమేతంగా, రాత్రి సత్సంగ, భక్తి మయ జాగరణలు, సంగీత సభలు, సాహితీ గోష్టులు, భజనలతో గడిపేవారు. ప్రధానంగా ధర్మపురి దేవస్థానంలో, వైకుంఠ ఏకాదశి, నరసింహ నవరాత్రులు, శివరాత్రులు, ఉగాది, ఆదిగా పర్వ దిన వేడుకలను ప్రారంభించి ఆచరింప చేశారు. పిత్ర స్వార్జితములను, దానధర్మాలకు సన్మానాలకు ధారపోసి, దాన గుణం సంపన్నులైనారు. బాలబాలికలచే, సంస్కృతం మాట్లాడింప చేస్తూ బాలురను శృతి, స్మృతి, పురాణ, కావ్య భక్తిరస ప్రధాన శ్లోకాలు, పద్యాలను కంఠస్తం చేయించేవారు. 1966 విజయదశమి నాడు క్షేత్ర రామలింగేశ్వరాలయంలో, సంస్కృతాంధ్ర డిగ్రీ ప్రాచ్య కళాశాల ప్రారంభించి, ప్రాణ ప్రతిష్ట గావించారు. నాటికీ, నేటికీ ఈ కళాశాల వేలాది మంది భాషా పండితుల తయారీ కేంద్రంగా భాసిల్లుతుండడానికి కారణ భూతు లైనారు . దేశ విదేశీయులు, శాస్త్రి దర్శనం చేసుకొని, పలు సందేహాలు నివృత్తి చేసుకునేవారు. శ్రీ శ్రీ శ్రీ శృంగేరి, కంచి కామకోటి, పుష్పగిరి, హంపి, పీఠాధిపతులు, శ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ పెద్ద జీయర్ స్వామి, తదితర జగద్గురువులు క్షేత్రానికి విచ్చేసిన అన్ని సందర్భాలలోనూ, వారి సన్నిధిన అష్టాదశ పురాణ సందర్భాలను ప్రవచించి, వారిచే సన్మానితులు అయినారు. పి.వి. నరసింహా రావు, బూర్గుల రామకృష్ణారావు, మర్రి చెన్నారెడ్డి, దామోదరం సంజీవయ్య తెన్నేటి విశ్వనాథం, విశ్వనాథ సత్యనారాయణ, దివాకర్ల వెంకటావధాని, బిరుదు రామరాజు, మార్కండేయ శాస్త్రి, కప్పగంతుల లక్ష్మణశాస్త్రి, మల్లాది చంద్రశేఖర శాస్త్రి తదితరులు, పలుమార్లు రాజర్షి వద్దకు ఏతెంచి పునీతుల మైనా మని భావించి, అపర వేదవ్యాసులుగా కీర్తించిన సందర్భాలు అనేకానేకాలు. 84 సంవత్సరాలు జీవించి, ధర్మపురి వాసులను సన్మార్గమున నడిపి, 1975 మే 30న జీవన్ముక్తులై శివైక్యం పొందారు. శాస్త్రి మనమడు గుండి విష్ణు ప్రసాద్ చొరవతో, ఆయన సతీమణి ప్రొఫెసర్ వారిజా రాణి సంపాదకత్వంలో, లబ్ధ ప్రతిష్టులైన వారి ప్రత్యేక వ్యాసాలతో అపూర్వ, అపురూప, అమూల్య పుస్తకం అచ్చు వేసి, రాజర్షి గురించి పలు అంశాలు పొందు పరచ గలిగారు. "భగవత్ సాన్నిహిత్య సాధనకు సాధువులే కానక్కరలేదని, కౌటింబిక జీవన విధానంలోనూ, భగవానుని భక్తితో కొలిస్తే, ముక్తి లభించగలదని", కొత్త సంప్రదాయానికి పురుడు పోసి, నిత్య నిరంతర పురాణ ప్రవచనాలు నిత్యానందంగా భావించి, సిద్ధి పొందిన తాపసి రాజ రుషికి గోదావరి తీరాన, రామమందిర సమీపాన, స్థిర విగ్రహ ప్రతిష్ట గావించి, గుడి కట్టి నిత్య పూజలు నిర్వహించడం, ధర్మపురి వాసులు చేసుకున్న పురాకృత సుకృతం.

**రామ కిష్టయ్య సంగనభట్ల...9440595494**

# పెట్టుబడుల కొత్త పథం... అభివృద్ధి కొత్త అధ్యాయం: తెలంగాణ గ్లోబల్ సమ్మిట్




తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్%–%2025 తెలంగాణ రాష్ట్రానికే కాదు, భారత దేశానికీ ఒక కొత్త ఆర్థిక దిశను చూపించే విశిష్ట వేదికగా రూపుదిద్దు కుంటోంది. ఈ సమ్మిట్ కేవలం పెట్టుబడి దారుల సందర్శన లేదా వ్యాపార ప్రదర్శన మాత్రమే కాదుబీ ప్రపంచ ఆర్థిక పటంలో తెలంగాణను ఒక శక్తివంతమైన కేంద్రంగా నిలబెట్టే సంకల్పానికి ప్రతీక. వేరు రాష్ట్రంగా ఆవిర్భవించినప్పటి నుండి తెలంగాణ చేపట్టిన పారదర్శక విధానాలు, వేగవంతమైన పారిశ్రామీకరణ, ఐటీ రంగంలో సాధించిన అద్భుత పురోగతి, మౌలిక వసతుల విస్తరణలో ఇప్పటికే తెలంగాణ ప్రత్యేక గుర్తింపు పొందినప్పటికీ, ఇప్పుడు అంతర్జాతీయ గుర్తింపునిస్తూ, భవిష్యత్ దశాబ్దాలను ప్రభావితం చేసే విధంగా ఈ సమ్మిట్ రాష్ట్ర ఆత్మ విశ్వాసాన్ని ప్రపంచానికి తెలియ జేస్తోంది. హైదరాబాదు ఇప్పటికే భారత దేశంలోని అత్యంత చురుకైన ఆవిష్కరణ కేంద్రాలలో ఒకటిగా ఎదిగి, %టూ–ఊూూూ% విధానంతో పెట్టుబడి అనుమతుల్లో దేశంలోనే వేగవంతమైన వ్యవస్థను ఏర్పాటు చేసి, ఫార్మా సిటీ, జీనోమ్ వ్యాలీ, %ఐ–ఎబఎ, ఎ–ఔశీతీఎం% వంటి సంస్థలతో ప్రపంచ స్థాయి మౌలిక వసతులను సృష్టించింది. ఈ బలం పైనే నిలబడి సమ్మిట్‌లో తెలంగాణ తన సంపూర్ణ సామర్థ్యాన్ని ప్రపంచానికి ప్రదర్శించేందుకు సిద్ధమవుతోంది. ప్రపంచంలోని ప్రఖ్యాత కంపెనీలు, అంతర్జాతీయ ఆర్థిక సంస్థలు, వెంచర్ క్యాపిటల్ నిధులు, పరిశ్రమల నిపుణులు, సాంకేతిక దిగ్గజాలు అధిక సంఖ్యలో పాల్గొనడం ద్వారా సమ్మిట్ ఒక ఆర్థిక ప్రయోగశాలలా మారబోతోంది. ఈ వేదికపై జరుగబోయే చర్చలు, ఒప్పందాలు, పెట్టుబడి ప్రతిజ్ఞలు, భవిష్యత్ మౌలిక సదుపాయాల రూపకల్పన రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు దీర్ఘకాల దిశానిర్దేశం చేస్తాయి. సెమీకండక్టర్ తయారీ, ఎలక్ట్రానిక్స్ మేన్యుఫ్యాక్చరింగ్, కృత్రిమ మేధస్సు, బయోటెక్నాలజీ, లైఫ్‌సైన్స్ రీసెర్చ్ వంటి కీలక రంగాలకు తెలంగాణ ప్రత్యేకంగా దృష్టి సారించడం రాష్ట్ర భవిష్యత్తు దిశను మరింత స్పష్టంగా చూపిస్తోంది. ప్రపంచ దేశాలు ఇంధన సంక్షోభం, వాతావరణ మార్పులు, గ్రీన్ ఎనర్జీ వంటి సమస్యలను ఎదుర్కొంటున్న తరుణంలో, తెలంగాణ రిన్యూవబుల్ ఎనర్జీ, గ్రీన్ హైడ్రజన్, విద్యుత్ వాహనాలు, స్మార్ట్ ఫ్యాక్టరీలు వంటి రంగాలలో పెట్టుబడులను ఆకర్షించడం ద్వారా కొత్త తరపు పరిశ్రమల గమ్య స్థానంగా అవతరించ బోతోంది. పెట్టుబడి దారులకు అవసరమైన పారిశ్రామిక పార్కులు, రవాణా సౌకర్యాలు, లాజిస్టిక్స్ హబ్‌లు, అనుమతుల సౌలభ్యం వంటి అంశాల్లో తెలంగాణ ఇప్పటికే దేశంలో ప్రముఖ స్థానంలో ఉండడం ఈ సమ్మిట్‌కు మరింత బలం చేకూరుస్తోంది. స్టార్టప్‌లకు తెలంగాణ ఇప్పటికే ఇచ్చిన ప్రోత్సాహం అంతర్జాతీయ వేదికలపై ప్రశంసలు పొందింది. ప్రపంచ స్థాయి యాక్సిలేటర్లతో భాగస్వామ్యాలు, ఇన్నోవేషన్ పోర్టల నిర్మాణం, యువతకు నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలుఇవి అన్నీ ఈ సమ్మిట్ ద్వారా మరింత విస్తరించబోతున్నాయి. విదేశీ ఇన్నోవేషన్ సంస్థలు, వెంచర్ నిధులు సమ్మిట్‌లో పాల్గొనడం వల్ల తెలంగాణ యువతకు ప్రపంచ స్థాయి పరిశోధన అవకాశాలు, పెట్టుబడి అవకాశాలు పెరగడం ఖాయం. హైదరాబాదు గ్లోబల్ స్టార్టప్ మైదానంగా మారడానికి ఈ సమ్మిట్ మరొక దృఢమైన మెట్టు అవుతుంది. సమ్మిట్ రాష్ట్ర సామాజిక – ఆర్థిక వ్యవస్థపై ప్రత్యక్ష ప్రభావం చూపే అవకాశం ఉంది. పరిశ్రమల విస్తరణతో ఉద్యోగావకాశాలు పెరగడం, గ్రామీణ ప్రాంతాలకు అనుబంధ పరిశ్రమల రూపంలో లాభాలు చేరడం, నిర్మాణ రంగ చైతన్యం, సేవా రంగాలు మరింత ప్రోత్సహం పొందడయ ఇవన్నీ రాష్ట్ర సమగ్ర అభివృద్ధికి బాటలు వేస్తాయి. పెట్టుబడి దారులతో జరగబోయే చర్చలు తెలంగాణ యొక్క అభివృద్ధి మోడల్‌ను మరింత బలోపేతం చేస్తాయి. పాలన వ్యవస్థలో పారదర్శకత, వేగవంతమైన నిర్ణయాలు, ప్రజల అవసరాలను అర్థం చేసుకుని రూపొందించిన విధానాలు తెలంగాణను వ్యాపారాలకు అత్యంత అనుకూల రాష్ట్రంగా నిలబెట్టాయి. ఈ విశ్వాసాన్ని అంతర్జాతీయ వేదికపై మరింత బలపరిచే అవకాశం ఈ సమ్మిట్‌తో లభిస్తోంది. మొత్తం మీద, తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్%–%2025 రాష్ట్ర అభివృద్ధి కథలో ఒక కీలక మలుపు. ఇది తెలంగాణను పెట్టుబడుల గమ్యస్థానంగా, ఆవిష్కరణల కేంద్రంగా, సాంకేతిక శక్తిగా, సుస్థిర అభివృద్ధికి మార్గదర్శక రాష్ట్రంగా ప్రపంచానికి పరిచయం చేసే అద్భుత అవకాశంగా నిలుస్తోంది. తెలంగాణ దిశ, దృష్టి, ధైర్యంఈ మూడు కలిసి ఇచ్చే సందేశం స్పష్టం: ప్రపంచ వేదికపై తెలంగాణ ఎదుగుదల ఇక అప్రతిహతం.

**రామ కిష్టయ్య సంగన భట్ల సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...9440595494**

చురకలు

## సంపాదకీయం

### మీడియాలో 'స్తబ్దత'.. మంచిదేనా?

రెండు తెలుగు రాష్ట్రాలలోనే కాదు.. దేశవ్యాప్తంగా కూడా మీడియాలో ఒక స్తబ్దత రాజ్యమేలుతోంది!. ఇది మీడియా అంటే గిట్టని వారు.. మీడియా పై నిందలు వేసే వారు చెబుతున్న మాట కాదు. ఐక్యరాజ్యసమితి లోని మీడియా విభాగం ప్రపంచ స్థాయి మీడియాపై చేసి సర్వేలో ఇటీవల వెల్లడించిన విషయాలు. భారత దేశానికి వచ్చే సరికి.. ఒక స్తబ్దత రాజ్యమేలుతోందన్నది ఈ సర్వే సారాంశం. ముఖ్యంగా భావప్రకటనా స్వేచ్ఛకు అగ్రతాంబూలం ఇచ్చే భారత్ వంటి దేశాల్లో.. మీడియాకు ప్రాధాన్యం ఉంది. కానీ, 2014 తర్వాత.. ఎందుకో.. మీడియా స్తబ్దతకు తార్కాణంగా మారిందన్నది ఐక్యరాజ్యసమితి చేసిన విశ్లేషణ. అంతేకాదు.. భారత్‌లో చోటు చేసుకున్న అనేక పరిణామాలను.. ప్రపంచ దేశాలకు చెందిన మీడియా ప్రొజెక్టు చేసేవరకు కూడా బయటకు రాకపోవడాన్ని ఈ సందర్భంగా ఐక్యరాజ్యసమితి నివేదిక స్పష్టం చేయడం గమనార్హం. ఉదాహరణకు ఏపీలో జరిగిన సెకీ ఒప్పందం.. ఈ క్రమంలో చేతులు మారిన సొమ్ము.. వంటివి అమెరికా పత్రిక వాషింగ్టన్ పోస్టు వెలికి తీసే వరకు బయటకు రాలేదు. అదేవిధంగా ఇటీవల గౌతం అదానీకి.. ఎల్ ఐసీ షేర్లను బదలాయిస్తున్న వ్యవహారం కూడా.. ఫ్రెంచ్ పత్రిక బయట పెట్టే వరకు వెలుగు చూడని విషయాన్ని కూడా ఐక్యరాజ్య సమితి ప్రస్తావించింది. ఇవి మీడియాలో నెలకొన్న స్తబ్దతకు ఉదాహరణలని పేర్కొంది. ఇదేసమయంలో 2014కు ముందు 2-జీ స్పెక్ట్రం కుంభకోణం స్థానిక మీడియా ద్వారానే వెలుగు చూసిన విషయాన్ని ప్రస్తావించింది. ఇక, ప్రత్యేకంగా పేర్కొనకపోయినా.. స్థానిక మీడియా సంస్థల్లోనూ విధానపర మైన పక్షవాతం (ఆర్గనైజేషనల్ పెరాలిసిస్) కొనసాగుతోందని సమితి తెలిపింది. ఇది ప్రజాస్వామ్య వ్యవస్థకు ఇబ్బంది కలిగించే అంశమని అభిప్రాయపడడం గమనార్హం. అయితే.. ఒక్క భారత్‌లోనే ఇలా ఉందా? ఇతర దేశాల్లో లేదా? అనే ప్రశ్నలకు కూడా సమాధానం చెబుతూ.. విశ్వగురుగా ప్రపంచ దేశాలకు దిశానిర్దేశం చేస్తున్న భారత్‌ను తలమానికంగా భావిస్తున్నట్టు పేర్కొనడం గమనార్హం.

# భారత ప్రజాస్వామ్య చరిత్రలో రాజ్యాంగ తొలి సమావేశం కీలక ఘట్టం

## డిసెంబర్ 9...భారత రాజ్యాంగ తొలి సమావేశ దినం

భారత దేశానికి స్వాతంత్ర్యం పొందిన తర్వాత, దేశం శాశ్వతమైన పరిపాలనా వ్యవస్థ కోసం ఒక రాజ్యాంగాన్ని రూపొందించు కోవాల్సిన అవసరం అత్యవసరంగా మారింది. ఈ దిశగా 1946 డిసెంబర్ 9న రాజ్యాంగ సభ తొలి సమావేశం జరిగింది. ఈ సమావేశం భారత ప్రజాస్వామ్య చరిత్రలో ఓ కీలక ఘట్టంగా నిలిచింది.

**రాజ్యాంగ సభ ఏర్పాటుకు నేపథ్యం...** కేబినెట్ మిషన్ ప్రణాళిక (1946):బ్రిటన్ ప్రభుత్వం, స్వతంత్ర భారత దేశానికి రాజ్యాంగాన్ని రూపొందించేందుకు ఒక రాజ్యాంగ సభ ఏర్పాటుకు పథకాన్ని రూపొందించింది. కేబినెట్ మిషన్ ప్రణాళిక ప్రకారం, మొత్తం 389 మంది సభ్యులతో రాజ్యాంగ సభ ఏర్పడింది.

**సభ సభ్యుల ఎంపిక...** సభ సభ్యులను ప్రజల ప్రత్యక్ష ఓటింగ్ ద్వారా కాకుండా, ప్రాంతీయ శాసనసభల ద్వారా ఎన్నుకున్నారు. 296 మంది సభ్యులు బ్రిటిష్ ఇండియా నుంచి, 93 మంది సభ్యులు దేశీయ సంస్థానాల నుంచి ఎంపికయ్యారు.

**భిన్నత్వానికి ప్రాధాన్యత...** భారత రాజ్యాంగ సభ, దేశంలోని అన్ని వర్గాలు, మతాలు, కులాలకు చెందిన ప్రతినిధులను చేర్చింది. ఇది భారత దేశంలోని విభిన్నతను అద్భుతంగా ప్రతిబింబించింది.

**తొలి సమావేశం, ప్రధానాంశాలు...**రాజ్యాంగ సభ మొదటి సమావేశం 1946 డిసెంబర్ 9న, ఢిల్లీలోని కాన్స్టిట్యూషన్ హాల్ (ప్రస్తుత పార్లమెంట్ భవనం సెంట్రల్ హాల్) లో జరిగింది. సచ్చిదానంద సిన్హా సభకు అధ్యక్షునిగా ఎన్నుకున్నారు. జవహర్‌లాల్ నెహ్రూ, మౌలానా అబుల్ కలాం ఆజాద్, సర్దార్ పటేల్, ఆచార్య జె.బి.కృపలానీ, డా.రాజేంద్ర ప్రసాద్, సరోజినీ నాయుడు, రాజాజీ, బి.ఆర్.అంబేద్కర్, టంగుటూరి ప్రకాశం పంతులు, పట్టాభి సీతారామయ్య మొదలైన వారు ఈ సభలో సభ్యులు. తొలి సమావేశానికి 207 మంది సభ్యులు హాజరయ్యారు. పాకిస్థాన్ ఏర్పాటుకు సంబంధించిన చర్చల కారణంగా, కొన్ని ప్రాంతాల నుంచి సభ్యులు హాజరు కాలేకపోయారు.

**తాత్కాలిక, స్థిర అధ్యక్షులు...** సభ ప్రారంభ సమావేశానికి సచిదానంద సింహా తాత్కాలిక అధ్యక్షుడిగా నియమించ బడ్డారు. డిసెంబర్ 11న, డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ రాజ్యాంగ సభకు స్థిర అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు.

**రాజ్యాంగ రూపకల్పన కమిటీలు...** రాజ్యాంగ రూపకల్పనకు వివిధ కమిటీలు ఏర్పాటు చేశారు. వాటిలో రాజ్యాంగ ముసాయిదా కమిటీ అత్యంత ప్రాధాన్యత కలిగింది. ఈ కమిటీకి డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ చైర్మన్‌గా నియమించ బడ్డారు. అంబేద్కర్ నాయకత్వంలో కమిటీ రాజ్యాంగానికి రూపకల్పన చేయడంలో కీలక పాత్ర పోషించింది. 1948 ఫిబ్రవరిలో భారత రాజ్యాంగం తొలి ముసాయిదాను బీఎన్ రావు తయారు చేశారు. (బీఎన్ రావు సేవలకు గుర్తింపుగా 1938లో బ్రిటిష్ ప్రభుత్వం ఆయనకు 'సర్' బిరుదును ఇచ్చింది). బీఎన్‌రావు తయారు చేసిన రాజ్యాంగం ముసాయిదాను అధ్యయనం చేసి తుది ప్రతిని రూపొందించేందుకు ముసాయిదా కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీకి అంబేద్కర్ అధ్యక్షత వహించారు.



**రాజ్యాంగ రూపకల్పన ప్రక్రియ...** రాజ్యాంగంపై 2 సంవత్సరాలు, 11 నెలలు, 18 రోజులు పాటు చర్చలు జరిగాయి. సభలో 11 సెషన్లు నిర్వహించి, 114 రోజులు రాజ్యాంగ రూపకల్పనకు కేటాయించారు.


**భిన్న అభిప్రాయాలకు గౌరవం...** రాజ్యాంగ రూపకల్పనలో సభ్యుల భిన్న అభిప్రాయాలను సముచితంగా చేర్చారు. సమ్మిళిత భావనను ప్రతిబింబిస్తూ ప్రజాస్వామ్య, సమానత్వ ప్రాథమ్యాలను దృఢంగా ప్రతిష్ఠించారు.

**రాజ్యాంగ ఆమోదం...** రాజ్యాంగ ముసాయిదాను 1949 నవంబర్ 26న రాజ్యాంగ సభ ఆమోదించింది. 1950 జనవరి 26న, ఇది అమల్లోకి వచ్చింది.

**రాజ్యాంగ సభ ప్రాముఖ్యత...** రాజ్యాంగ సభ, భారతదేశ ప్రజాస్వామ్యాన్ని స్థాపించేందుకు ఒక బలమైన పునాదిని అందించింది. వివిధ భాషలు, మతాలు, సంస్కృతులు కలిగిన ప్రజల ఆశయాలను ప్రతిబింబిస్తూ రాజ్యాంగం రూపు దిద్దబడింది.

**సమాజహితానికి మార్గదర్శకం:** రాజ్యాంగం భారత ప్రజలకు సమాన హక్కులు, స్వేచ్ఛ, న్యాయం వంటి మూలాధికారాలను అందించింది. భారత రాజ్యాంగ తొలి సమావేశం దేశ స్వాతంత్ర్య స్ఫూర్తిని ప్రతిబింబించే గొప్ప ఘట్టం. ఇది భారతదేశ ప్రజల ఆకాంక్షలను, సామూహిక శక్తిని ప్రపంచానికి చాటిచెప్పింది. ఈ చరిత్రాత్మక సమావేశం భారత ప్రజాస్వామ్యానికి మాత్రమే కాక, భారత జాతీయ చైతన్యానికి కూడా చిరస్మరణీయంగా నిలిచింది. **రామ కిష్టయ్య సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్, 9440595494**

# తెలుగు కథా సాహిత్యంలో కొత్త ఒరవడులు అల్లం రచనలు - డిసెంబర్ 9...అల్లం శేషగిరిరావు జయంతి




సాధారణంగా కథల పాఠకులు కొత్తదనం కోరుకుంటారు. ఇది గ్రహించే కథా రచయితలు పాఠకులను తమ కథల పట్ల ఆసక్తిని పెంపొందించే కథా వస్తువులను ఎంచుకునే ప్రయత్నం చెయ్యడం కద్దు. దీనిని పూర్తిగా అర్థం చేసుకుని తెలుగు కథా రచనలో కొత్త ఒరవడిని సృష్టించా డు అల్లం శేషగిరిరావు. ఎన్నో కథలు వచ్చాయి కాని తెలుగులో వేట గురించి కథలు అల్లం శేషగిరిరావు రాసేవరకూ రానేలేదని చెప్పవచ్చు. అడవిలోని క్రూర మృగాల ప్రాకృతిక ధర్మాలను కథా వస్తువుగా తీసుకున్నా , మానవ మానసిక స్థితిని నిగూఢంగా సూచించడమే ఆయన రచనా లక్ష్యంగా ప్రస్ఫుటం అవుతుంది. మామూలుగా కాక, అయన కథలను విశ్లేషణా పరంగా ఆలోచనకు భూమిక చేశాడు. అల్లం శేషగిరిరావు (డిసెంబర్ 9, 1934 – జనవరి 3, 2000) ప్రముఖ తెలుగు కథా రచయిత. 1934, డిసెంబర్ 9 న ఒడిశా (నాటి ఒడిషా) లోని గంజాం జిల్లాలో జన్మించాడు. శేషగిరి రావు కథలు తమాషాకు రాసిన కథలు కావు. జీవితం గురించి రచయిత తీవ్ర ఆలోచన, లోతుగా పరిశీలన, జీవితంలో అన్యాయాల గురించి ఆందోళన, వేటకథల నేపథ్యంగా అర్థం చేసుకోవచ్చు. వేటాడడం, అడవి మృగాల స్వభావం, సహజ లక్షణం. ప్రాకృతిక ధర్మం కూడా. సంస్కార వంతుడైన మనిషి మృగంలా మారి బలహీనుణ్ని పీక్కుతినే అరాచ కత్వం, బడుగుల మూలుగులను పీల్చేసే బలాధికృతల గురించి నిక్కచ్చిగా, నిజాయతీగా మాట్లాడే కథలు తెలుగులో తక్కువ కనిపిస్తాయి. అలాంటి అరుదైన కథలను పాఠకులకు అందించి, ఆలోచింప చేసిన రచయిత అల్లం శేషగిరిరావు. ఆయన తెలుగు హెమింగ్వే గా లబ్ధ ప్రతిష్టులు. తరాలు మారినా, కాలంలో మార్పు వచ్చినా, అలనాటి నుండి సామాజిక పరిస్థితులలో ఆశించిన మార్పు రానేలేదు. బలవంతుడు, బలహీనునిపై, నిస్సహాయతలపై ఆధిపత్యం కొనసాగుతూనే ఉంది. నాగరిక ముసుగులో దాగిన ఈ అమానవీయతను ఉన్నది ఉన్న ట్టుగా చూపెడతాయి శేషగిరిరావు కథలు. ఇవి మనిషిలోని జంతు ప్రవృత్తిని తేటతెల్లం చేస్తాయి. ఎవరూ చూడని కొత్తకోణాన్ని దర్శించేందుకు వీలు కల్పిస్తాయి. కొత్త ఎత్తుగడ, ఉత్కంఠ, ఆసక్తికర ముగింపూ, అటవీ సంబంధ విశేషాలూ, జంతువుల సహజ ప్రవర్తనాస్థితి.. ఇలాంటి అంశాలతో ఈ కథలు పాఠకులను ఆగకుండా చదివింప జేస్తాయి. రైల్వేలో గుమాస్తాగా పని చేసిన అల్లం శేషగిరిరావు సమాజాన్ని నిశితంగా పరిశీలించిన తీరు అమోఘం, అద్వితీయం, అస మానం. మనుషుల ధోరణి ల్లోని మానవీయ, అమానవీయ కోణాలను, అంతః సంఘర్షణలను అయన అర్థం చేసుకని కథా వస్తువులుగా మలచు కున్నాడు. తాను చేసుకున్న అవగాహనకు తనదైన భాష, శిల్పాలను జోడించి పాఠకుల హృదయాలను అంది పుచ్చుకునే అద్భుత కథలు రాశాడు. 1980లో 'మంచి ముత్యాలు' పేరిట పుస్తక రూపంలో వచ్చాయి. మరిన్ని కథలను కలుపుకుని 'అరణ్య ఘోష'గా వెలువడ్డాయి. ఇటీవల కథా స్రవంతి (అరసం) వారు 'అల్లం శేషగిరిరావు కథలు' పేరిట ఎంపిక చేసిన వాటిని ప్రచురించారు. శేషగిరిరావు రాసినవి తక్కువే. వాటిలోనూ కొన్ని సుదీర్ఘంగా సాగుతాయి. అయితే.. విషయ ప్రాధాన్యం, వైవిధ్యం మూలంగా ఆ నిడివి పాఠకులను అంతగా బాధించదు. 'మృగ తృష్ణ, వఱడు, ది డెత్ ఆఫ్ ఎ మేనిటర్, జాతి కుక్క, పులి చెరువులో పిట్టల వేట, అశ్వమేథం, నరమేథం, చీకటి' తదితరాలు శేషగిరిరావు కథల్లో చెప్పుకో దగినవి. మనిషికి ప్రతిబింబాలు 'వఱడు' కథ 'దర్పణ్ సీరిస్'లో భాగంగా దూరదర్శన్‌లో సింగిల్ ఎపిసోడ్‌గా ప్రసారమైంది. వఱడు లాంటి మనుషులు మన సమా జంలో ఉన్నారని హెచ్చరించిన ఈ కథ, నాటకం గానూ విశేష ఆదరణ పొందింది. వఱడంటే 'ముసలి నక్క' అని నిఘంటు అర్థం. ముసలి నక్కలు వాటంతటవి వేటాడి తినలేవు కదా. దాంతో పగలంతా ఇతర జంతువుల ఉనికిని కనిపెట్టి, రాత్రిపూట పులిని వాటిమీదకి ఉసిగొల్పి చంపిస్తాయి. పులి తినగా మిగిలిన మాంసంతో కడుపు నింపు కుంటాయి. ఈ కథలో మనిషిలో దాగుండే జంతు స్వాభావిక క్రౌర్యాన్ని చూపించాడు. అందుకే ఈ కథకు 'ది డెత్ ఆఫ్ ఎ మేనిటర్'గా పేరు పెట్టాడు. 'మృగ తృష్ణ' కథలో కనిపించేది దుప్పి వేట కాదు. అది అక్షరాలా బలహీనుడి మీద బలవంతుడి వేట మాత్రమే. ఒకరిది విలాసం కొరకు వేట. మరొకరిది జీవిక కోసం పోరుబాట. పులులను దర్జాగా వేటాడి, వాటి చర్మాలను కోటగోడలకి వేలాడ దీసుకునే జమిందారీలను ఏ చట్టాలూ ఏమీ చేయలేవు. చర్యలు తీసుకోనూ లేవు. పిట్టలను కొట్టి బతికే బడుగు జీవులకే అన్ని శిక్షలూ అమలవు తుంటాయి. కన్నీటిగాథ 'చీకటి', ఆరిపోయిన చైతన్యాగ్ని కణాన్ని రాజేస్తుంది. మనిషికి ప్రతిబింబాలు తుపాకీ చప్పుళ్ల తోనూ, కొండగొర్రె అరు పుల తోనూ, పులి గాండ్రిం పుల తోనూ, దగాపడ్డ దీనుడి మూలు గులతో ప్రతిధ్వనించే శేషగిరిరావు ఏ కథ ను తరిచి చూసినా, వేదనా భరిత 'అరణ్య ఘోష' వినపడుతూ ఉంటుంది. ఉదాత్తంగా, గంభీరంగా సాగిపోయే ఈ కథలు ప్రాకృతిక సౌందర్యాన్ని కొత్తకోణంలో చూపిస్తాయి. వైవిధ్య పక్షి జాతుల ప్రస్తావన అక్కడక్కడ మనసును ఉల్లాస పరుస్తుంది. ఉల్లంకి పిట్టలూ, తీతువ పిట్టలూ, పరదలూ, గూడ కొంగలూ, పాముల వార (పెద్ద కొంగలు).. ఇలా పక్షులూ, వాటి గమనాలనూ గమ్మత్తుగా వివరిస్తారు రచయిత. వేటను వర్ణించేటప్పుడు మాత్రం భయానక వాతావరణాన్ని సృష్టిస్తాడు. వేటాడేది మనిషి అయినా, మృగమైనా అడవి రక్తంలో స్నానించినట్టు ఓ భీతావహ చిత్రం కళ్లముందు కదలాడేటట్టు కథని నడిపిస్తాడు. జానెడుపొట్ట కోసం దేవులాడుకొనే దీనుల పోరాటాలు కనిపిస్తాయి. జంతువుల వేట నేపథ్యంలో మనిషిలో దాగుండే క్రూరత్వాన్ని, నాగరిక సమాజంలో మానవ స్వభావాన్ని మృగాలవైపునుంచి చెప్పుకొస్తాయి అల్లం శేషగిరిరావు కథలు. సాహిత్యంలో వీటిని 'వేట కథలు' అన్నారు. కానీ, చారిత్రకంగా వేట అసలు అర్థాన్ని నిర్వచించ గలిగితే ఇవి సమాజంలోని ఆధిపత్య శక్తుల చేతుల్లో నానా హింసలకు గురైన బడుగుల జీవితాలను కళ్లకుకట్టే యాథార్థ గాథలని అర్థమవుతుంది. ఇదే మారణ హోమం ఇప్పటికీ కొనసాగుతుందని ఈ కథలు చదివితే పాఠకులు కచ్చితంగా అంగీకరిస్తారు.

బతుకే బలిపీఠంగా మారుతున్న నేటి సమాజంలో ఆధిపత్యం మీద పోరాటం చేసే వారు ఎప్పుడూ ఓడిపోతూనే ఉంటారు. చీకటి కోణాలెన్నింటినో వెలుతురు బాట పట్టించిన అల్లం శేషగిరిరావు తర్వాత, మళ్లీ ఇలాంటి కథలు మళ్లీ రానే రాలేదు.

**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రకటన పూర్వాపరాలూ డిసెంబర్ 9... తెలంగాణ ప్రక్రియ ప్రకటన దినం

## డిసెంబర్ 9.. 2009న కేంద్రం దిగి వచ్చి ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటులో సువర్ణాక్షరాలతో లిఖించ బడిన దినం.




ప్రత్యేక రాష్ట్ర ఉద్యమ సాఫల్య సాకార ప్రక్రియకు శ్రీకారం చుట్టిన దినం. ఇది ప్రత్యేక చారిత్రక సందర్భం. 2009 నవంబర్ 29న భారాస అధినేత, తాజా మాజీ ముఖ్య మంత్రి కేసీఆర్ మొదలు పెట్టిన ఆమరణ దీక్ష మలి దశ ఉద్యమంలో కీలక ఘట్టంగా నిలిచి, ఢిల్లీ పాలకుల చేత రాష్ట్ర ఏర్పాటు ప్రకటనకు మూలమైన నేపథ్యం, కేసిఆర్ ఆమరణ దీక్ష సందర్భం, క్రమాను గత సంఘటనల క్రమాన్ని మననం చేసుకునే ప్రయత్నం. తెరాస అధినేత కేసీఆర్ ఆమరణ నిరాహార దీక్షకు సిద్ధమై, మానసిక సన్నద్ధం కోసం నవంబర్ 26వ తేదీ సాయంత్రం కరీంనగర్ తీగల గుట్టపల్లిలోని ఉత్తర తెలంగాణ భవన్‌కు చేరుకున్నారు. అప్పటికే దీక్షకు సంబంధించి వాతావరణం వేడెక్కడంతో, ఆయనకు పార్టీ శ్రేణులు అపూర్వ స్వాగతం పలికాయి. మహిళలు ముందుండి వీర తిలకం దిద్దారు. కేసిఆర్ తెలంగాణ భవన్‌లో బస చేయడంతో ప్రభుత్వం కరీంనగర్ పై ప్రత్యేక దృష్టి నిలిపింది. కేసిఆర్ దీక్షను అడ్డు కోవడానికి 144 సెక్షన్ విధించడం, తెలంగాణ భవన్ వద్ద భారీగా పోలీసులు, ఇంటలిజెన్స్ వర్గాలు చేరడంతో కరీంనగర్‌లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. కేసిఆర్ ఆమరణ దీక్ష చేపడుతారా, పోలీసులు అడ్డుకుంటారా అనే సంశయం యావత్ తెలంగాణ ప్రజల్లో టెన్షన్. 29న ఉదయం దీక్షకు బయలు దేరకుండా హౌజ్ అరెస్టు చేస్తారని.. మార్గ మధ్యలో అదుపు లోకి తీసుకుంటారని, దీక్షాస్థలి సమీపంలో అరెస్టు చేస్తారంటూ పలు ఊహాగానాలు చోటు చేసుకున్నాయి. ఆనాటి అర్ధరాత్రి ఏమి జరగనుందో అని 28వ తేదీ రాత్రి కరీంనగర్‌లో ఉత్కంఠ క్షణక్షణం పెరిగింది. దీక్షను అడ్డుకోవడానికి అన్ని రకాల ప్రయత్నాలు జరిగాయి. ప్రభుత్వం కేసిఆర్ బస చేసిన ఉత్తర తెలంగాణ భవనం వద్ద పెద్ద ఎత్తున పోలీసు బలగాలను మోహరించింది. అర్ధరాత్రి 12 గంటలకు భవన్‌ను పోలీసులు చుట్టు ముట్టారు. పోలీసుల ప్రయత్నాలను ఎదుర్కోవడానికి కార్యకర్తలు, నేతలు కూడా పెద్ద సంఖ్యలో భవన్‌కు చేరుకొని కేసిఆర్ కు అండగా లోపలే ఉండి పోయారు. రాత్రంతా ధూంధాం నిర్వహించారు. కార్యకర్తలు పలుమార్లు పోలీసుల పైకి రాళ్లు రువ్వడంతో ఉద్రిక్తత పెరిగింది. 29వ తేదీ ఉదయం తెలంగాణ భవన్‌లోనే మీడియా ప్రతి నిధుల సమావేశం నిర్వహించి ప్రభుత్వ దమనకాండను నిరసించారు. ఉత్తర తెలంగాణ భవన్ నుంచి దీక్షకు సిద్ధ మయ్యారు. తర్వాత ఉదయం 7.30 గంటలకు తెరాస సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయ శంకర్, నాయిని నర్సింహారెడ్డి, కెప్టెన్ లక్ష్మీకాంతరావుతో కలిసి మెదక్ జిల్లా సిద్దిపేట దగ్గర రంగధాంపల్లిలో ఏర్పాటు చేసిన దీక్షా స్థలికి వాహనంలో బయలు దేరారు. భవన్‌లో కాకుండా మార్గమధ్యలో అరెస్టు చేయాలనే పక్కా వ్యూహంతో పోలీసులు కేసిఆర్ ను వెంబడించారు. కేసిఆర్ కాన్వాయ్ బయలు దేరగానే, కార్తకర్తలు, మీడియా వాహనాలు కాన్వాయ్‌ను అనుసరించకుండా అల్గునూర్ బ్రిడ్జివద్ద నిలిపివేశారు. ఎమ్మెల్యేల వాహనాలను సైతం అనుమతించ లేదు. అత్యంత నాటకీయ పరిణామాల మధ్య అల్గునూరు చౌరస్తా వద్ద వాహనాన్ని నిలిపివేసి కేసిఆర్ ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అరెస్టుకు నిరసనగా అల్గునూరు చౌరస్తాలోని రోడ్డుపై కూర్చొని కేసిఆర్ కొద్దిసేపు ఆందోళన చేశారు. కార్యకర్తలు వాహనాల టైర్లలో గాలి తీసి ముందుకు కదలకుండా చేశారు. అక్కడి నుండి కెసిఆర్‌ను మరో వాహనంలో హుజురాబాద్, వరంగల్ మీదుగా పోలీసులు ఖమ్మం తరలించారు. ఆగ్రహించిన కార్యకర్తలు ఆర్టీసీ బస్సు అద్దాలు ధ్వంసం చేశారు. కేసిఆర్ కు మెజిస్ట్రేట్ 14 రోజులు రిమాండ్‌కు ఆదేశించడంతో.. ఖమ్మం జైలుకు తరలించగా, జైలులోనే ఆయన ఆమరణ దీక్ష ప్రారంభించారు. అలా తెలంగాణ భగ్గుమంది. ఉస్మానియా యూనివర్సిటీలో విద్యార్థులు వేల సంఖ్యలో రోడెక్కారు. జైల్లోనే గులాబీ అధినేత దీక్షతో, ఆరోగ్యం క్షీణించడంతో హైదరాబాద్ నిమ్స్ కు తరలించారు. డాక్టర్లు వద్దంటున్నా నిమ్స్ లో కూడా దీక్ష కొనసాగించిన కేసీఆర్%ౌ% కేంద్రం దిగి వస్తేనే వెనక్కు తగ్గుతానని స్పష్టం చేశారు. కేసీఆర్ ఆరోగ్యం క్షీణిస్తోందన్న సమాచారంతో%ౌ% తెలంగాణలో అగ్గి రాజుకుంది. ఉస్మానియా, కాకతీయ, శాతవాహన యునివర్సిటీలలో విద్యార్థుల ఆగ్రహం కట్టలు తెంచుకుంది. పోలీసులు రబ్బరు బుల్లెట్లు వదిలినా.. బాష్పవాయు గోళాలు పేల్చినా విద్యార్థులు వెనకంజ వేయలేదు. డాక్టర్లు, లాయర్లు, ఇంజినీర్లు, మేధావులు, రాజకీయ నాయకులు, టీచర్లు, విద్యార్థులు అందరిలో రక్తం వేడెక్కింది. 10 జిల్లాల్లో ఎటు చూసినా జై తెలంగాణ నినాదమే. బంద్ లతో బస్సులు, రైళ్లు, రాక పోకలు స్తంభించాయి. పరిస్థితి చేయి దాటుతుండడంతో.. అప్పటి ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రి రోశయ్య అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ఉమ్మడి రాష్ట్రానికే కట్టుబడి ఉన్న సీపీఎం మినహా మిగిలిన అన్ని పార్టీలు ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటుకు అంగీకరించాయి. ఇదే విషయం స్పష్టం చేస్తూ ఢిల్లీకి నివేదిక కూడా ఇచ్చాయి. చివరికి కేసీఆర్ దీక్ష ప్రారంభించిన 12 రోజులకు.. సరిగ్గా డిసెంబర్ 9.. 2009న కేంద్రం దిగి వచ్చి ప్రత్యేక రాష్ట్ర ప్రక్రియ ప్రారంభిస్తున్నట్టు ఆ రోజు అర్ధరాత్రి.. అప్పటి కేంద్ర హోం మంత్రి చిదంబరం ద్వారా ప్రకటింప చేశారు. ఈ ప్రకటనతో యావత్ తెలంగాణ పులకించి పోయింది. ఆందోళన స్థానంలో హర్షాతిరేకాలు చేరాయి. ధర్నాలు, నిరసన స్థానంలో సంబరాలు, విజయో త్సవాలు కనిపించాయి. అయితే రోజులోనే పూర్తిగా మారి పోయింది. తెలంగాణ ప్రకటనను అడ్డుకునేందుకు.. సీమాంధ్ర ప్రజాప్రతినిధులు రాజీనామాలతో ఒక్కట య్యారు. సీమాంధ్ర నేతల తీరుతో కేంద్రం కూడా వెనక్కి తగ్గింది. రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియను పక్కన పెట్టింది. ఈ ఆలస్యమే తెలంగాణ ఉద్యమ కారుల్లో మరింత ఉద్రేకాన్ని రగిల్చింది. చివరగా అన్ని వర్గాల పోరాటంతో కొంత ఆలస్య మైనా తెలంగాణ వాదుల చిరకాల స్వప్నం సాక్షాత్కరించింది. తెలంగాణ రాష్ట్రం సిద్ధించింది. **రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

చురకలు



# అసంపూర్తి పనులు.. ఎన్నాళ్లీ అవస్థలు

వీర్నపల్లి : వీర్నపల్లి మండల కేంద్రంలోని రోడ్డు ఇది. ఇక్కడి నుంచి నాలుగు వందల మీటర్ల వరకు రోడ్డు నిర్మాణం ఆగిపోవడంతో మట్టి రోడ్డుతో ఇబ్బందులు తప్పడం లేదు. కాలువలు తొలగించడంతో మురుగు రోడ్డుపైకి చేరుతోంది. భారీ వాహనాలొస్తే ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. అంబేడ్కర్‌నగర్‌లో విస్తరించిన రహదారి ఇది. ఇరువైపులా మురుగు కాలువలు తొలగించారు. నిర్మాణానికి ప్రతిపాదనలు పంపినా మంజూరుకు నోచుకోలేదు. డివైడర్ నిర్మించాల్సి ఉంది. రోడ్డుపై చేరిన దుమ్మును తొలగించకపోవడంతో వాహనాల వేగానికి ఇళ్లలోకి చేరుతోందని స్థానికులు వాపోతున్నారు.

అభివృద్ధిపై ఆశగా ఎదురుచూసిన జనాలకు అసంపూర్తి పనులు 'దారి'ద్ర్యంగా మారాయి. వీర్నపల్లి మండల కేంద్రంలో రహదారి విస్తరణ అసంపూర్తిగా నిలిచిపోయింది. ఏళ్లు గడుస్తున్నా పనులు పూర్తవకపోవడంతో అటు జనాలు.. ఇటు ప్రయాణికులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. కదలిక లేని పనులతో తిప్పలు తప్పడం లేదు.

**రూ.25 కోట్లు మంజూరైనా..**



వీర్నపల్లి మండల కేంద్రంలోని అంబేడ్కర్‌నగర్ ప్రాథమిక పాఠశాల నుంచి తూకమర్రె వాగు వరకు ఉన్న ఒక వరస రహదారిని విస్తరించాలని అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు.

ఎల్లారెడ్డిపేట నుంచి మరిమడ్ల వరకు వంతెనలు, వీర్నపల్లిలో రహదారి విస్తరణకు ప్రభుత్వం నుంచి అనుమతి వచ్చింది. దీనికోసం రూ.25 కోట్లు మంజూరయ్యాయి.

1.6 కిలోమీటర్ల వ్యవధిలో 80 ఇళ్లు పాక్షికంగా దెబ్బతింటున్నాయి. రోడ్డును నాలుగు వరుసలుగా విస్తరించాలని భావించారు కానీ.. ఇంటి యజమానుల ఆందోళనలతో నాలుగుసార్లు కొలతలను తగ్గించారు. బాధితులకు రెండు పడక గదుల ఇళ్లు ఇస్తామని 52 అడుగుల మేర విస్తరణకు ఒప్పించి తీర్మానం చేశారు.

అంబేడ్కర్‌నగర్ ప్రాథమిక పాఠశాల నుంచి సుభాష్‌నగర్ అమరవీరుల స్తూపం వరకు రోడ్డు నిర్మాణం పూర్తయింది. స్తూపం వద్ద నుంచి తూకమర్రె వరకు విస్తరించే క్రమంలో ఇంటి యజమానులు పనులను అడ్డుకున్నారు.

400 మీటర్ల మేర ఆగిన రహదారి విస్తరణ ఏడాదిన్నర కావొస్తున్నా కదలిక లేదు. ప్రజాప్రతినిధుల హామీతో ఇళ్లు తొలగించి నిర్మించుకున్న వారికి బిల్లులు మంజూరు కావడం లేదు.

# అరణ్యంలో 'ఆడపులులు'

దేవరకొండ : ఈ చిత్రంలో కన్పిస్తున్న ఆటో ఇటీవల నల్లమల అటవీ ప్రాంతంలోనిది. వేటగాళ్లు అడవి పందులను వేటాడి ఆటోలో తరలిస్తున్న సమాచారం తెలుసుకొని.. దేవరకొండ మహిళా అటవీశాఖాధికారి శ్రీదేవి తన సిబ్బందితో కలిసి ఆటోను వెంబడించి పట్టుకొని కేసు నమోదు చేశారు.

ఒకప్పుడు మహిళలు వంటింటికే పరిమితమయ్యేవారు. కానీ ఇప్పుడు సాఫ్ట్‌వేర్ కొలువులు చేస్తున్నారు.. అంతరిక్షంలోకి వెళ్తున్నారు. అన్ని రంగాల్లో రాణిస్తూ.. అడవి సంరక్షణ బాధ్యతల్ని సైతం వారి భుజాన వేసుకుంటున్నారు. క్రూరమృగాలు, చిరుత పులులు తిరిగే ప్రాంతాల్లో విధులు నిర్వహిస్తూ.. వేటగాళ్లు, స్మగర్ల బారి నుంచి వన్యప్రాణులను సంరక్షిస్తున్నారు. ప్రాణాలు లెక్కచేయకుండా అడవిలో ఆడపులుల్లా తిరుగుతూ జంతువుల, పులుల కదలికలను కనిపెడుతున్నారు. భారతదేశంలో అతి పెద్ద అరణ్యాల్లో రెండోస్థానంలో ఉన్న నల్లమల అటవీ ప్రాంతం కృష్ణపట్టి ఏరియాల్లో ధైర్య సాహసాలతో ముందుకెళ్తున్నారు మహిళా అటవీ ఉద్యోగులు.

**ధైర్య సాహసాలతో ముందుకు...**

రాష్ట్రంలో అత్యంత దట్టమైన అడవుల్లో నల్లమల అటవీ ప్రాంతం ఒకటి. కృష్ణ పరివాహక ప్రాంతంలో నల్లమల అటవీ ప్రాంతం ఉమ్మడి రాష్ట్రమైన గుంటూరు, ప్రకాశం, కర్నూలు, నాగర్‌కర్నూల్, నల్గొండ జిల్లాలను ఆవరించి ఉంది. ఇక్కడ ప్రాథమిక అంచనా ప్రకారం చిరుతపులులు 26, ఎలుగుబంట్లు 50 వరకు, రేసుకుక్కలు 105 వరకున్నాయి. పులుల ఆనవాళ్లు లేవు. దీంతోపాటు చుక్కల దుప్పి, నెమలి, మనుబోతు, ముళ్లపంది, కొండగొర్రెలు తదితర వన్యప్రాణులు వందల సంఖ్యలో ఉన్నాయి. వీటి సంరక్షణలో మహిళా ఉద్యోగులు ఎంతో కీలకంగా వ్యవహరిస్తున్నారు. ప్రతి నిత్యం విధి నిర్వహణలో మగవారికి దీటుగా ప్రాణాలు లెక్కచేయకుండా 11 మంది మహిళా ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు. ఎక్కడో చోట చిరుతపులులు, ఎలుగుబంట్లు వారికి ఎదురైనా వెనకడుగు వేయకుండా పగలు, రాత్రుళ్లు పనిచేస్తూ జంతువుల సంరక్షణలో ముందుంటున్నారు.

**నిత్యం పర్యవేక్షణ**



సంగీత, నాగార్జునసాగర్ డీఎఫ్‌వో

నల్లమల ప్రాంతానికి సంబంధించి నాగార్జునసాగర్ డివిజన్‌లో దేవరకొండ, కంబాలపల్లి అడవి విస్తరించి ఉంది. వీటిలో మహిళా బీట్ ఆఫీసర్లు, సెక్షన్ అధికారులు, ఇన్‌ఛార్జి ఎఫ్ఆర్‌వో ప్రతి నిత్యం అడవి సంరక్షణ కోసం పనిచేస్తున్నాం. ఉదయం, రాత్రి నిఘా పెంచుతున్నాం.

**అనుక్షణం రక్షణ**

శ్రీదేవి, ఇన్‌ఛార్జిఎఫ్ఆర్‌వో, దేవరకొండ

నల్లమల అటవీ ప్రాం తంలో పనిచేస్తూ నిత్యం మొక్కలు, జంతువుల సంరక్షణలో ఉంటాం. తమకు ప్రతినిత్యం ఎక్కడో చోట జంతువులు ఎదురవుతూనే ఉంటాయి. భయపడకుండా విధులు నిర్వహిస్తున్నాం.

అటవీ విస్తీర్ణం: 26785 హెక్టార్లు

ఫారెస్టు బీట్లు: 28

బీట్, డీఎఫ్‌వో, ఇన్‌ఛార్జి ఎఫ్ఆర్‌వో, సెక్షన్ అధికారులు కలిపి మహిళా అటవీ ఉద్యోగులు: 11 (నల్గొండ జిల్లాలో)

# యూరియా లెక్క.. పక్కా





గరిడేపల్లి : రైతులకు ఎంత యూరియా అందించారో స్పష్టమైన లెక్కలు తేలనున్నాయి. ఎక్కువగా తీసుకునే రైతుల వివరాలు ఇట్టే చెప్పేయవచ్చు. అంతేకాదు రైతు విస్తీరా?నికంటే ఎక్కువ తీసుకోవాలన్నా వీలు పడకుండా యాప్‌లు సిద్ధమవుతున్నాయి. ఇప్పటికే ఆధార్ లింకుతో ఈ- పోస్ యంత్రాలతో యూరియా, అడుగు మందు అమ్మకాలు చేపట్టారు. రైతుకు ఉన్న భూమికి ఎంత యూరియా అవసరమో అంతే తీసుకునే వీలుంటుంది. ఎక్కువ తీసుకోవాలన్నా యాప్‌లో ఇట్టే దొరికిపోతారు. అదనంగా యూరియా ఇచ్చి ఈ పోస్‌లో అప్‌లోడ్ చేయాలంటే తీసుకోదు. మున్ముందు ఇదే అమలు చేయడానికి కసరత్తు జరుగుతోంది. ఇంతకాలం యూరియా పక్కదారి పట్టినా, ఇతర అవసరాలకు వినియోగించినా, రైతుల ఆధార్‌తో ఎంతంటే అంత యూరియా తీసుకునేవారు. దానికి చెక్ పెట్టడానికి ప్రభుత్వం సాంకేతికతను వినియోగిస్తోంది.

జాగ్రత్తలు అవసరం..ఇటీవల రైతులు యూరియా కోసం బారులు తీరి కష్టాలు పడ్డారు. పెద్ద రైతులు ముందుగా యూరియా తీసుకెళ్లి నిల్వ ఉంచుకోవడంతో సన్న, చిన్న కారు రైతులకు అవసరమైనప్పుడు దొరికేది కాదు. దాంతో రైతులు బ్లాక్ మార్కెట్‌లో రెట్టింపు ధరకు కొనేవారు. దుకాణాలు, సహకార సంఘాల వద్ద రాత్రింబవళ్లు క్యూలో నిలబడి అవస్థలు పడేవారు. భవిష్యత్‌లో పెద్ద రైతులైనా తనకున్న విస్తీర?ంలో ఒక బస్తా యూరియా చొప్పున ముందు ఇస్తారు. రెండో దఫా 20 రోజులకు ఇస్తారు. పైరవీలు, ఇతరత్రా చేసి తీసుకెళ్లాలన్నా కొత్తగా వచ్చే సాంకేతిక పరిజ్ఞానం పట్టేస్తుంది. దాంతో పాటు ఇప్పటికే సహకార సంఘాలలో కార్డులు ప్రవేశపెట్టారు. కార్డులపై ముందుగా ఒక బస్తా ఇస్తారు. రైతన్నా..! ఇక నుంచి ఆధార్ నంబర్ ఎరువుల దుకాణదారులకు ఇచ్చే సమయంలో జాగ్రత్తలు పాటించండి. ఎన్ని బస్తాలు తీసుకెళ్తున్నామో ఈ పోస్‌లో మన ఆధార్‌పై ఎన్ని నమోదు చేశారో చూసుకొని తీసుకెళ్లాలి.

# మల్లన్న వనం ఎప్పుడో?



చేర్యాల: లక్షలాది మంది భక్తుల ఆరాధ్య దైవం, 130 ఎకరాల భూమి యజమాని.. కొమురవెల్లి మల్లికార్జునస్వామికి ఉద్యానమే లేదు. ప్రధాన ఆలయాల్లో భక్తులను ఆకర్షించే వాటిలో వనాలు ఒకటి. మల్లన్న గుడికి ఏటా రూ.21 కోట్లకు పైగా ఆదాయం సమకూరుతోంది. ఆధ్యాత్మిక పర్యాటక ప్రాంతంగా విలసిల్లుతున్నా భక్తులను ఆకర్షించేలా కొత్తవి చేపట్టడం లేదు. కొమురవెల్లి మండల కేంద్రంతో పాటు పక్కనే ఉన్న గౌరాయపల్లి, రాంసాగర్, కిష్టంపేట గ్రామాల్లోనే 100 ఎకరాలకు పైగా భూమి.. మల్లన్న పేరిట ఉంది. కొంత ఇటీవల ప్రభుత్వ కార్యాలయానికి కేటాయించగా మిగిలింది వృథాగా ఉంటోంది.

మొక్కలు నాటి వదిలేసి.. మండల పరిషత్ కార్యాలయం ఆధ్వర్యంలో రాజీవ్ రహదారి పక్కనే కొమురవెల్లి స్వాగత తోరణం వద్ద 2022లో 'ఫ్రీడం పార్కు' ఏర్పాటు చేశారు. సుమారు అర ఎకరంలో అధికారులు మొక్కలు నాటి వదిలేశారు. వాటికి సంరక్షణ లేకపోవడంతో పాదుల్లోనే ఎండిపోయాయి. వాటి స్థానంలోనే హరితహారం, వనమహోత్సవం కార్యక్రమాల్లో భాగంగా మొక్కలు నాటారు. అక్కడ కనీసం 10 శాతం మొక్కలైనా లేవు. కల్యాణ వేదిక వద్ద 'తోటబావి' ఉన్నా పొదలు మాత్రమే దర్శనమిస్తాయి. గతంలో ఆ తోటలోని పూలనే స్వామికి వినియోగించేవారు. ప్రస్తుతం ఏటా రూ.లక్షలు ఖర్చు చేసి కొనుగోలు చేస్తున్నారు. 'మల్లన్న' వనం పేరుతో పార్కుగా అభివృద్ధి చేయాలని గతంలో ఈవో అన్నపూర? ఆలోచించి, స్థల పరిశీలన చేశారు. దేవాదాయశాఖ కమిషనరుకు ప్రతిపాదనలు పంపారు. అక్కడే నిలిచిపోయింది.

ఉత్సవాలు ముగిశాక చేపడతాం

- వెంకటేశం, ఆలయ ఈవో

మరో రెండు వారాల్లో ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. జాతర ముగిశాక ఉద్యానం ఏర్పాటుపై కమిషనరు దృష్టికి తీసుకెళ్తాం. భక్తులకు ఆహ్లాదాన్ని పంచేలా మళ్లీ ప్రతిపాదనలు సిద్ధం చేస్తాం.

# అయ్యప్పా.. ఇల్లు చేరేదెట్లా?





కాగజ్‌నగర్: ఏటా భారీ సంఖ్యలో అయ్యప్ప భక్తులు మాలధారణ చేసి 41 రోజులు నిష‘గా ఉండి ఇరుముడి ఎత్తుకుని శబరిమల దర్శనానికి వెళ్తున్నారు. ఈ నెలతోపాటు వచ్చే నెల 15న మకరజ్యోతిని దర్శించుకునేందుకు అనేక మంది భక్తులు వెళ్లి వస్తుంటారు. జిల్లా నుంచి అయ్యప్ప భక్తులు శబరిమలకు వెళ్లాలంటే కాగజ్‌నగర్ రైల్వేస్టేషన్ నుంచే వెళ్లాల్సి ఉంటుంది. రాష్ట్రంలోనే చివరి రైల్వేస్టేషన్ సిర్పూర్ కాగజ్‌నగర్. అయ్యప్ప భక్తుల సౌకర్యార్థం ఈ నెల 13న కాగజ్‌నగర్ నుంచి ప్రత్యేక రైలు (07117) నడపనున్నట్లు అధికారులు ప్రకటించారు. అనంతరం సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు ప్రాతినిథ్యం మేరకు మరోసారి జనవరి 3న కాగజ్‌నగర్ నుంచి కొల్లాం వరకు నడపనున్నట్లు ప్రకటించారు.

ఈ ప్రత్యేక రైళ్లు కాగజ్‌నగర్ నుంచి బయలుదేరి.. బెల్లంపల్లి, మంచిర్యాల, రామగుండం, పెద్దపల్లి, జమ్మికుంట, వరంగల్‌ల మీదుగా కొల్లాం జంక్షన్‌కు చేరుకుంటాయి. కుమురంభీం, మంచిర్యాలతోపాటు కరీంనగర్ జిల్లాలోని పలు ప్రాంతాల అయ్యప్ప భక్తులకు ఈ రైళ్ల గుండా వెళ్లేందుకు సౌకర్యవంతంగా ఉంటుంది. అయితే తిరుగు ప్రయాణం ఎలా అనే సంశయాన్ని భక్తులు వ్యక్తం చేస్తున్నారు. ఆయా స్టేషన్ల గుండా వెళ్లిన వారు తిరుగు ప్రయాణంలో ఇబ్బందులు పడాల్సి వస్తుందని చెబుతున్నారు.

**రిజర్వేషన్ దొరకడం కష్టమే!**

ఈ స్టేషన్ల మీదుగా వారంలో ఒక రోజు నడిచే బిలాస్‌పూర్-ఎర్నాకులం, పట్నా-ఎర్నాకులం, కోర్బా-తిరువనంతపురం, ఇండోర్-తిరువనంతపురం, గోరక్‌పూర్ తిరువనంతపురం, బరోని-ఎర్నాకులం సూపర్‌ఫాస్టు ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఉన్నప్పటికీ వాటిలో సీట్లు దొరకడం కష్టతరం. రెండు నెలల ముందుగానే రిజర్వేషన్ చేసుకున్నా.. దొరకని పరిస్థితి. పలు రైళ్లలో పారిశుద్ధ్యలోపం కారణంగా అయ్యప్ప భక్తులు వెళ్లేందుకు వెనకడుగు వేస్తారు. ఈ నేపథ్యంలో శబరిమల వెళ్లేందుకు ప్రత్యేక రైళ్లు ఉపయోగపడనున్నాయి. ఈ రెండు రైళ్లు సరిపోవని, ఆదిలాబాద్, మాక్రి, బల్లార్షా, కాగజ్‌నగర్‌ల మీదుగా మరిన్ని ట్రిప్పులు పెంచాలని భక్తులు కోరుతున్నారు. మరోవైపు తిరుగు ప్రయాణంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక రైలు (07118) కొల్లాం నుంచి చర్లపల్లి వరకు మాత్రమే నడపనున్నారు. ఇది కూడా కేవలం ఒకే ట్రిపు మాత్రమే. కాగజ్‌నగర్ రైల్వేస్టేషన్ వరకు రైలు నడపంతోపాటు ట్రిప్పులు పెంచాలని అయ్యప్ప భక్తులు కోరుతున్నారు. ఆ దిశగా ఆదిలాబాద్, ఎంపీలు, ఎమ్మెల్యేలు చొరవ చూపాలంటున్నారు.

# అదనపు యూనిట్లు.. అందుబాటులో సేవలు

గోదావరిఖని : ప్రతి బోధనాసుపత్రిలో అదనంగా రెండు డయాలసిస్ యూనిట్లు(మిషన్లు) ఏర్పాటు చేయనున్నట్లు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ నిర్ణయం తీసుకోవడంతో అత్యవసరమైన వారికి సేవలు అందుబాటులోకి రానున్నాయి. వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో సమీక్షించిన మంత్రి దామోదర రాజనర్సింహ ఈ మేరకు నిర్ణయం తీసుకొన్నారు. రాష్ట్రంలోని ప్రభుత్వ, బోధనాసుపత్రుల్లో 102 రక్తశుద్ధి కేంద్రాలున్నప్పటికీ అత్యవసరమైన వారికి డయాలసిస్ సేవలు అందించలేని పరిస్థితులు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో కేవలం అత్యవసర సమయంలో మాత్రమే వినియోగించేలా ప్రతి బోధనాసుపత్రిలో అదనంగా రెండు యూనిట్లు ఏర్పాటు చేయడంతో అత్యవసర విభాగంలో రక్తశుద్ధి సేవలు అందుబాటులోకి రానున్నాయి.

సాధారణంగా రక్తశుద్ధి కేంద్రాల్లో షిఫ్టుల వారీగా సమయాన్ని



కేటాయిస్తారు. కేటాయించిన సమయం ప్రకారం కేంద్రాలకు వచ్చి రక్తశుద్ధి చేయించుకొని వెళ్తుంటారు. ఈ సమయంలో ఎవరికైనా రక్తశుద్ధి అవసరమైతే చేయలేని పరిస్థితులు నెలకొన్నాయి. రెగ్యులర్‌గా చేయించుకునేవారిని ఆపాల్సి ఉంటుంది. ఇది వారి ఆరోగ్యానికి ప్రమాదకరంగా మారనుంది. ఈ నేపథ్యంలో కేవలం అత్యవసరమైన వారికి మాత్రమే అదనపు యూనిట్లలో రక్తశుద్ధి చేసే అవకాశం ఉండగా రెగ్యులర్ రోగులకు ఎలాంటి ఇబ్బందులుండవు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని ఆరు కేంద్రాల్లో 40 యూనిట్లు అందుబాటులో ఉండగా 287 మంది రెగ్యులర్‌గా రక్తశుద్ధి చేయించుకుంటున్నారు. తాజాగా రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం ప్రకారం ఉమ్మడి జిల్లాలో మొత్తం 12 డయాలసిస్ యూనిట్లు ఏర్పాటు చేయనున్నారు.

# ర్యాగింగ్‌కు ముకుతాడు వేసేదెలా?

సంగారెడ్డి: ఇంటర్ నుంచి డిగ్రీ, బీటెక్, ఎంటెక్, ఎంబీబీఎస్ ఇలా వివిధ స్థాయిలోని కళాశాలల్లో ఏదో రూపంలో ర్యాగింగ్ జడలు విప్పుతోంది. దీన్ని అరికట్టేందుకు కళాశాలల్లో ర్యాగింగ్ నిరోధక కమిటీలను ఏర్పాటు చేయాల్సి ఉన్నా జాడ లేదు. ఏర్పాటైనవి నామమాత్రంగానే పనిచేస్తున్నాయి. బాధితులు ఫిర్యాదు చేయలేక కుమిలి పోతున్నారు. ఎవరైనా ధైర్యం చేసి కళాశాల యజమాన్యం దృష్టికి తీసుకెళ్తే బయటకు పొక్కకుండా లోలోపల సముదాయిస్తున్నారు. ర్యాగింగ్ భరించలేక విద్యార్థి ప్రాణాలు తీసుకునే ప్రయత్నం చేస్తే కడుపునొప్పితోనే.. చదువులో ఒత్తిడితోనో అనే సాకులు బయటకు వినిపిస్తున్నాయి. నిజానిజాలు సమాధి అవుతున్నాయి. ఎంతో భవిష్యత్తు ఉన్న విద్యార్థుల జీవితాలు ర్యాగింగ్‌కు బలి అవుతుండటం విషాదకరం.

**అవగాహనతోనే అడ్డుకట్ట**

రెండు రోజుల క్రితం సంగారెడ్డి వైద్య కళాశాలలో జరిగిన ఘటన విషయమై పట్టించుకునే వారే కరవయ్యారనే విమర్శలున్నాయి. తర్వాత మాత్రం పోలీసులు విద్యార్థులు, తల్లిదండ్రులు, కళాశాల అధ్యాపకులు, ర్యాగింగ్ నిరోధక కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించి అవగాహన కల్పించారు. కొత్తగా చేరిన విద్యార్థులకు అవగాహన కల్పించాల్సి ఉంది. సీనియర్లు తమ ఆధిపత్యం కోసం జూనియర్లను వేధింపులకు గురి చేస్తున్నారు. సిద్దిపేట అర్బన్ మండలం మిట్టపల్లిలోని ఓ వైద్యకళాశాలలో ప్రథమ సంవత్సర విద్యార్థిని సీనియర్లు ర్యాగింగ్ చేశారు. బాధితుడి తల్లి ఫిర్యాదు చేయడంతో వెల్లడైంది. చట్టం కింద ఎనిమిది మందిపై కేసు నమోదైంది.

**ఎవరెవరు ఏం చేయాలి?**

ప్రిన్సిపల్ లేదా డైరెక్టర్ ఛైర్మన్‌గా ఉండే నిరోధక కమిటీలు ర్యాగింగ్ జరుగకుండా పర్యవేక్షించాలి.

ర్యాగింగ్ చేస్తే భవిష్యత్తు సమస్యలపై అవగాహన కల్పించాలి.

జిల్లా న్యాయ సేవాధికార సంస్థలు, ర్యాగింగ్ నిరోధక కమిటీలు సమావేశాలు నిర్వహించాలి.

కలెక్టర్లకు నివేదికలు సమర్పించాలి.

ర్యాగింగ్ నిషేధ చట్టాన్ని 1997లో తీసుకొచ్చారు.

జైలు శిక్ష తప్పదు

పరితోశ్ పంకజ్, ఎస్పీ, సంగారెడ్డి

ర్యాగింగ్‌కు పాల్పడితే బాధ్యులకు జైలు శిక్ష తప్పదు. విద్యార్థులు తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దు. చట్టాలు కఠినంగా ఉన్నాయి. కొన్ని ఘటనల స్థాయితో జీవితాంతం జైలు జీవితం గడపాల్సి ఉంటుంది. ప్రిన్సిపల్, అధ్యాపకులు సైతం బాధ్యులవుతారు. విద్యార్థులు స్నేహభావంతో మెలగాలి.

# భుజ బలంతోనే బాహు బిలం

నల్గొండ : వెలుగుమట్ల వద్ద 60 అడుగుల లోతుతో ప్రారంభమై మధ్యలో అత్యధికంగా 105 అడుగుల వరకు లోతు ఉండటం గమనార్హం. దీనిలో ఏడాది పొడవునా నీరు నిలిచి ఉంటుంది.

నాడు ఆధునిక యంత్రాలు లేవు.. కొండల్ని పిండిచేసే సామగ్రి లేదు. భుజ బలమే శ్రమజీవుల ఆయుధం. తమ రెక్కల కష్టంతోనే అతి లోతైన కాల్వను తవ్వేశారు. ఏళ్లు గడుస్తున్నా అక్కడి దృశ్యాలు నేటికీ గగుర్పాటుకు గురిచేస్తూనే ఉన్నాయి. వివరాల్లోకి వెళ్తే.. పూర్వ ఏపీలోని ఖమ్మం, కృష్ణా జిల్లాల్లో సాగునీటి అవసరాలు తీర్చేందుకు నాగార్జున సాగర్ ఎడమ కాల్వ నిర్మాణం చేపట్టారు. ఇందులో భాగంగా 1975లో పాలేరు చెరువు నుంచి ఏపీ నూజివీడు వరకూ కాల్వ నిర్మాణం ప్రారంభించారు. ఖమ్మం నగరానికి చేరువగా ఉన్న రఘునాథపాలెం మండలం వి.వెంకటాయపాలెం గ్రామం వద్ద ఎత్తైన నేలను తొలిచే క్రమంలో భాగంగా సన్నని లోతైన కాలువ (డీప్‌కట్) నిర్మాణం చేపట్టారు. వెలుగుమట్ల వద్ద నుంచి వి.వెంకటాయపాలెం గ్రామ శివారు వరకు కిలోమీటరు పొడవున దీన్ని నిర్మించారు. పూర్తిగా మానవ వనరులతోనే దీన్ని తవ్వారు. నగర, పరిసర వాసులు గతంలో తీవ్ర తాగునీటి ఎద్దడి ఎదుర్కొన్న సమయంలో ఈ డీప్‌కట్‌లో జలాలే అవసరాలను తీర్చాయి. స్థానిక పొలాలకు మాత్రం ఈ జలాలు అందే పరిస్థితి లేకపోవటంతో రైతులు కాల్వకు ఇరువైపులా విద్యుత్తు మోటార్లు ఏర్పాటు చేసుకున్నారు. ఈ డీప్‌కట్ ఆధారంగా గతంలో కొదుమూరు-వందనం, ఇటీవల మంచుకొండ ఎత్తిపోతల పథకాన్ని నిర్మించారు.

# పొదుపు బాట.. ఆర్థిక సాధికారత

పెద్దపల్లి : స్వయం సహాయక సంఘాల మహిళలకు స్త్రీనిధి రుణాల పంపిణీలో జిల్లా అగ్రపథంలో దూసుకెళ్లింది. కలెక్టర్ శ్రీహర్ష పర్యవేక్షణలో అధికారులు క్రమం తప్పకుండా సమీక్షించడం, ఆపదలో రుణాలు అందించడంతో ఈ ఘనత సాధ్యమైంది. ఈ వార్షిక ఏడాదికి సంబంధించి రాష్ట్రంలో జిల్లా ముందు వరసలో నిలిచింది. రుణాలు కోరిన 48 గంటల్లోపు పంపిణీ చేయడంలో లక్ష్యాలకు చేరుతోంది.

**రూ.5 లక్షలలోపు..**

2011లో స్త్రీనిధి రుణాల పథకానికి శ్రీకారం చుట్టగా స్వశక్తి సంఘాల్లోని మహిళలకు సువిధ, ప్రగతి, అక్షయ, సౌభాగ్య, ఐశ్వర్య పేరిట రూ.50 వేల నుంచి రూ.5 లక్షల వరకు రుణాలు పంపిణీ చేస్తున్నారు. చిన్నతరహా, కుటీర పరిశ్రమలు, వ్యవసాయం, కిరాణ, వస్త్ర వ్యాపారం చేస్తూ ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు ప్రోత్సహిస్తున్నారు. పావలా వడ్డీ వెసులుబాటు కల్పించడంతో క్రమం తప్పకుండా రుణ కిస్తీలు చెల్లించడంతో ముందుంటున్నారు.

**ఫలించిన సమష్టి శ్రమ**

ఈ ఏడాది స్త్రీనిధిలో రూ.51.56 కోట్ల రుణ లక్ష్యం విధించగా ఇప్పటి



వరకు రూ.37.24 కోట్లు పంపిణీ చేశారు. 72.23 శాతం నమోదైంది.

జిల్లా వివరాలు

రుణ లక్ష్యం : 51.56 కోట్లు
పంపిణీ : రూ.37.24 ”
స్వశక్తి సంఘాలు : 1,229
సభ్యులు : 3,896

అందరి సహకారంతో..

జిల్లాలో రుణ లక్ష్యాలపై మొదటి నుంచి ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నాం. మండలాల్లో గ్రామైఖ్య సంఘాల పరిధిలోని మహిళల అవసరాలకు తీర్చేందుకు సకాలంలో రుణాలు పంపిణీ చేస్తున్నారు. అందరి సహకారంతో రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిచింది. ఇదే స్ఫూర్తితో గడువులోపు లక్ష్యాలు చేరుకునేందుకు శ్రమిస్తాం.


దుర్గాప్రసాద్, స్త్రీనిధి రీజినల్ సమన్వయకర్త

## దేవాదాయ భూమి.. పట్టించుకోరేమి?

కామారెడ్డి : నాగిరెడ్డిపేట మండలం తాండూరులోని పురాతన త్రిలింగేశ్వర, దాని పక్కనే ఉన్న గోపాలస్వామి, అక్కంపల్లి గ్రామంలోని వేంకటేశ్వరస్వామి ఆలయ భూములు అన్యాక్రాంతమయ్యాయి. దేవాలయాలకు ఏళ్ల క్రితం పలువురు భక్తులు వివిధ సర్వే నంబర్లలో 10 ఎకరాల భూమిని విరాళంగా ఇచ్చారు. అనంతరం కొందరు ఆక్రమణదారులు వాటిని కబ్జా చేసి అందులో సాగు చేస్తున్నారు. కౌలు చెల్లించకపోగా.. కనీసం తామే సాగు చేస్తున్నామనే విషయాన్ని కూడా ఎవరూ చెప్పడం లేదు. ఏళ్లు గడుస్తున్నా ఆ భూములు ఎక్కడ, ఎవరి అధీనంలో ఉన్నాయి. ఎవరు సాగు చేసుకుంటున్నారో దేవాదాయ, రెవెన్యూ అధికారులకు సమాచారమే లేదు.

అక్రమంగా పట్టా చేసుకునే ప్రయత్నం

మండలంలోని తాండూరు, వెంకంపల్లి, ధర్మారెడ్డి, అక్కంపల్లి గ్రామాల



పరిధిలో 14 సర్వే నంబర్లలో ఈ దేవాలయాల భూమి ఉంది. ఆయా శాఖల నిర్లక్ష్యాన్ని ఆసరాగా చేసుకున్న పలువురు భూముల్లో వాలిపోయారు. ఆ దేవాలయంలో గతంలో పనిచేసిన ఓ ఉద్యోగి, ఆయన కుటుంబసభ్యులు వారి పేరు మీద పట్టా చేసుకోవడానికి ప్రయత్నాలు చేస్తున్నారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఆ గ్రామాల్లో ఎకరా రూ.30 లక్షల నుంచి రూ.40 లక్షల వరకు ధర పలుకుతోంది. మిగతా భూములు అన్యాక్రాంతం కాకుండా చూడాలని భక్తులు కోరుతున్నారు.

**అధికారులు ఏమన్నారంటే..**

‘ఆ భూముల్ని నిషేధిత జాబితాలో పెట్టాం. అవి దేవాదాయశాఖ పరిధిలో లేవు. గ్రామస్థులు లేఖ రాస్తే మేం చర్యలు తీసుకోవడానికి అవకాశం ఉండేది’ అని తహసీల్దార్ శ్రీనివాసరావు అన్నారు.

‘దేవాలయ భూములు నిషేధిత జాబితాలోనే ఉన్నాయి. ఇతరుల ఆధీనంలో ఉన్నాయని తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లాం. వాటిని స్వాధీనం చేసుకోవాలని లేఖ రాశాం’ అని దేవాదాయశాఖ కార్యనిర్వహణ

## మద్యం దాహం.. కుటుంబాలు ఆగం

మద్యం తాగితే మనిషి విచక్షణ కోల్పోతాడు. కానీ జిల్లాలో ఏకంగా ప్రాణాలనే కోల్పోతున్నారు. మద్యం తాగేందుకు డబ్బులు ఇవ్వడం లేదని, దొరకడం లేదని యువత అప్పులు చేస్తున్నారు. వీటిని తీర్చలేక ప్రాణాలు విడుస్తూ వారినే నమ్ముకున్న కుటుంబాలను కష్టాల సుడిగుండంలోకి నెట్టేస్తున్నారు.

డీ అడిక్షన్ కేంద్రాలేవి? మద్యానికి బానిసైన వారిలో మార్పు తేవాలంటే డీ అడిక్షన్ కేంద్రాలతోనే సాధ్యం. వీటిని ఏర్పాటు చేస్తామని ప్రభుత్వం ప్రకటించి ఆరునెలలు దాటుతున్నా అమలుకు నోచుకోలేదు. పోలీసులు–ఆబ్కారీ శాఖ అధికారులు కౌన్సెలింగ్‌లు నిర్వహిస్తున్నా అనుకున్న రీతిలో ఫలితాలు రాబట్టలేకపోతున్నారు. ‘మద్యం మూలాలను అరికట్టేందుకు నిరంతర నిఘా కొనసాగిస్తున్నాం. జూదం, గంజాయి, అల్ప్రాజోలం వంటి మత్తు పదార్థాల కట్టడికి వ్యవస్థను రూపొందించాం. మత్తు పదార్థాలు, మద్యం, కల్తీ కల్లుకు బానిస కాకుండా ప్రజల్లో చైతన్యం తెస్తున్నాం.’ అని జిల్లా ఎస్పీ రాజేష్‌చంద్ర అన్నారు. భార్య, పిల్లలకు బతుకు భారం: ‘గాంధారికి చెందిన యువకుడు ఓడుసుల చిరంజీవి (30) వ్యవసాయంతోనే కుటుంబ పోషణ చేస్తుండేవాడు. మద్యానికి బానిసైన అతడు గత నెల 31వ తేదీన పురుగుల మందు తాగి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఆయనే ఆధారంగా బతుకుతున్న భార్య, ఇద్దరు పిల్లలకు ఇప్పుడు జీవితం భారమైంది.’ఈ తండ్రికి శోకం: ‘నాగిరెడ్డిపేట మండలం తాండూర్‌కు చెందిన కుమార్ (18) తాగుడుకు బానిసై ఇంట్లోవారితో తరచూ గొడవపడేవాడు. మద్యం మత్తులో కన్నతండ్రిని అనరాని మాటలనడంతో చుట్టుపక్కలవారు మందలించారు. మనస్తాపం చెందిన కుమార్ గత నెల 22వ తేదీన ఇంట్లో ఉరేసుకొని చనిపోయాడు. చేతికందిన కొడుకును మద్యం రక్కసి కబలించిన తీరును తలచుకొని తండ్రి సంగయ్య ఇప్పటికీ రోధిస్తున్నారు.’వీరికి దిక్కేది?: శేరిబీబీపేటకు చెందిన బోడ సునీల్ (30) మద్యానికి బానిసై భార్యతో తరచూ గొడవపడేవాడు. ఈ నెల 10న గొడవపడి ఇంటి నుంచి వెళ్లి గడ్డి మందు తాగి చనిపోయాడు. దీంతో అతడి భార్య, కూతురు దిక్కులేని వారయ్యారు. దుష్పరిణామాలు ఇవే.. మత్తులో జూదం ఆడడం, దొంగతనాలు–దోపిడీలు, అసాంఘిక కార్యకలాపాలు, నేరాలకు పాల్పడి కటకటాలపాలవుతున్నారు.

# మట్టిమేలు తలపెట్టు..!



మిర్యాలగూడ : ప్రకృతి ప్రసాదించిన సహజ వనరుల్లో నేల ప్రధానమైంది. అయితే ఎడాపెడా పురుగు మందులు, రసాయన ఎరువులు వాడి, ప్లాస్టిక్ వినియోగం వంటి కారణాలతో ఆ నేలను నాశనం చేసుకుంటున్నాం. 90 శాతానికి పైగా ఆహారం అందించే నేల తల్లి సారం కోల్పోతూ జీవజాతి మనుగడ ప్రశ్నార్థకంగా మారబోతోంది. దీనికి మనిషి చేస్తున్న తప్పిదాలే ప్రధాన కారణాలని నిపుణులు చెబుతున్నారు. భూమిని, మట్టిని కాపాడుకునేందుకు ఏటా డిసెంబరు 5న ‘ప్రపంచ మృత్తికా (నేల) దినోత్సవం’ నిర్వహిస్తున్నారు.

**భూసారం తగ్గడానికి ప్రధాన కారణాలు..**

రసాయన ఎరువులు, పురుగుమందులు వాడడం, పంట కొయ్యలు కాల్చడం, మితిమీరిన భూగర్భజలాల వినియోగం. చెట్లను నరకడం, కలుషిత జలాలు నేలలోకి మళ్లించడం.

పీఎం రాష్ట్రీయ కృషి వికాస్ యోజన పథకంలో భాగంగా నల్గొండ, సూర్యాపేట జిల్లాల్లో ఇటీవల నిర్వహించిన మట్టి పరీక్షల్లో నత్రజని తక్కువ ఉన్నట్లు, భాస్వరం మధ్యస్తం నుంచి అధికంగా ఉన్నట్లు, పొటాష్ తక్కువగా ఉన్నట్లు గుర్తించారు.

**మట్టి పరీక్షలు ఎప్పుడు చేయించాలి..?**

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మిర్యాలగూడలో మాత్రమే మట్టి పరీక్షా కేంద్రం ఉంది. ఎరువులు వాడడానికి 45 రోజుల ముందు పంట సాగుకు ముందు భూమిలో అధికారుల సూచించిన విధంగా పొడిగా ఉండే మట్టి నమూనాలు సేకరించి కేంద్రానికి తీసుకురావాలి. వారం రోజుల్లోపు మట్టిని పరీక్షించి నివేదిక అందిస్తారు.

**సేంద్రియ ఎరువుల వాడకమే...**

భూసారం తగ్గకుండా ఉండాలంటే రైతులు రసాయన ఎరువులకు బదులు సేంద్రియ ఎరువులు వాడడమే మేలు. ఏటా కనీసం ఒక సారైనా పంట భూముల మట్టిని పరీక్ష చేయించిన తర్వాత..అధికారులు సూచించే మోతాదుల ప్రకారమే ఎరువులు వాడడం వల్ల భూమికి ఎటువంటి నష్టం వాటిల్లదు.

పోరెడ్డి నాగమణి, ఏడీ, మట్టి పరీక్షల కేంద్రం, మిర్యాలగూడ.

# పొరుగు ధాన్యం.. పొందేలా లాభం



నల్గొండ : సన్నధాన్యం పండించే రైతులకు ప్రభుత్వం ప్రోత్సాహంగా అందించే బోనస్..బోగస్ దందాలు చేసేవారికి కల్పతరువుగా మారింది. ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర నుంచి ధాన్యాన్ని తెచ్చి ఉమ్మడి నల్గొండ జిల్లా వ్యాప్తంగా ఉన్న మిల్లులకు తరలిస్తున్నారు. రైతులకు అందాల్సిన ప్రోత్సాహక డబ్బులు దళారుల బినామీల ఖాతాల్లో జమవుతున్నా.. పౌరసరఫరాల శాఖాధికారులు తూతూ మంత్రంగా కేసులు నమోదు చేస్తున్నారనే విమర్శలున్నాయి.

**దందా ఇలా..**

ఏపీలోని సరిహద్దు జిల్లాలు పల్నాడు, గుంటూరు, తెనాలి ప్రాంతాల నుంచి సన్నధాన్యం కొనుగోలు చేసి లారీలు, డీసీఎం వాహనాల్లో తెలంగాణకు తరలిస్తున్నారు. నల్గొండ, సూర్యాపేట జిల్లాలోని మిల్లుల్లో, కొనుగోలు కేంద్రాల్లోనూ రైతుల పేరుతో విక్రయాలు సాగిస్తున్నారు. తెనాలి, మచిలీపట్నం, ఎన్టీఆర్ జిల్లా పామర్రు తదితర ప్రాంతాల ధాన్యం కొనుగోలు చేసి ఇక్కడి మిర్యాలగూడ, తిరుమలగిరి, కోదాడ, హుజూర్‌నగర్, చిట్యాల, భువనగిరి, ఆలేరు, చందూరు, చింతలపాలెం మండలం దొండపాడు, కొండమల్లేపల్లిలోని మిల్లులకు రప్పిస్తున్నారు. నిబంధనల ప్రకారం బోనస్ పొందాలంటే స్థానిక రైతులవ్వాలి. ఇదే అదనుగా మిల్లర్లు, దళారులు తమకు తెలిసిన స్థానిక రైతుల వివరాలు అప్పగించి అక్రమార్జనకు తెరతీస్తున్నారు.

నిబంధనల ఉల్లంఘన


కస్టమ్ మిల్లింగ్ నిర్వహిస్తున్న సమయంలో అనుమతి లేనిదే ఇతర రాష్ట్రాల నుంచి ధాన్యం లారీ బస్తాల రవాణా చేయకూడదు. ఈ నేపథ్యంలో మిల్లర్లు ఎలాంటి ప్రత్యేక అనుమతులు లేకుండా రెండు రాష్ట్రాల నుంచి ఎలా వచ్చాయనేది ప్రశ్నార్థకంగా మారింది.

గతేడాది డిసెంబరులో 81 లారీల వరకు పక్క రాష్ట్రం నుంచి అడ్డదారుల్లో ప్రవేశిస్తున్నట్లు గుర్తించారు. అయినా ఎలాంటి చర్యలు తీసుకోకుండానే లారీలను వెనక్కి పంపించడంపై అప్పట్లో విమర్శలు వ్యక్తమయ్యాయి.

**కేసులు నమోదు చేశాం**

ఏపీ నుంచి 6, మహారాష్ట్ర నుంచి 5 లారీలు ధాన్యం లోడుతో బుధవారం మిర్యాలగూడ ప్రాంతాల్లోని వివిధ రైస్ మిల్లులకు తరలిస్తుండగా ఆలగడప టోల్ గేట్ సమీపంలో వ్యవసాయ, పౌరసరఫరాల, పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పట్టుకుని స్టేషన్‌కు తరలించాం. ఒక్కోలారీలో 300 క్వింటాళ్ల ధాన్యం ఉన్నట్లు గుర్తించాం. నిబంధనలు ఉల్లంఘించినందుకు 3,122 క్వింటాళ్ల మేర 4,377 ధాన్యం బస్తాలు, 11 లారీలను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నాం. సీజన్‌లో ఇప్పటి వరకు 71 లారీలను గుర్తించి వెనక్కి పంపాం. రాజశేఖర్‌రాజు, మిర్యాలగూడ డీఎస్పీ

# స్ఫూర్తి పొందాలి.. ఖ్యాతి దక్కాలి..!



కొత్తగూడెం: భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లో కొన్ని గ్రామాలు స్వచ్ఛతే, పచ్చదనం, సమర్థ పాలన వంటి అంశాల్లో ఉన్నత ప్రమాణాలు నెలకొల్పి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రశంసలు అందుకున్నాయి. అనేక పల్లెలకు ఆదర్శంగా నిలిచాయి. ప్రస్తుతం గ్రామ పంచాయతీ ఎన్నికలు జరుగుతుండటంతో వాటి ఘనతలను మరోసారి గుర్తుచేసుకుందాం. త్వరలో కొలువుదీరనున్న పాలకవర్గాలు స్ఫూర్తి పొంది తమ గ్రామ పంచాయతీలను ఆదర్శంగా తీర్చిదిద్దాలి.

**ఖమ్మం జిల్లాలో..**

కూసుమంచి మండలం పాలేరు గ్రామ పంచాయతీ.. పారిశుద్ధ్య నిర్వహణలో రాష్ట్రంలోనే రెండో స్థానం సాధించి ఆదర్శంగా నిలిచింది. మూడేళ్లుగా అదే ఒరవడిని కొనసాగిస్తోంది.

కొణిజర్ల మండల కేంద్రం, ముదిగొండ మండలం మేడేపల్లి గ్రామాలు.. పారిశుద్ధ్య నిర్వహణలో జిల్లా స్థాయిలో ఉత్తమ పంచాయతీలుగా ఎంపికయ్యాయి.

మధిర మండలం ఖమ్మంపాడు.. పారిశుద్ధ్య నిర్వహణ, సీసీరోడ్లు, వీధి దీపాల ఏర్పాటులో జిల్లా స్థాయిలో ఉత్తమ పంచాయతీగా గుర్తింపు పొందింది.

వీటితోపాటు మరికొన్ని గ్రామ పంచాయతీలు జిల్లా, రాష్ట్రస్థాయిలో వివిధ విభాగాల్లో గతంలో ఉత్తమ పంచాయతీలుగా నిలిచాయి. రెండేళ్లుగా పాలకవర్గాలు లేకపోవటంతో పరిస్థితులు కాస్త ఇబ్బందికరంగా మారాయి. నూతన పాలకవర్గాలు కొలువుదీరితే పల్లె పాలన గాడినపడుతుందని ప్రజలు భావిస్తున్నారు. గ్రామాలను అభివృద్ధి చేసే వారికే పట్టం కడతామని చెబుతున్నారు.

**భద్రాద్రి జిల్లాలో..**

చుంచుపల్లి మండలంలోని గౌతంపూర్.. పరిశుభ్రత, తాగునీటి సరఫరా, మాతాశిశు మరణాల నివారణ, టీకాల పంపిణీ తదితర అంశాల్లో మెరుగైన ఫలితాలు సాధించి 2021–22లో ‘ప్రజారోగ్యం’ విభాగంలో జాతీయ అవార్డు అందుకుంది.

అశ్వాపురం మండలం మొండికుంట గ్రామ పంచాయతీ.. చెత్త నుంచి సంపద సృష్టిస్తోంది. తడి, పొడి చెత్త సేకరించటంతో పాటు వాటిని వేరుచేసి విక్రయించటం ద్వారా రూ.వేలల్లో ఆదాయం పొందుతోంది. ములకలపల్లి మండలం జగన్నాథపురం.. ఇంకుడు గుంతల నిర్మాణంలో జాతీయ స్థాయిలో ఉప రాష్ట్రపతి నుంచి అవార్డు అందుకుంది. ఇదే మండలంలోని పూసుగూడెం గ్రామ పంచాయతీ.. మరుగుదొడ్ల నిర్మాణంలో స్వచ్ఛభారత్ కింద రాష్ట్రస్థాయి అవార్డును సొంతం చేసుకుంది.

# వ్యాపార విస్తరణకు చేయూత

పరిగి : వీధి విక్రయదారులకు ఆర్థికంగా చేయూతనిచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి ఆత్మనిర్భర్ నిధి యోజన పథకాన్ని అమలు చేస్తోంది. అధిక వడ్డీల భారం నుంచి వీరిని గట్టెక్కించి స్వశక్తితో నిలదొక్కుకునేలా చేయడం దీని ఉద్దేశం. ఈ క్రమంలోనే మూడు విడతలుగా వీధి వ్యాపారులను గుర్తించి ఆర్థిక సాయం అందజేస్తోంది. వాయిదాలు క్రమం తప్పకుండా చెల్లిస్తున్న వారిని ప్రోత్సహించేందుకు రాయితీ సదుపాయాన్ని కల్పిస్తోంది. దీన్ని కొందరు చక్కగా వినియోగించుకుంటూ వ్యాపారాన్ని విస్తరించుకుంటున్నారు. తద్వారా వారి కుటుంబాలకు చేదోడుగా నిలుస్తున్నారు. నాలుగు పురపాలికల్లో 7,887 మంది వీధి వ్యాపారులను అధికారులు గుర్తించారు. ఇప్పటి వరకు వారికి సుమారు రూ.2.76 కోట్లు రుణంగా అందించారు. కొత్తగా క్రెడిట్‌కార్డులు అందించేందుకు కసరత్తు చేస్తున్నారు.

**నాలుగో విడతలో ఇలా..**

ఇప్పటివరకు ప్రధానమంత్రి ఆత్మనిర్భర్ నిధి యోజన పథకాన్ని పట్టణ ప్రాంతాల్లోనే అమల్లో ఉంది. ఎంపిక చేసిన వీధి వ్యాపారులకు తొలి విడతలో రూ.10వేల చొప్పున 7,887 మందికి, రెండో విడతలో 4,875 మందికి రూ.20వేల చొప్పున, మూడో విడతలో 2,070 మంది వ్యాపారులకు రూ.50వేల చొప్పున రుణ సదుపాయం కల్పించారు. నాలుగో విడతలో వికారాబాద్ పురపాలికలో 793



మందికి, తాండూరులో 840, పరిగిలో 250, కొడంగల్‌లో 280 మందికి క్రెడిట్ కార్డులు అందించనున్నారు. గతంలో రుణం తీసుకొని క్రమం తప్పకుండా వాయిదాలు చెల్లించినవారే నాలుగో విడతకు అర్హులుగా నిర్ధారించారు.

**పరిమితి రూ.30 వేలు..**

నిరుపేద కుటుంబాల్లోనూ ఆర్థిక అక్షరాస్యతను తీసుకొచ్చేందుకు అధికారులు కృషి చేస్తున్నారు. ఇందులో భాగంగానే క్రెడిట్ కార్డులను అందించేందుకు క్షేత్రస్థాయిలో సర్వే ముమ్మరం చేశారు. వచ్చిన దరఖాస్తులను నిశితంగా పరిశీలిస్తున్నారు. ఒక్కో క్రెడిట్ కార్డుపై రూ.10వేల నుంచి గరిష్ఠంగా రూ.30వేల దాకా పరిమితి ఉంటుందని అధికారులు తెలిపారు. వచ్చే ఏడాది మార్చికల్లా లక్ష్యం పూర్తి చేస్తాం..: రవికుమార్, జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్, మెప్మానిర్దేశిత లక్ష్యాన్ని వచ్చే ఏడాది మార్చికల్లా పూర్తి చేయాలని పక్కా ప్రణాళికతో ముందుకెళుతున్నాం. వ్యాపారంతో ఎప్పటికప్పుడు వచ్చిన డబ్బులు చాలా వరకు ఖర్చు చేస్తున్నారు. పొదుపు అలవాట్లతో ఆర్థిక క్రమశిక్షణ అలవడుతుంది. ఆ దిశగా వారిని ప్రోత్సహిస్తున్నాం.

## జీరో దందా.. తలో వంద..!

నల్గొండ : ఉమ్మడి నల్గొండ జిల్లాలో జాతీయ, రాష్ట్ర రహదారులతో పాటు కంకర, ఇసుక నిల్వలను తీసుకెళ్లే వాహన చోదకుల అతివేగానికి అంతే లేకుండా పోయింది. మూడు జిల్లాల్లోని క్వారీలు, రీచ్‌ల్లో భూగర్భ గనులు, రెవెన్యూ అధికారుల అనుమతుల ప్రకారం ఉదయం నుంచి సాయంత్రం వరకు సజావుగా సాగుతున్నా.. అర్ధరాత్రి నుంచి తెల్లవారుజాము వరకు అనధికారికంగా నిర్వహించే అక్రమ రవాణా వల్లే రహదారి ప్రమాదాలు జరుగుతున్నాయి.

**రాజకీయ అండ**

నల్గొండ జిల్లాలో రావులబండ(దోమలపల్లి), నార్కట్‌పల్లి, కేతేపల్లి, కట్టంగూరు, దేవరకొండ, కొండమల్లేపల్లి, గాజీనగర్, పోలేపల్లి, దామరచర్ల, తిప్పర్తి, పెద్ద సూరారం, కనగల్, ఇనుపాముల, బొల్లేపల్లి, పోతినేనిపల్లి, ఇండ్లూరు, వేలాల ప్రాంతాల్లో యథేచ్ఛగా రాకపోకలు సాగిస్తుండటతో రహదారులు దెబ్బతింటున్నాయి. రహదారి పనులకు ఉచితంగా ‘జీరో’ బిల్లు ఇచ్చేలా ఆయా క్రషర్ల యజమానులకు గనులు, ఆర్అండ్‌బీ అధికారులు ఆదేశాలు జారీ చేయడంతో భారీగా అక్రమాలు చోటు చేసుకుంటున్నాయి. యాదాద్రి భువనగిరి జిల్లాలోని బొమ్మలరామారం, పోచంపల్లి, బీబీనగర్ ప్రాంతాల్లో నిబంధనలకు విరుద్ధంగా కంకర తవ్వకాలు జరుగుతున్నాయి.

సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లో రెండు, గరిడేపల్లి మండలంలో ఆరు కంకర మిల్లులున్నాయి. అప్పన్నపేట, హుజూర్‌నగర్–కోదాడ రోడ్ మధ్యలో ఉన్న కంకర మిల్లుల నుంచి వచ్చే పొగతో స్థానికులు, రవాణా వల్ల వెలువడే దుమ్ముతో వాహనదారులు ఇబ్బందులు




పడుతున్నారు. జీరో దందాను ఆసరాగా చేసుకుని క్రషర్ల నిర్వాహకులు ఒక బిల్లు చీటీతో దొంగ వేబిల్లులు సృష్టించి రెండు, మూడు లారీలను అక్రమంగా తరలిస్తున్నారు. దీనికి అర్ధరాత్రి నుంచి తెల్లవారుజాము వరకు సమయాన్ని ఎంచుకుంటున్నారు. అన్ని విభాగాల అధికారులకు, సిబ్బందికి ‘నాలుగు రాళ్లు’ వెనకేసుకునేలా చేస్తుండటంతో వారూ కూడా చూసీచూడనట్లు ఉంటున్నారనే ఆరోపణలున్నాయి.

జాతీయ, రాష్ట్ర రహదారులపై ఒకే నంబరు ప్లేట్లతో నాలుగైదు వాహనాలు ఉంటున్నాయి. బిహార్, ఒడిశాకి చెందిన వారిని డ్రైవర్లుగా నియమించడంతో వారు ఇష్టారీతిన నడిపిస్తున్నారు.

టిప్పరు, లారీలో గరిష్ఠంగా 30 టన్నుల కంకర నింపాలి. కానీ యజమానులు 70 టన్నుల వరకు నింపేస్తున్నారు. దీంతో వాహనాలు వంగి ప్రయాణించి.. వేగంపై పట్టు తప్పుతున్నట్లు పోలీసులు చెబుతున్నారు. ఈ విషయాన్ని జిల్లా భూగర్భ గనులశాఖాధికారి జాకబ్ సామ్యూల్‌తో ప్రస్తావించగా.. తనిఖీలు చేపట్టి అక్రమాలకు పాల్పడ్డ క్రషర్ యజమానులపై చర్యలు తీసుకుంటామన్నారు.

# కటిక నేలపై.. చలికి వణుకుతూ...

హైదరాబాద్: చలికాలం ప్రారంభమైంది. ఒకవైపు.. దోమల బెడద.. మరోవైపు కప్పుకోవడానికి ఒంటి నిండా దుప్పట్లు లేక గజగజ వణకుతున్నారు.నిమ్స్, నిలోఫర్, ఎంఎన్‌జే, ఉస్మానియా, గాంధీ తదితర ప్రభుత్వాసుపత్రుల వద్ద చాలీచాలనీ షెల్టర్లతో రోగుల సహాయకులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. వాటిల్లో చికిత్సలకు తెలుగు రాష్ట్రాల నుంచి నిత్యం వందల మంది రోగులు వస్తుంటారు. వారి వెంట ఇద్దరు, ముగ్గురు సహాయకులూ ఉంటారు. కొందరు ఓపీలో చికిత్స తీసుకొని సాయంత్రానికి తిరిగి వెళ్లిపోతుంటారు. మరికొందరికి మాత్రం.. వైద్యుడు చూశాక టెస్టులు రాస్తే ఒకటి లేదా రెండు రోజుల



వరకు అక్కడే ఉండాలి. శస్త్రచికిత్సలు, రేడియేషన్ లాంటివి అవసరమైతే మూడు, నాలుగు రోజులపాటు నిరీక్షణే. రోగులు సైతం ఆసుపత్రిలో చేరాలి. ఈ క్రమంలో ఒక్క సహాయకుడినే లోపలకు అనుమతిస్తారు.

**వేధిస్తున్న మౌలిక వసతుల కొరత**

నిమ్స్, ఉస్మానియా, గాంధీ, ఎంఎన్‌జే, నిలోఫర్, పేట్లబుర్జు తదితర దవాఖానాలకు రోజూ 7-10 వేల మంది రోగులు వస్తుంటారు. వారిలో వెయ్యి నుంచి 1200 మంది వరకు ఆసుపత్రుల్లో చేరుతుంటారు. వారితోపాటు వచ్చే సహాయకుల సౌకర్యార్థం.. ఆయా ఆసుపత్రుల వద్ద షెల్టర్లు నిర్మించినా ఎటూ సరిపోవడం లేదు. వాటి వద్ద మౌలిక వసతులలేమి కూడా వేధిస్తోందని, సులభ్ కాంప్లెక్సులకు వెళ్లి కాలకృత్యాలు తీర్చుకోవాల్సి వస్తోందని పలువురు చెబుతున్నారు. నిమ్స్‌లో షెల్టర్లు కూడా రోగుల రద్దీకు అనుగుణంగా లేవు. దీంతో కటిక నేలపై చలికి వణుకుతూ నిద్రించాల్సి వస్తోంది.

# నెల తిరగకముందే వసూళ్లా?

కరీంనగర్ : కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలో పారిశుధ్య నిర్వహణ మెరుగుపర్చాలనే ఉద్దేశంతో ఇళ్ల నుంచి స్వచ్ఛ ఆటోల ద్వారా చెత్త సేకరణ జరుగుతుండగా వాణిజ్య సంస్థల నుంచి సేకరణ బాధ్యతలు ప్రైవేటు ఏజెన్సీకి అప్పగించారు. నిబంధనల ప్రకారం వీరు ఈ నెల 1 నుంచి నగరంలోని 14.5 కిలోమీటర్ల పొడువునా రహదారికి ఇరువైపులా ఉన్న అన్ని రకాల వాణిజ్య సంస్థలు, దుకాణాల సముదాయాల నుంచి చెత్త సేకరణ చేయాల్సి ఉంది. అయితే ముందుగానే వసూళ్లకు పాల్పడుతున్నారు. నగరవ్యాప్తంగా ఈ తీరు తీవ్ర విమర్శలకు తావిస్తోంది. నెల మొత్తం చెత్త సేకరణ చేసిన తర్వాత నోటీసులు ఇచ్చి టెండర్‌లో పొందుపర్చిన విధంగా వసూలు



చేయకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

**రూ.61 లక్షలతో టెండరు**

వాణిజ్య సంస్థలు, దుకాణాల నుంచి చెత్త సేకరించి యూజర్ ఛార్జీలు వసూలు చేసుకోవడానికి నగరపాలక సంస్థ ఆరు నెలల కిందట రూ.61.09 లక్షలతో టెండర్ నిర్వహించి ఖరారు చేసింది. సదరు సంస్థ తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించేలా ఆదేశాలు జారీ చేశారు. అయితే వీరు అడ్డగోలుగా వసూళ్లు చేస్తున్నారని, సకాలంలో చెత్త తరలించడం లేదని ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. దుకాణాన్ని బట్టి బల్దియా ధరలు ఖరారు చేయగా ఏజెన్సీ మాత్రం అవేవీ పాటించడం లేదని తెలుస్తోంది.

**అంతర్గత వీధుల్లోకొచ్చి..**

ప్రైవేటు ఏజెన్సీ ప్రధాన రహదారి వెంబడి వాణిజ్య సముదాయాల నుంచి చెత్త తీసుకెళ్లడానికి నిర్ణయించగా అంతర్గత వీధుల్లోకి పరుగులు పెడుతోంది. అపార్ట్‌మెంట్ల దగ్గరికి వెళ్లి నోటీసులిచ్చి చెత్త సేకరణ చేస్తామంటున్నారు. స్వచ్ఛ ఆటో కార్మికులకు బహుళ అంతస్తుల్లో చెత్త సేకరణకు ఇళ్లు లేకపోవడంతో లబోదిబోమంటున్నారు.

# దిశ లేకపాయె..!

నల్గొండ: మొంథా తుపాను ప్రభావంతో వరిధాన్యం తడిచి మొలకలు వచ్చాయి. పత్తి పంట వర్షార్పణమైంది. ఉద్యాన పంటలు ఏ ఆధారం లేకుండా పోయాయి. ఈ తరుణంలో.. కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు తీరును సమీక్షించేందుకు ఎంపీ ఛైర్మన్‌గా వ్యవహరించే జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ(దిశ) సమావేశం ఎప్పుడు నిర్వహిస్తారో తేలడం లేదు. ఎంపీ కీలక పాత్ర పోషించాల్సిన కమిటీ అంతిమ లక్ష్యం..కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టే ఎన్నో పథకాలు ప్రజలకు అందేలా చర్యలు తీసుకోవడమే. రైతుల సమస్యలతో పాటు గ్రామాలు, పట్టణాల్లో తాగు, సాగు, రహదారి వసతులు అరకొరగా ఉన్నాయి. అభివృద్ధి నిధులున్నా ప్రగతి ముందుకు సాగడం లేదు. సంక్షేమ పథకాలు అటకెక్కాయి. పేదల అభ్యున్నతికి అమలవుతున్న నిధులు మూలుగుతున్నాయి.ప్రతి సంవత్సరంలో మూడునెలలకోసారి సమావేశం నిర్వహించాల్సి ఉండగా గతేడాది ఒకసారి మాత్రమే నిర్వహించారు. ఈ ఏడాది అసలు లేనే లేదు. గత ఏడాది నవంబరు 22న జిల్లా కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహించారు. ఈ విషయాలను నల్గొండ ఎంపీ రఘువీర్ రెడ్డితో 'ఈనాడు' ప్రస్తావించగా..త్వరలో 'దిశ' కమిటీ సమావేశం ఏర్పాటు చేస్తామని వివరించారు.

నల్గొండ జిల్లావ్యాప్తంగా సిమెంట్, గ్రానైట్, ఇసుక క్వారీలు, ఇతరత్రా పరిశ్రమల నిర్వహణతో వచ్చే నిధులతో పనులు శరవేగంగా జరగాల్సి ఉంటుంది. పత్తి, వరి రైతులకు మద్దతు ధరలు కల్పించే నిర్ణయాలు, ప్రధాన మంత్రి ఖనిజ క్షేత్ర కల్యాణ్‌యోజన పథకం కింద ప్రభావిత గ్రామాలకు కేటాయింపులు, ఎంపీ ల్యాడ్స్ కింద రూ.5 కోట్లను ప్రతి ఏడాది కేటాయిస్తున్నారు. ఇందులో నియోజకవర్గాల వారీగా ఏయే అభివృద్ధి పనులకు కేటాయించాల్సి ఉంటుందో చర్చించాలి. ప్రధానమంత్రి సడక్, ముద్ర, ఆవాస్ యోజన, సికింద్రాబాద్ నుంచి గుంటూరు వయా నల్గొండ, మిర్యాలగూడ, రైల్వే స్టేషన్ల విస్తరణ, ఇతర పనులపై కూడా చర్చించాల్సి ఉంటుంది.

# దుప్పట్లు రాలేదు.. మంచాలు లేవు



హుజూరాబాద్ : కొన్ని రోజులుగా ఉష్ణోగ్రతలు వేగంగా తగ్గుతుండటంతో చలి బాగా పెరుగుతోంది. దీంతో ప్రభుత్వ వసతి గృహాల్లోని విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని హాస్టళ్లకు దుప్పట్లు రాకపోగా, మరికొన్నింట్లో మంచాలు లేక కింద పడుకోవాల్సి వస్తోంది. చాలా చోట్ల విరిగిన కిటికీలు, తలుపులు ఉండటంతో చలి తీవ్రత పెరిగి విద్యార్థులు వణుకుతున్నారు. సరిగ్గా నిద్ర పట్టక చదువుల మీద శ్రద్ధ పెట్టలేకపోతున్నారు.

**సమస్యల నిలయాలుగా..**

జిల్లావ్యాప్తంగా మొత్తం 30 సాంఘిక సంక్షేమ వసతి గృహాలున్నాయి. ఇందులో మూడు నుంచి పదో తరగతి వరకు 1,182 మంది ప్రీమెట్రిక్ విద్యార్థులుండగా ఇంటర్ నుంచి పీజీ వరకు 1,539 మంది పోస్ట్ మెట్రిక్ విద్యార్థులున్నారు. మొత్తం 19 బీసీ వసతి గృహాలున్నప్పటికీ అన్నింట్లో ఏదో ఒక సమస్యతో వసతులు లేక దయనీయంగా తయారయ్యాయి. హుజూరాబాద్ బీసీ బాలుర వసతి గృహంలోని 30 మంది విద్యార్థులకు దుప్పట్లు, మ్యాట్లు ఇచ్చారు కానీ మంచాలు లేవు. జమ్మికుంట బాలుర వసతి గృహంలోనూ ఇదే పరిస్థితి ఉంది. దీంతో విద్యార్థులంతా ఒకే గదిలో అందరూ కలిసి నేలపై పడుకుంటున్నారు. పలు చోట్ల కిటికీలు విరిగి అస్తవ్యస్తంగా తయారయ్యాయి. వాటికి ఏర్పాటు చేసిన జాలీలు చిరిగిపోయాయి. చలితోపాటు దోమలు కూడా వస్తున్నాయని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**టెండర్లు పూర్తయ్యాయి**

విద్యార్థులకు దుప్పట్లు, స్వెటర్లు ఇంకా అందలేదు. వీటి టెండర్ల ప్రక్రియ ఇటీవలే పూర్తయింది. ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ గుత్తేదారుతో మాట్లాడుతున్నాం. అతి త్వరలో వసతి గృహాలవారీగా విద్యార్థులకు అందజేస్తాం. ప్రత్యేక దృష్టి సారించి చర్యలు తీసుకుంటున్నాం.

– నాగులేశ్వర్, డీడీ, కరీంనగర్

ప్రీమెట్రిక్ విద్యార్థులకు దుప్పట్లు, స్వెటర్లు, పోస్ట్ మెట్రిక్ విద్యార్థులకు దుప్పట్లు నేటికీ రాలేదు. కొందరు ఇంటి నుంచి దుప్పట్లు తీసుకొచ్చుకోగా మరికొందరు వసతి గృహాల్లో ఇస్తారని తెచ్చుకోలేదు. కొన్ని వసతి గృహాల్లో దుప్పట్లతోపాటు మంచాలు లేక నేల మీదే నిద్రిస్తున్నారు. అస్తవ్యస్తంగా ఉంటున్న పరిసరాలతో నేల మీద పడుకోవడం ప్రమాదకరమని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు.

# కాలగర్భంలో కాకతీయుల కళావైభవం



సైదాపూర్: ఎంతో ప్రాశస్త్యం కలిగి.. ఒకప్పుడు భక్తులతో కళకళలాడిన కాకతీయులు నిర్మించిన పంచలింగ శివాలయానికి(త్రికూటాలయం) ఆదరణ కరవైంది. మొదటి వేములవాడగా పిలిచే ఈ ఆలయాన్ని పట్టించుకోకపోవడంతో పూజలు నిలిచిపోయాయి. భక్తులు రావటమే గగనమైంది. సైదాపూర్ మండలం గుజ్జులపల్లి గ్రామ సమీపంలో కాకతీయులు నిర్మించిన ఈ ఆలయానికి వందేళ్ల క్రితం వరకు పలు జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చేవారు. కాలక్రమేణ ఆదరణ కోల్పోయి అద్భుత కళాసంపద కాలగర్భంలో కలుస్తోంది. దేవాదాయశాఖ అటు వైపు కన్నెత్తి కూడా చూడటం లేదు. అప్పటి రాష్ట్రమంత్రి పీ.వీ రంగారావు కొన్ని నిధులు విడుదల అయ్యేలా చూడగా.. పనులు నాటి పాలకులు మధ్యలోనే వదిలేశారు.

**గొడిశాల గుళ్లుగా పిలిచేవారు**

రేచర్లరుద్రుడు సామంతరాజుగా ఉన్న కాటయ్య హయాంలో ఆలయం నిర్మించారు. దీనిని గొడిశాల గుళ్లుగా పిలుస్తారు. కాకతీయుల కళాతృష్ణకు ఇక్కడి రాతి శిల్పాలు, శిలాశాసనాలు, నంది విగ్రహాలు ప్రతీకగా నిలుస్తున్నాయి. ఆలయాన్ని 16 పెద్ద రాతి స్తంభాలపై నక్షత్రాకారంగా శిల్పకారులు అద్భుతంగా మలిచారు. రామప్ప ఆలయం స్ఫూర్తిగా కాటయ్య ఈ గుడిని నిర్మించినట్లు చరిత్రకారులు చెబుతున్నారు. తూర్పున నంది విగ్రహం, పడమర, ఉత్తరం, దక్షిణ భాగంలో మూడు శివలింగాలు ఉండటంతో త్రికూటాలయంగా పేరొందింది.

**గుప్త నిధుల కోసం తవ్వకాలు**

ఆలయంలో బంగారు నిధులు ఉన్నాయని ప్రచారం కావటంతో దుండగులు రాత్రివేళల్లో చుట్టూ, లోపల తవ్వకాలు చేపట్టి విగ్రహాలను ధ్వంసం చేశారు. ఇలా పలుమార్లు తవ్వకాలు జరిపారు. పట్టించుకునే నాథుడే లేకపోవడంతో శివలింగాలు తవ్వి, నంది విగ్రహం జరిపి, కొలనులో తవ్వి ఆలయ ఉనికే లేకుండా చేశారు.

# ఆడుతూ పాడుతూ.. దిద్దాలి ఓనమాలు




ఎల్లారెడ్డిపేట: ఆడుతూ పాడుతూ చిన్నారులు ఓనమాలు దిద్దేలా ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోంది. నాలుగేళ్ల వయసు దాటిన పిల్లలకు ప్రభుత్వమే యూకేజీ విద్యనందించేందుకు ప్రణాళికతో ముందుకు సాగుతోంది. అందుకు సమగ్ర శిక్షాభియాన్ కింద భారీ మొత్తంలో నిధులను కేటాయిస్తున్నారు. ఈ నిధులతో అధునాతన సౌకర్యాలను కల్పించనున్నారు. చిన్నారులు, వారి తల్లిదండ్రులను ఆకర్షించేలా మరో కిడ్స్ కేర్ కేంద్రాలను తలపించనున్నాయి. ప్రీ ప్రైమరీ విద్య తర్వాత పిల్లలు అదే ప్రాథమిక పాఠశాలలో ఒకటో తరగతిలో చేరడం మూలంగా విద్యార్థుల సంఖ్య కూడా పెరుగుతుంది. ఆట పాటలతో కూడిన బోధనా పద్ధతుల్లో తీర్చిదిద్దే విషయంపై సమగ్ర శిక్షాభియాన్ అధికారులు ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు.

**జిల్లాలో 13 బడుల్లో..** జిల్లాలో 13 ప్రీ ప్రైమరీ పాఠశాలలను ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఒక్కో పాఠశాలకు రూ.1.70 లక్షల చొప్పున కేటాయించనున్నారు. 13 పాఠశాలలకు కలుపుకొని మొత్తం రూ. 22.10 లక్షలను వెచ్చించనున్నారు. ఈ నిధులతో ఆట పాటలతో చిన్నారులకు బోధించేందుకు చైల్డ్ ఫ్రెండ్లీ ఫర్నీచర్, ఆటవస్తువులు, అవుట్ డోర్ ప్లే మెటీరియల్, షూ, బెల్టు, పాఠశాల బ్యాగులు, ఏకరూప దుస్తులను సమకూర్చనున్నారు. వీటితోపాటు తరగతి గదుల గోడలకు రంగులు వేసి, అందమైన బొమ్మలను చిత్రీకరించనున్నారు. బడికి వెళ్లాలంటే మారాం చేసే చిన్నారులను ఆట వస్తువులు, గోడలకు వేసే వివిధ రకాల చిత్రాలు ఆకర్షించనున్నాయి. తల్లిదండ్రులను కూడా ఆకట్టుకోనున్నాయి. దీంతో పిల్లలు ఉత్సాహంగా ప్రీ ప్రైమరీ పాఠశాలలకు వెళ్తారని అధికారులు భావిస్తున్నారు. పలు రకాల వస్తువులు, ఆట బొమ్మలు, రంగు రంగుల ఆకారాలు వంటివి అందించనుండటంతో చిన్నారులు చదువుపై ఆసక్తి కనబరుస్తారు. కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా పాఠశాల తరగతి గదులు ఆకర్షణీయంగా, అందంగా తీర్చిదిద్దనున్నారు. సర్కారు అందించే ప్రీ ప్రైమరీ విద్యతో తల్లిదండ్రులకు ప్రైవేటు పాఠశాలల్లో చేర్పించేందుకు అయ్యే ఖర్చులు మిగలనున్నాయి. **కలెక్టర్ ఆదేశాలే తరవాయి..** జిల్లాలో ఇప్పటికే ఏయే పాఠశాలల్లో ప్రీ ప్రైమరీ పాఠశాలలను నిర్వహించాలనే విషయంపై అధికారుల నుంచి స్పష్టత వచ్చింది. ఈ మేరకు ఆట పాటలతో కూడిన యూకేజీ విద్యనందించేందుకు ఆయా గ్రామాల్లో ప్రాథమిక పాఠశాలలను గుర్తించారు. వీటిని నడిపేందుకు ఇన్‌స్ట్రక్టర్ (తాత్కాలిక ఉపాధ్యాయులు), ఆయాల నియామకాలు చేపట్టారు. ఇంటర్మీడియట్, డిప్లొమా ఇన్ ఎడ్యుకేషన్ పూర్తి చేసిన వారిని ఎంపిక చేశారు. వీరి నియామకంలో స్థానికతకు ప్రాధాన్యం ఇస్తూ ముఖాముఖి పరీక్ష కూడా పూర్తి చేశారు. ఇన్‌స్ట్రక్టర్‌కు నెలకు రూ.8 వేలు, ఆయాకు నెలకు రూ.6 వేలను వేతనంగా చెల్లించనున్నారు. కలెక్టర్ నుంచి ఆదేశాలు వెలువడగానే నూతన సొబగులతో పూర్వ ప్రాథమిక పాఠశాలలు ప్రారంభం కానున్నాయి.

# కుటుంబ మేలు తలపెట్టి.. పలుగు, పార పట్టి..!

రాజపేట : గ్రామీణ ప్రాంతాల్లో వలసలను నిలువరించి నిరుపేదలకు ఉపాధి కల్పించడానికి కేంద్ర ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకాన్ని పకడ్బందీగా అమలు చేస్తోంది. ఇందులో భాగంగా ప్రతి కుటుంబానికి కనీసం 100 రోజుల పనిదినాలు కల్పిస్తున్నారు. ఈ పథకంలో మహిళామణులే అధికంగా భాగస్వాములవుతున్నారు. ఇంటి పనులను చక్కదిద్దడంలో ముందుండే మహిళలు కుటుంబానికి ఆర్థికంగా వెన్నుదన్నుగా నిలిచేందుకు 'ఉపాధి' పనుల బాట పడుతున్నారు.కేంద్ర ప్రభుత్వం ఈ పథకంలో ఎప్పటికప్పుడు గ్రామీణ అవసరాలకు అనుగుణంగా మార్పులు చేస్తూనే ఉంది. జిల్లాలో పురుషులకంటే మహిళలే ఎక్కువ సంఖ్యలో ఉపాధిహామీ పథకాన్ని సద్వినియోగ పరచుకోవడం సంతోషంగా ఉందని జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి నాగిరెడ్డికు తెలిపారు.

**అవసరాలకు ఆసరా...**

ప్రస్తుతం ఉపాధిహామీ పథకం కింద చెరువులు, కుంటలు, కాల్వల్లో



పూడికతీత, ఇంకుడుగుంతలు, ఫామ్‌పాండ్స్, ఫిష్ పాండ్స్, గట్ల నిర్మాణం, బీడు భూముల అభివృద్ధి, పశువులు, జీవాలకు షెడ్ల ఏర్పాటు తదితర పనులు చేస్తున్నారు. కొంచం కష్టంతో కూడిన పనులే అయినా మహిళలు వెరవకుండా పురుషులకు దీటుగా ఈ పనుల్లో పాల్గొంటున్నారు. ఎక్కడ ఉపాధి పనులు జరిగినా మహిళలే రెట్టింపు సంఖ్యలో కనిపిస్తున్నారు.ఇంట్లో ఖాళీగా కూర్చోలేక ఉపాధి పనులకు వెళు_న్నామని, నిత్యావసర ధరలు, పిల్లల చదువు ఖర్చులు పెరిగిన దృష్ట్యా ఈ పథకం కింద వస్తున్న డబ్బులు కుటుంబ అవసరాలకు ఆసరాగా ఉంటున్నాయని మహిళలు చెబుతున్నారు.పథకం కింద ఇప్పుడు రోజుకు రూ.307 ప్రభుత్వం ఇస్తుండగా, చాలా మంది మహిళలు రూ.300 వరకు కూలీ తీసుకుంటున్నట్లు సమాచారం.

# విద్యుత్తు వినియోగమే ఆధారం..!

ఖమ్మం : స్టోన్ క్రషర్స్ (రాతి కంకర మిల్లులు)పై ప్రభుత్వం సాంకేతిక పంజా విసురుతోంది. ఇప్పటివరకు ఇష్టారాజ్యంగా క్రషింగ్ జరుపుతూ, తప్పుడు లెక్కలతో సర్కారు ఆదాయానికి గండికొడుతున్న కొన్ని స్టోన్ క్రషర్స్‌ను సక్రమ మార్గంలో నడపటం, ఆదాయం పెంచుకునేందుకు కొత్త నిబంధనలు ప్రవేశపెట్టింది. ఇవి డిసెంబర్ 1 నుంచి అమల్లోకి రానున్నాయి.

**సీసీ కెమెరాలు అమర్చాల్సిందే..**

స్టోన్ క్రషర్స్‌లో విద్యుత్తు వినియోగం ఆధారంగా ఎంత ముడిరాళ్లు క్రషింగ్ చేశారనే లెక్క మేరకు ప్రభుత్వానికి రాయల్టీ చెల్లించాలి. స్టోన్ క్రషర్ నిర్వాహకులు ముడిరాళ్లను ఎక్కడి క్వారీల నుంచైనా తెచ్చుకోవచ్చు. క్వారీ నుంచి వచ్చే ముడిరాళ్లకు రాయల్టీ చెల్లించి.. పర్మిట్ పొంది.. వాహనంలో రవాణాకు వేబిల్లు తీసుకోవాలి.

తెచ్చిన ముడిరాళ్లను క్రషింగ్ చేసేందుకు వినియోగించిన విద్యుత్తు ఆధారంగా ప్రభుత్వానికి రాయల్టీ చెల్లించారా లేదా అనే లెక్క అధికారులు తేల్చనున్నారు. రాయల్టీ చెల్లించకుండా ముడిరాళ్లు తెచ్చి క్రషింగ్ చేస్తే విద్యుత్తు వినియోగం ఆధారంగా అధికారులు లెక్కించి.. ఎక్కువగా క్రషింగ్ విషయం నిర్ధారించుకుని ఐదు రెట్లు జరిమానా విధించనున్నారు.ఖమ్మం జిల్లాలో.. స్టోన్ క్రషర్స్ 35 (వీటిలో పనిచేస్తున్నవి 25) ఉన్నాయి. నెలకు సగటున 2 లక్షల మెట్రిక్ టన్నుల కంకర ఉత్పత్తి అవుతోంది. ప్రస్తుత విధానం ద్వారా జిల్లాలో నెలకు రూ.1.20 కోట్లు రాయల్టీ రూపంలో ప్రభుత్వానికి ఆదాయం వస్తోంది. నూతన విధానం అమల్లోకి వస్తే నెలకు రూ.2కోట్ల వరకు ఆదాయం పెరుగుతుందని అంచనా. మెట్రిక్ టన్ను ముడిరాళ్లకు రాయల్టీ, ఇతర పన్నులు కలిపి రూ.160 చెల్లించాలి. ప్రతి స్టోన్ క్రషర్ నిర్వాహకులుఒక మెట్రిక్ టన్ను ముడిరాళ్ల క్రషింగ్‌కు నాలుగు యూనిట్ల విద్యుత్తు అవసరమని ప్రభుత్వం స్పష్టం చేసింది.

స్టోన్ క్రషర్స్‌లోని విద్యుత్తు మీటర్ నంబర్లు, రీడింగ్ వివరాలు ప్రతినెలా విద్యుత్తు పంపిణీ సంస్థ యాప్, వెబ్‌సైట్‌లో నమోదవుతున్నాయి.

అన్ని స్టోన్ క్రషర్స్‌లో సీసీ కెమెరాలు, వాహనాల నంబర్లు క్యాప్చర్ చేసే కెమెరాలు అమర్చాలి. వీటన్నింటి ఐపీ అడ్రస్‌లతో పాటు జిల్లాకేంద్రంలో మైనింగ్ ఏడీ అధికారుల మొబైల్ ఫోన్లకు అనుసంధానం చేయాలి. ప్రతినెలా 10వ తేదీ నాటికి క్రషర్స్ నిర్వాహకులు మాసం రోజుల్లో ఎంత ముడిరాళ్లు తెచ్చింది, ఎంత క్రషింగ్ చేసింది, నిల్వ ఎంత ఉందనే వివరాలు సమర్పించాలి. ఈనెలలో ప్రభుత్వానికి రూ.50వేలు చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలి.స్టోన్‌క్రషర్స్ నిర్వహణలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన విధానం డిసెంబర్ 1 నుంచి అమలవుతుందని గనులశాఖ ఏడీ రావూరి సాయినాథ్‌కు తెలిపారు.

# పెగళ్లపాడులో గరుడ యాప్‌తో భూసర్వే

తెలంగాణ భూభారతి చట్టం అమలులో భాగంగా రెవెన్యూ గ్రామాల వారీగా భూములను వేర్వేరు పద్ధతుల్లో సర్వే చేపడుతున్నారు. ఇందులో భాగంగా ప్రయోగాత్మకంగా మొబైల్ యాప్‌తో భూములు సర్వే చేసేందుకు రాష్ట్రంలో పైలెట్ ప్రాజెక్టుగా ఖమ్మం జిల్లా మధిర నియోజకవర్గంలో ఎర్రుపాలెం మండలం పెగళ్లపాడు గ్రామాన్ని ఎంపిక చేశారు. ట్రాక్ అనే సంస్థ ఎన్ఐసీ (నేషనల్ ఇన్ఫర్మేటిక్ సెంటర్), రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి మొబైల్ యాప్ రూపొందించింది. దీనికి 'గరుడ' యాప్‌గా నామకరణం చేసింది. ఈ యాప్‌లో ముందుగా ఎంపిక చేసిన రెవెన్యూ గ్రామం పహాణీలోని సర్వేనంబర్, విస్తీర్ణం, పట్టాదారు పేరు సహా ఇతర వివరాలను నిక్షిప్తపరుస్తారు. క్షేత్రస్థాయికి వెళ్లి యాప్‌లోని పహాణీ ఆధారంగా సర్వే నంబర్ వారీగా భూమిని సర్వే జరిపి.. అక్షాంశ, రేఖాంశాలతో లొకేషన్ నమోదు చేయటం ద్వారా షేప్ ఫైల్ మ్యాప్ జనరేట్ అవుతుంది. దాన్ని అక్కడే అప్‌లోడ్ చేస్తారు. పహాణీలో రైతు భూమి వివరాలతో పాటు సర్వే మ్యాప్ (పటం) ఆన్‌లైన్‌లోనే అందుబాటులోకి వస్తుంది. భూముల క్రయవిక్రయాలు, రిజిస్ట్రేషన్ సమయంలో అక్రమాలకు తావుండదు. భూముల వివరాలు పారదర్శకంగా ఆన్‌లైన్‌లో అందుబాటులోకి రానున్నాయి. ఈ సర్వే ప్రక్రియను త్వరలో ప్రారంభిస్తామని సర్వే ల్యాండ్ రికార్డ్స్ ఏడీ శ్రీనివాసులుకు తెలిపారు.

ఈ ప్రక్రియ ద్వారా భూసర్వేలో కచ్చితత్వం వస్తుందని అధికారులు భావిస్తున్నారు. డీజీపీఎస్ (డిఫరెన్షియల్ గ్లోబల్ పొజిషనింగ్ సిస్టం), రోవర్స్, డ్రోన్లు ఉపయోగించి భూసర్వే చేస్తున్నారు. తాజాగా గరుడ మొబైల్ యాప్ ప్రవేశపెడుతున్నారు. లైసెన్స్‌డ్ సర్వేయర్లకు సర్వే బాధ్యతలు అప్పగించే అవకాశముంది.

చురకలు

మంగళవారం 9 డిసెంబర్ 2025

# కదలని వరద.. వదలని బురద

పత్తికొండ : గుంతకల్లు-గుంటూరు రైల్వే లైను వెంట ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఎల్‌సీ గేట్లు తొలగించారు. వాటి స్థానంలో అండర్ పాస్‌లు నిర్మించారు. గుత్తేదారులు నిబంధనలు పాటించలేదు. వరద నీరు వెళ్లడానికి కాల్వలు సరిగా నిర్మించలేదు. దీంతో పెద్ద ఎత్తున నీరు నిలుస్తోంది.. ఏటా ఎనిమిది నెలలపాటు రాకపోకలు నిలిచిపోతున్నాయి. విధిలేక రైతులు వరద నీటిలోనే వెళ్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని వాహనదారులు విన్నవిస్తున్నారు.

మద్దికెర- చిప్పగిరి గ్రామాల మధ్య రైతులు పొలాలకు వెళ్లేందుకు రూ.2 కోట్లు వెచ్చించి అండర్‌పాస్ నిర్మించారు. చిప్పగిరి, కుందనగుర్తి, ఆలూరు, నేమకల్లు తదితర గ్రామాలకు దగ్గరి దారి కావడంతో వెళుతుంటారు. చిన్నపాటి వర్షం కురిసినా నీరు నిలుస్తోంది.

**ఎక్కడ ఎలా ఉందంటే**

చిప్పగిరి మండలం గుమ్మనూరు-డేగులహాల్ గ్రామాల మధ్య అండర్ పాస్ (లోలెవల్ వంతెన) నిర్మించారు.. పనులు అస్తవ్యస్తంగా ఉండటంతో చిన్నపాటి వర్షం వచ్చినా నీరు నిల్వ ఉంటోంది..

మద్దికెర వద్ద రెండు అడుగుల ఎత్తులో నిర్మించడంతో నీరు వెళ్లడం లేదు.. మద్దికెర వద్ద రెండుచోట్ల, అగ్రహారం వద్ద 2, యడవలి, పెరవలి, హంప తదితర గ్రామాల వద్ద ఇదే పరిస్థితి నెలకొంది.

మద్దికెర-చిప్పగిరి ప్రధాన రహదారిలో నిర్మించిన వంతెనలో వర్షం కురిసిన సమయంలో 4 మీటర్ల మేర నీరు నిలుస్తోంది. దీంతో ఎడ్లబండ్లు, ట్రాక్టర్లు వెళ్లే అవకాశమే లేకుండా పోయింది.

**80 కి.మీ. రూ.100 కోట్లు**

ఒక్కోదానికి పొడవు, వెడల్పు ఆధారంగా రూ.కోటి నుంచి రూ.1.50 కోట్లు వెచ్చించారు. మొత్తం నిర్మాణాలకు రూ.100 కోట్ల వరకు ఖర్చు చేశారు. మద్దికెర- డోన్ మధ్య ఐవో డబ్ల్యూ, ఐవోడబ్ల్యూ పరిధిలో 25 శాశ్వత అండర్‌పాస్‌లున్నాయి. 80 కి.మీ. మేర రైల్వే ట్రాక్



వెంట నిర్మించిన భూగర్భ వంతెనల్లో నీరు నిలుస్తోంది.

అండర్ పాస్‌లు 6 మీటర్ల ఎత్తు, 5 మీటర్ల వెడల్పు చొప్పున నిర్మించారు. వర్షపు నీరు వెళ్లడానికి వీలుగా సమాంతరంగా కాల్వలు తవ్వాలి. వరద నీరు ప్రధాన కాల్వ వరకు వెళ్లేలా మార్గం సుగమం చేయాలి. చాలాచోట్ల కొంత వరకు తవ్వి వదిలేశారు.. 20-30 మీటర్ల వరకు సమాంతర కాల్వ తవ్వి అక్కడ చిన్నపాటి గుంత తీశారు. నీరు ముందుకెళ్లని పరిస్థితి నెలకొంది.

**వంతెన దాటాలంటే కష్టమే**

కిష్టన్న, రైతు, మద్దికెర

నాకున్న మూడెకరాల పొలంలో వాము పంట సాగు చేశా. 20 రోజులుగా పొలానికి వెళ్లే మార్గంలోని రైల్వే వంతెనలో నీరు నిలుస్తోంది. అండర్‌పాస్‌లో నీరు తగ్గిందని వెళ్తే ద్విచక్ర వాహనం నిలిచిపోయింది. సైలెన్సర్‌లోకి నీరు చేరడంతో బండి స్టార్ట్ కావడం లేదు. దీంతో వెనక్కు తోసుకుంటూ వచ్చా. వేలాది మంది రైతులు ఇలాంటి పరిస్థితులనే ఎదుర్కొంటున్నారు.

# వసతి పర్యవే‘క్షీణం’

కర్నూలు : డోన్ బాలుర కళాశాల వసతిగృహంలో ఈనెల 7న ఓ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. ఆ సమయంలో వసతిగృహ అధికారిణి అక్కడ లేరు. ఆమె గతేడాది వరకు ప్రీమెట్రిక్ వసతిగృహానికి ఇన్‌ఛార్జిగా పనిచేశారు. అక్కడ రెగ్యులర్ అధికారిని నియమించారు. ప్రస్తుతం చూస్తున్నది ఒక హాస్టల్ బాధ్యతలే అయినాసరే సరిగా పర్యవేక్షణ చేయడం లేదన్న విమర్శలున్నాయి.

బీసీ వసతిగృహాల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 52 వసతి గృహాల్లో 9,729 మంది విద్యార్థులు చదువుకొంటున్నారు. 38 చోట్ల సంక్షేమాధికారుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఒక్కో అధికారి రెండు వసతిగృహాల బాధ్యతలు చూడాల్సి వస్తోంది. దీన్ని అవకాశంగా తీసుకొని నిధులు బొక్కేస్తున్నారు.

**నిబంధనలు ఏం చబుతున్నాయి**

నిబంధనల ప్రకారం సమీపంలోని వసతిగృహ అధికారికి ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించాలి. లేదా సమీపంలోని ఎస్సీ వసతిగృహ అధికారికీ ఇవ్వొచ్చు. ఎవరూ అందుబాటులో లేకుంటే తప్పనిసరి పరిస్థితుల్లో దూర ప్రాంతంలోని వారికి ఇన్‌ఛార్జి బాధ్యతలు ఇవ్వాల్సి ఉంటుంది. సస్పెన్షన్‌కు గురై తిరిగి విధుల్లో చేరిన వారికి ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించకూడదు. వసతిగృహ అధికారులు రెగ్యులర్‌గా పనిచేస్తున్న చోట ఉదయం, ఇన్‌ఛార్జిగా వ్యవహరిస్తున్న హాస్టల్‌లో సాయంత్రం వేళ ఎఫ్‌ఆర్‌ఎస్ వేయాల్సి ఉంటుంది. ఇవేవీ పట్టించుకోవడం లేదు. 30 నుంచి 40 కి.మీ దూరంలోని వసతిగృహాలకు ఇన్‌ఛార్జి బాధ్యతలు ఇవ్వడంతో పర్యవేక్షణ భారంగా మారుతోంది. అంతదూరం వెళ్లలేక పనిచేసే సిబ్బందిపైనే నిర్వహణ భారం మోపి చేతులు దులిపేసుకుంటున్నారు. విద్యార్థులకు సరైన మెనూ అమలుకావడం లేదు.

**వసూళ్ల పర్వం**

ఆలూరు కళాశాల వసతిగృహంలో ఒక్కో విద్యార్థి నుంచి రూ.50 వసూలు చేశారంటూ తహసీల్దారుకు విద్యార్థులు ఫిర్యాదు చేశారు.

కర్నూలులోని బాలికల కళాశాల వసతిగృహ అధికారిణిగా పనిచేస్తున్న రాజేశ్వరి అక్రమాలకు పాల్పడటంతో సస్పెన్షన్‌కు గురయ్యారు. ఆరు నెలల తర్వాత నందికొట్కూరు బాలికల కళాశాల వసతిగృహ అధికారిణిగా పోస్టింగ్ ఇచ్చారు. కొంత కాలానికే ఆమెకు బ్రాహ్మణకొట్కూరు ప్రీమెట్రిక్ వసతిగృహ ఇన్‌ఛార్జిగా బాధ్యతలు కట్టబెట్టారు.

ఆదోని కళాశాల వసతిగృహ అధికారిగా పనిచేస్తున్న అజీంకు మంత్రాలయం ప్రీమెట్రిక్ వసతిగృహ ఇన్‌ఛార్జి బాధ్యతలు ఇచ్చారు. ఆదోని నుంచి మంత్రాలయానికి సుమారు 40 కిలోమీటర్ల దూరం ఉంటుంది. అంతదూరం వెళ్లి పర్యవేక్షించాలంటే కష్టమైనా అధికారులు దృష్టి సారించడం లేదు.

పత్తికొండ కళాశాల వసతిగృహ అధికారికి మద్దికెర ప్రీమెట్రిక్ వసతిగృహ అధికారిగా ఇన్‌ఛార్జి బాధ్యతలు ఇచ్చారు. ఈయన కర్నూలు కళాశాల వసతిగృహ అధికారిగా పనిచేసిన సమయంలో అక్రమాలకు పాల్పడి సస్పెండయ్యారు. ఇలాంటి వారికి ఇన్‌ఛార్జి బాధ్యతలు ఇవ్వకూడదన్న నిబంధనలు చెబుతున్నాయి.

# ఇక నూతన పంచాయతీలు



చిత్తూరు: పంచాయతీల పునర్ వ్యవస్థీకరణకు రాష్ట్ర ప్రభుత్వం పచ్చజెండా ఊపింది.. 30 ఏళ్లుగా ఉన్న పల్లె ప్రజల కల సాకారమయ్యే అవకాశం వచ్చింది.. దీంతో కొత్త పంచాయతీల ఏర్పాటుకు మార్గం సుగమమైంది.. వచ్చే ఏడాది ఏప్రిల్ రెండో తేదీ నాటికి పాలకవర్గాల గడువు తీరనున్న నేపథ్యంలో పాత వాటితో పాటు కొత్తవాటికి ఎన్నికలు నిర్వహించనున్నారు.

**ప్రతిపాదనలు ఇలా..**

పంచాయతీ ఏర్పాటు కావాలంటే గ్రామంలో జనాభా, వనరులు, ప్రస్తుత పంచాయతీకి ప్రతిపాదిత గ్రామానికి మధ్య దూరం, రెవెన్యూ సర్వే నంబర్ల విభజన తదితర అంశాలు పరిగణనలోకి తీసుకుంటారు. ప్రజల వినతుల స్వీకరణతో పాటు కొత్త వాటికి ప్రతిపాదనలు కోరుతూ జిల్లా పంచాయతీ కార్యాలయం నుంచి ఎంపీడీవోలకు ఆదేశాలు వెళ్లాయి. ఈ నెల 20వ తేదీ లోగా ప్రతిపాదనలు పంపాలని ఆదేశాలు జారీ చేశారని డీపీవో సుధాకర్‌రావు తెలిపారు.

జిల్లాలోని పంచాయతీలు: 696

స్పెషల్ గ్రేడ్: 4

గ్రేడ్-1: 61

గ్రేడ్-2: 214

గ్రేడ్-3: 417

ఇవీ మార్గదర్శకాలు..

ప్రస్తుత పాలకవర్గాలు తీర్మానం చేయాలి.

మండల పరిధిలోనే మార్పులు చేస్తారు.

మండలానికి చెందిన శివారు పంచాయతీని మరో మండలంలో కలపడం వేరు చేయడం కుదరదు.

పాలకవర్గాలు లేని పంచాయతీల్లో ప్రత్యేకాధికారి గ్రామసభ ద్వారా తీర్మానిస్తారు.

ఆయా తీర్మానాలను ఉన్నతాధికారులకు అందజేయాలి.

# వేళకు ఎగిరేనా..?




రేణిగుంట : తిరుమల శ్రీవారి దర్శనార్థం విమానాల్లో వచ్చే భక్తులకు ప్రస్తుతం ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇటీవల చోటుచేసుకున్న పరిణామాలతో నిర్ణీత సమయానికి దర్శన స్లాట్లు బుక్ చేసుకున్నవారు సకాలంలో చేరగలమా అనే సందేహం వ్యక్తం చేస్తున్నారు. తిరుమల శ్రీవారి దర్శనార్థం వచ్చేవారిలో ముందుగానే స్లాట్ బుక్ చేసుకునే వారితో పాటు సిఫార్సు లేఖలు, శ్రీవాణి టికెట్లు పొందిన వారూ ఉంటున్నారు. విమానాల రాకపోకల్లో జాప్యం వారిని ఒత్తిడికి గురిచేస్తోంది. ఇటీవలే డీజీసీఏ పైలెట్లు సహా ఇతర సిబ్బంది ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని విమానాల రాకపోకల సమయాల్లో మార్పులు చేసింది. ఇండిగో సంస్థపై ఈ ప్రభావం పడి సమస్య ఉత్పన్నమైందని నిపుణులు చెబుతున్నారు.

**ఇటీవలి ఘటనలు పరిశీలిస్తే..**

హైదరాబాద్ నుంచి రేణిగుంటకు రోజూ రాకపోకలు సాగించే ఇండిగో విమానం ఉదయం 179 మందితో హైదరాబాద్ వెళ్లే సమయంలో సాంకేతిక లోపంతో నిలిచిపోయింది. ఇంధన లీకేజీతో సర్వీసు రద్దు చేశారు. సాయంత్రం ముంబయి విమానంలో హైదరాబాద్ తరలించారు. ఇందుకోసం ముంబయి సర్వీసు రద్దు చేశారు.

విజయవాడకు వెళ్లే బెంగళూరు - రేణిగుంట ఇండిగో విమానం మంగళవారం సాయంత్రం ఆలస్యంగా నడిచింది.

బుధవారం నుంచి ఏర్పడిన ఇబ్బందులతో ఆ రోజు రాత్రి ఏడు గంటలకు ఇక్కడికి రావాల్సిన విమానం రాత్రి 10 గంటలకు చేరుకుంది.

ఇండిగో సంస్థకు చెందిన విమానాలన్నీ ఆలస్యంగా నడవడంతో యాత్రికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

# కాస్త దృష్టి పెడితే.. కా‘పాడి’నవారవుతారు



ఎస్ఎన్‌పాడు : జిల్లా పాడి రైతుల వెన్నుదన్ను జిల్లా పాల డెయిరీ. అలాంటి డెయిరీ విషయంలో గత వైకాపా ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడంతో మూత పడింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం గాడిలో పెడుతుందని అంతా ఆశతో ఎదురుచూశారు. క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే కేవలం సమావేశాలు, పరిశీలనలతోనే కాలం వెళ్లదీస్తోంది. వైకాపా ప్రభుత్వం డెయిరీ భారాన్ని మోయలేక 2021లో అమూల్ సంస్థ డెయిరీని పూర్తిగా మూసేసింది. అప్పటి నుంచి డెయిరీ తెరుచుకున్న దాఖలాల్లేవు. ప్రస్తుతం డెయిరీలోని సామగ్రి పూర్తిగా తుప్పుపట్టడంతో పాటు కొన్ని చోరీకి గురయ్యాయి.

జిల్లా పాల డెయిరీని గాడిలో పెట్టాలని జిల్లా ఉన్నతాధికారులు పాడి రైతులు, అధికారులతో పలుమార్లు సమావేశాలు నిర్వహించారు. ఆయా సమావేశాల్లో డెయిరీని తిరిగి గాడిలో పెట్టేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ఎన్‌డీడీబీకి కేటాయించాలనే ప్రతిపాదన సైతం తీసుకొచ్చారు. నాబార్డు నుంచి నిధులు కేటాయించాలనేది మరో ప్రతిపాదన. వీటికి సంబంధించి డెయిరీ అధికారుల వద్ద నివేదికలు సైతం ఉన్నతాధికారులకు అందజేశారు. దీనిపై జిల్లా మంత్రులు సైతం చర్చించారు. డెయిరీ సమస్య మాత్రం కొలిక్కి రాలేదు. కొద్దిరోజుల కిందట కొత్తగా బాధ్యతలు చేపట్టిన ఫెడరేషన్ ఎండీ సైతం డెయిరీ మొత్తం పరిశీలించారు. దీనిపై కార్యాచరణ ప్రణాళిక తయారు చేసి పంపాలని అధికారులకు ఆదేశించినా ఇంతవరకు ఎలాంటి చర్యల్లేవు.

**రూ.55 కోట్లు అవసరం**

డెయిరీ సందర్శనలో ఫెడరేషన్ ఎండీ తొలుత 50 వేల లీటర్లతో పాల సేకరణ చేపట్టి పాలు, పెరుగు తయారు చేసేందుకు కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. డెయిరీని తిరిగి గాడిలో పెట్టేందుకు అత్యవసరంగా రూ.10 కోట్ల వరకు అవసరం కాగా, రూ.45 కోట్ల మేర బకాయిలు చెల్లించాల్సి ఉంది. ఇప్పటికే దెబ్బతిన్న, తుప్పుపట్టిన సామగ్రిని తిరిగి అందుబాటులోకి తీసుకు వచ్చేందుకు సుమారు రూ.5 కోట్లు, ఇతర నిర్వహణ ఖర్చులకు రూ.5 కోట్ల వరకు కేటాయించాల్సి ఉంది. కూటమి ప్రభుత్వం నిధులు కేటాయించి పాల డెయిరీని తెరిపించాలని రైతులు కోరుతున్నారు.

# స్వచ్ఛ సేవలకు.. ఈ-ఆటోలు

కుప్పం : స్వచ్ఛ కుప్పం సాధన దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో ఇళ్ల నుంచి చెత్త, వ్యర్థాలను సేకరించనున్నారు. దీనిలో భాగంగా ఈ ఆటోలను పంపిణీ చేశారు.

**గత పాలనలో మూలకు..**

పారిశుద్ధ్యంతో పాటు పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఇళ్ల నుంచి నేరుగా చెత్త, వ్యర్థాలు సేకరించాలని గతంలోనే ప్రభుత్వం ఆలోచన చేసింది. గత తెదేపా కాలంలో ఎనిమిదేళ్ల క్రితం కుప్పం, శాంతిపురం, గుడుపల్లె, రామకుప్పం మండలాలకు బ్యాటరీ ఆటోలు సమకూర్చారు. సంపద కేంద్రాలు ఏర్పాటు చేశారు. వైకాపా వచ్చాక ఆటోలు మూలకు చేరాయి. కేంద్రాలు నిరుపయోగంగా మారాయి. కొన్ని పంచాయతీల్లో వాహనాలు విక్రయించేశారు. తర్వాత మూడు చక్రాల సైకిళ్లు అందజేసినా వినియోగించలేదు.

**‘కడా’ తరఫున అందజేత..**

సీఎం చంద్రబాబు ఆదేశాలతో కుప్పం ప్రాంత అభివృద్ధి సంస్థ (కడా) ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీలకు ఈ-ఆటోలు 112 సమకూర్చారు. పాత వాహనాలతో పాటు వీటిని వినియోగించనున్నారు. రోజూ సేకరించే చెత్తను కేంద్రానికి తరలించి సేంద్రియ ఎరువు తయారు చేయనున్నారు. గ్రామాలకు రోజూ ఉదయం వాహనాలు వెళ్లి చెత్త



సేకరిస్తాయని అధికారులు తెలిపారు. ప్రజలు సహకరించాలని కోరారు.

**ఇవీ వివరాలు..**

కుప్పం నియోజకవర్గం: మండలాలు: 4

పంచాయతీలు: 97అందజేసిన

ఈ ఆటోలు: 112 (శాంతిపురం- 23, కుప్పం గ్రామీణ- 29, పురపాలిక- 19, రామకుప్పం- 23, గుడుపల్లె- 18 )

# కమీషన్ల ‘కాటా’.. మామూళ్ల వేట

కర్నూలు : కర్నూలు వ్యవసాయ మార్కెట్‌లో రైతులు నిలువు దోపిడీకి గురవుతున్నారు. సరకు తీసుకొచ్చినప్పటి నుంచి ఇంటికెళ్లే వరకు అడుగడుగునా మోసపోతున్నారు. వీటికి అడ్డుకట్ట వేసి రైతులకు అండగా ఉండాల్సిన అధికారులు దోపిడీలో పాలుపంచుకుంటున్నారు.

**పీడిస్తున్న హమాలీలు**

ఒక సంచిని వాహనం నుంచి కిందకు దింపినందుకు రైతులు హమాలీ ఛార్జీ రూ.5.04 చెల్లించాలి. లైసెన్స్‌డ్ హమాలీలు వాహనం నుంచి సరకు కిందకు దింపాలి. కానీ మార్కెట్‌లో లైసెన్స్‌డ్ హమాలీలకు బినామీలుగా చలామణి అవుతున కార్మికులు సరకును కిందకు దింపుతున్నారు. ఛార్జీలకు అదనంగా డ్రైవర్ మామూళ్లు, హమాలీలు రూ.300 నుంచి రూ.500 వరకు, అదే లారీలో సరకు తీసుకొస్తే రూ.వెయ్యి వరకు వసూలు చేస్తున్నారు.

**రూ.2 కోట్లకుపైగా వసూలు**

విపణికి నిత్యం చిన్న, పెద్ద వాహనాలు 500 వరకు వస్తుంటాయి. ప్రస్తుతం ఉల్లి వాహనాలే 300 వరకు ఉన్నాయి. మామూళ్ల పేరుతో



రైతుల నుంచి వసూలు చేసే అదనపు మొత్తమే రూ.1.50 లక్షల వరకు ఉంటుంది. సీజన్‌లో 6 నెలల వ్యవధిలోనే రూ.2 కోట్ల నుంచి రూ.3 కోట్ల వరకు రైతుల నుంచి పిండుకుంటున్నారు.

**పచ్చి సరకు పేరుతో..**

క్వింటాకు రూ.2 చొప్పున రైతులు కమీషన్ ఛార్జీలు చెల్లించాల్సి ఉంది. ఉల్లి పంటకు మాత్రం క్వింటా రూ.4 చొప్పున కమీషన్ ఛార్జీలు చెల్లించాల్సి వస్తోంది.

ఉల్లి పచ్చి సరకని గతంలో మార్కెట్ కమిటీ ఈ మేరకు ఛార్జీలను నిర్ణయించింది. ఈ కారణంగా అన్నదాతలు తీవ్రంగా నష్టపోతున్నారు.

**తూకాల్లోనూ మోసాలు**

మార్కెట్ యార్డులో తూకాల్లో మోసాలకు అడ్డూఅదుపు లేకుండాపోయింది. ఎలక్ట్రానిక్ వేయింగ్ యంత్రాలకు ఈ-పోస్ యంత్రాలతో అనుసంధానం చేయడం లేదు. ఫలితంగా మోసాలు జరుగుతున్నాయి. కొందరు కమీషన్ ఏజెంట్లు ఎలక్ట్రానిక్ వేయింగ్ యంత్రాల్లో ముందస్తుగానే క్వింటాకు 2 నుంచి 4 కిలోల వరకు మైనస్‌లో పెట్టేస్తున్నారు.

బయట తూకం వేసే క్రమంలో అంతా సరిగానే ఉన్నట్లు కనిపిస్తుండటంతో రైతులు మోసాలను పసిగట్టలేకపోతున్నారు.

ఎలక్ట్రానిక్ వేయింగ్ యంత్రాలకు ఈ-పోస్ పరికరాలను అనుసంధానం చేస్తే ఈ-నామ్‌లో కచ్చితమైన తూకం ఉంటుంది. మార్కెట్‌లో మాత్రం ఇది అమలు కావడం లేదు.

**ఈ-పోస్.. ఉష్**

కర్నూలు వ్యవసాయ మార్కెట్‌కు ఏటా రూ.6 కోట్ల నుంచి రూ.7 కోట్లకుపైగా ఆదాయం సమకూరుతుంది. ఇంత ఆదాయం ఉన్నా ఈ-పోస్ యంత్రాలను సమకూర్చుకోవడంపై అధికారులు దృష్టిపెట్టడం లేదు. రూ.2- 3 లక్షలు వెచ్చిస్తే పాడైన ఈ-పోస్ యంత్రాలకు మరమ్మతులు చేయించొచ్చు. లేదా కొత్తవి కొనుగోలు చేయొచ్చు.

ఈ-నామ్ అమలైనప్పటి నుంచి ఇక్కడ ఈ-పోస్ యంత్రాలతో తూకాలు వేసిన దాఖలాలు లేవు. ఇవి అందుబాటులో ఉంటే మార్కెట్ కమిటీ అధికారులు, కమీషన్ ఏజెంట్లు, వ్యాపారులు, కాటాదారుల దోపిడీకి అవకాశం ఉండదు. ఇవి లేకుంటేనే రోజువారీగా ముడుపులు ముడుతుంటాయి. అందుకే ఈ-పోస్ యంత్రాలతో తూకాలు వేసే పద్ధతిని పక్కన పెట్టేశారు.

# గనుల దారుల్లో ఘోరీలు

డోన్ : ఖనిజ గ్రామాల్లో ‘దారి’ణంగా మారాయి. వాహనాలు అధిక బరువుతో ఖనిజాలు తీసుకెళ్తుండటంతో రోడ్లు దెబ్బతింటున్నాయి. మోకాలి లోతు గుంతలు, రహదారులపై కడ్డీలు తేలి పరిస్థితి ఇబ్బందికరంగా ఉంది. డోన్, బనగానపల్లి నియోజకవర్గాల పరిధిలో గనులెక్కువ. జిల్లా పరిధిలో వెయ్యి వరకు క్వారీలు ఉన్నాయి. ప్రత్యేకించి నాపరాళ్లు, ఇనుప ఖనిజం, సిలికా, క్వార్ట్జ్, డోలమైట్ గనులు ఉన్నాయి. ఇక్కడ ముడి ఖనిజాన్ని తీసి పరిశ్రమలకు తరలిస్తారు. పౌడర్, సిమెంటు పరిశ్రమలకు కావాల్సిన ముడిసరకును వివిధ రాష్ట్రాల నుంచి ఇక్కడికి తీసుకొస్తారు. ఇక్కడ తయారైన సిమెంటు, పౌడర్‌తోపాటు నాపరాయి, పాలిష్ బండలను దేశంలోని వివిధ ప్రాంతాలకు ఎగుమతి చేస్తుంటారు. ప్యాపిలి నుంచి బనగానపల్లి మార్గంలో ఓ సిమెంటు పరిశ్రమకు సంబంధించి నిత్యం వంద వరకు లారీలు రాకపోకలు సాగిస్తుంటాయి. 52 కి.మీ. మేర దూరం ఉన్న ఈ రహదారి ప్యాపిలి నుంచి గార్లదిన్నె వరకు చాలాచోట్ల దెబ్బతింది. ఈ రోడ్డుపై 35 నుంచి 40 టన్నుల బరువుతోనే వాహనాలు వెళ్లాలి.. కానీ 55 నుంచి 65 టన్నుల వరకు తీసుకెళ్తున్నారు. దీంతో రహదారి మొత్తం అధ్వానంగా మారింది.

**నిధులు మళ్లించిన వైకాపా**

గనుల తవ్వకాలతో ప్రత్యక్షంగా, పరోక్షంగా ప్రభావితమయ్యే 10-25 కిలోమీటర్ల పరిధిలోని గ్రామాల్లో అభివృద్ధి పనులకు డీఎంఎఫ్ నిధులు వినియోగించుకోవాలని జీవో నంబరు 36 చెబుతోంది. మంచినీరు, విద్య, వైద్య సేవలు, రోడ్లు తదితర పనులకు వినియోగించుకోవాలి. గత వైకాపా ప్రభుత్వంలో డీఎంఎఫ్ నిధుల వినియోగానికి అవరోధాలు ఎదురయ్యాయి. డబ్బుల వినియోగంపై ఆంక్షలు పెట్టడంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. నిధులు మంజూరైనా అప్పటి ప్రజాప్రతినిధులు ఇతర ప్రాంతాలకు మళ్లించారు. ‘కూటమి’ ప్రభుత్వం చక్కదిద్దాలని వాహనదారులు విన్నవిస్తున్నారు.

**ఎక్కడెక్కడ ఎలా ఉందంటే**కోవెలకుంట్ల-మయలూరు మార్గంలో చెన్నైకు సిమెంట్ లారీలు వెళ్తుంటారు. అధిక సామర్థ్యంతో ముడిసరకును తీసుకెళ్తుండటంతో రహదారి బాగా దెబ్బతింది. ప్యాపిలి-బనగానపల్లి మార్గంలో గార్లదిన్నె వద్ద అధ్వానంగా మారింది. వెంగళాంపల్లె గ్రామ సమీపంలో గుంతలు పడి కంకర తేలింది. వెంకటాపల్లె, ఎన్.రంగాపురం వద్ద రహదారిపై కడ్డీలు తేలాయి. పసుపల గ్రామ సమీపంలోనూ రహదారి పలుచోట్ల గుంతలు పడింది. యాగంటిపల్లె, పాతపాడు సమీపంలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. బేతంచెర్ల నుంచి సిమెంటునగర్ మీదుగా తమ్మరాజుపల్లెకు వెళ్లే రహదారిలో 6.5 కి.మీల దారి పలుచోట్ల దెబ్బతింది. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొంది.

# అండగా ఉంటాం.. అడ్డంగా కట్టేయ్!

చిత్తూరు : భవన నిర్మాణాల క్రమబద్ధీకరణకు నిర్దేశించిన బిల్డింగ్ పీనలైజేషన్ స్కీం (బీపీఎస్)కు మార్గదర్శకాలు వెలువడక మునుపే ప్రజాప్రతినిధుల అనుచరుల పైరవీలు, అధికారుల సహకారంతో పట్టణాల్లో అదనపు అంతస్తులు నిర్మిస్తున్నారు. బీపీఎస్ అమలుకు రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ త్వరలో మార్గదర్శకాలను విడుదల చేయనుంది. 2025 ఆగస్టు 31కి మునుపు అనుమతులు తీసుకోకుండా చేపట్టిన నిర్మాణాలకు ఈ పథకం వర్తిస్తుంది. సెప్టెంబరు 19న బీపీఎస్‌కు మంత్రివర్గ ఆమోదం లభించాక పట్టణాల్లో అదనపు అంతస్తుల నిర్మాణం ఇబ్బడిముబ్బడిగా పెరిగింది. జిల్లాలోని పట్టణ ప్రాంతాల్లో 300పైగా భవనాలు అనుమతులకు విరుద్ధంగా, అసలు అనుమతులే లేకుండా నిర్మించినట్లు సమాచారం. పట్టణాల శివారు ప్రాంతాల్లో ఈ పరిస్థితి ఎక్కువగా ఉంటోంది.

**ఫోన్ చేయిస్తూ.. నిర్మిస్తూ..**

చిత్తూరు నగరపాలక సంస్థ కావడంతో.. ఇక్కడ భవన నిర్మాణ అనుమతులకు ప్రభుత్వం నిర్ణయించిన రుసుములు రూ.లక్షల్లో ఉండటంతో



యజమానులు రాజకీయ నేతలతో అధికారులకు ఫోన్లు చేయిస్తున్నారు. ప్రభుత్వానికి ఫీజులు ఎగ్గొట్టి యథేచ్ఛగా అదనపు అంతస్తుల్ని నిర్మిస్తున్నారు.

**నగరంలో ఎక్కడెక్కడంటే..**

నగరంలో ప్రభుత్వ ఐటీఐ ఎదురుగా, రెడ్డిపేటలో, లక్ష్మీనగర్‌కాలనీలో నిర్మిస్తున్న కొన్ని భవనాల్లో అదనపు అంతస్తులకు ఎలాంటి అనుమతి తీసుకోలేదు. మురకంబట్టులో రెండు భవనాలు, మిట్టూరులో రెండు షాపింగ్ కాంప్లెక్స్‌లకు అనుమతుల్లేవని సమాచారం. ఉడిపి హోటల్ సమీపంలోని ఓ భవనంలో ఓ అంతస్తును అక్రమంగా నిర్మిస్తున్నారు. కాసులు అందితే చాలు.. ఎలాంటి నిర్మాణాలైనా చేసుకోండంటూ నగరపాలక పట్టణ ప్రణాళిక విభాగంలో ఇద్దరు ఇన్‌ఛార్జి భవన ఇన్‌స్పెక్టర్లు భవన యజమానులకు సూచిస్తున్నట్లు సమాచారం.

పట్టణ ప్రణాళిక విభాగం ఉన్నతాధికారులు హైరోడ్డు, గాంధీరోడ్డు విస్తరణ పనుల్లో తలమునకలై ఉండగా.. కిందిస్థాయి సిబ్బంది అందినకాడికి దోచుకుంటున్నారు. కార్యదర్శులకు ఆదేశాలిచ్చాం: శుభప్రద, పట్టణ ప్రణాళిక విభాగం ఏసీపీ-2, చిత్తూరు

బీపీఎస్ పథకానికి విరుద్ధంగా నిర్మించే అదనపు అంతస్తుల్ని నియంత్రించడానికి చర్యలు చేపడతాం. ఇదే అంశంపై వార్డు సచివాలయ ప్రణాళిక కార్యదర్శులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశాం.

# దారులు పూడ్చేసి.. నిధులు ఊడ్చేసి

నంద్యాల : హంద్రీ నీవా సుజల స్రవంతి (హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్) కాలువ నుంచి ఎక్కువ నీటిని తరలించడంలో భాగంగా చేపట్టిన పూడికతీత పనులు రైతుల పాలిట శాపంగా మారింది. హెచ్‌ఎన్‌ఎస్ఎస్ ద్వారా నీటిని తరలించేందుకుగాను తొమ్మిది ప్రాంతాల్లో ఎత్తిపోతల పథకాలు ఏర్పాటుచేశారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో సుమారు 80 వేల ఎకరాలకు సాగు నీరు అందిస్తున్నారు. ప్రధాన కాలువ ద్వారా ఉమ్మడి కర్నూలు, అనంతపురం జిల్లాలతోపాటు వైఎస్సార్ కడప జిల్లా, చిత్తూరు జిల్లాకు సైతం నీటిని తరలించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. 3,850 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోయాలని ప్రతిపాదించి కాలువ విస్తరణకు చర్యలు చేపట్టింది. ఈ ఏడాది మొదట్లో గుత్తేదారుడికి పనులు అప్పగించారు. 1వ కి.మీ. నుంచి 9వ కి.మీ. వరకు పూడిక తొలగించారు. ఇక్కడే అసలు సమస్య ప్రారంభమైంది.

**తవ్వి.. ఇష్టానుసారంగా పడేసి..**

నందికొట్కూరు మండలం బ్రాహ్మణకొట్కూరు-వడ్డెమాను మధ్య హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ కాల్వలో పూడికతీత పనులు ఈ ఏడాది మొదట్లో ప్రారంభించారు. 9 కి.మీ. పొడవునా తీసిన పూడిక మట్టిని కొంత కాల్వ గట్టుపైనే వేశారు. నిబంధనల ప్రకారం ఈ మట్టిని జలవనరుల శాఖకు చెందిన రిజర్వు స్థలంలో వేయాలి. అది దూరంగా ఉండటంతో



కాలువలో నుంచి తీసిన పూడికను ఎక్కడికక్కడ వేసుకుంటూ వెళ్లిపోయారు. రైతులు పొలాలకు వెళ్లే మార్గంలోనూ వేశారు. వాహనాలు, ఇంధనం ఖర్చు కలిసివస్తుందన్న ఉద్దేశంతో గుత్తేదారుడు ఇష్టానుసారంగా పడేశారు. పొలాలకు వెళ్లే మార్గంలో అడ్డుగా వేయడంతో వడ్డెమాను గ్రామానికి చెందిన 100 ఎకరాలకు దారి కరవైంది. ప్రస్తుతం దిగుబడులు తీసుకెళ్లే మార్గం లేక రైతులు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. చాలా ప్రాంతాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది.

**అదనపు వ్యయం**

పొలాలకు వెళ్లే దారులకు అడ్డుగా పూడిక మట్టి వేయడంతో దీనిని తొలగించేందుకు రైతులు అదనంగా ఖర్చు చేయాల్సి వస్తోంది. దీనిపై జలవనరుల శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా చర్యలు శూన్యమే. కాలువ వెంబడి పలు ప్రాంతాల్లో ఇష్టానుసారంగా పూడిక మట్టి వేయడంతో నిత్యం సమస్యలు ఎదురవుతున్నాయి.

# గుంతల దారి.. పడతారు జారి

నందికొట్కూరు : రహదారుల నిర్మాణాన్ని గత వైకాపా ప్రభుత్వం పట్టించుకోలేదు. కనీసం మరమ్మతులు చేయించలేదు. ఫలితంగా ఎక్కడ చూసినా రోడ్లు అధ్వానంగా మారాయి. ఇటీవల కురిసిన వర్షాలకు మరింతగా దెబ్బతిన్నాయి. రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. పలు ప్రాంతాల్లో ఆర్‌అండ్‌బీ, పీఆర్ గ్రామీణ రహదారులు రూపు కోల్పోయాయి.మరమ్మతులు చేయక..నందికొట్కూరు-పగిడ్యాల బీటీ రహదారి గుంతలమయంగా మారింది. ఈ రోడ్డుపై ఒక్క వాహనం వెళ్లాలంటేనే ఇరుకుగా ఉంటుంది. ఎదురుగా వాహనాలు వస్తే ఇబ్బందులే. నందికొట్కూరు-బ్రాహ్మణకొట్కూరు కేజీ (కర్నూలు-గుంటూరు) మార్గం మీదుగా ఓర్వకల్లు పారిశ్రామికవాడకు పైపులైను ఏర్పాటుచేస్తున్నారు. పనులు పూర్తి చేసినా రోడ్డుకు మరమ్మతులు చేయకుండా అలానే వదిలేశారు.రూ.2 కోట్లు కేటాయించినా..నందికొట్కూరు నియోజకవర్గ పరిధిలోని ఆరు మండలాల్లోని గ్రామీణ రహదారులు అధ్వానంగా మారాయి. మిడుతూరు నుంచి గార్గేయపురం వెళ్లే రహదారి 15 కి.మీ. ఉంది. ప్రారంభం నుంచి చివరి వరకు అడుగడుగునా గోతులే. ఈ రహదారి మరమ్మతులకు రూ.2 కోట్లు మంజూరయ్యాయి.

# తెగుళ్లు, ధరలు.. దానిమ్మతో దిగాలు



తాడిమర్రి : సరిగ్గా నెల రోజుల క్రితం విపణిలో దానిమ్మ మంచి ధరలు పలికాయి. టన్ను రూ.1,35,000 నుంచి 1,50,00 వరకు అమ్ముడయ్యాయి. దీంతో సాగు చేసిన రైతులు ఎంతో సంతోష పడ్డారు. రెండు నెలలపాటు ధరలు స్థిరంగా ఉంటాయని అందరూ ఆశపడ్డారు. వారి ఆశలపై నీళ్లు చల్లినట్లయింది. వాతావరణంలో మార్పుల కారణంగా ధరలు అమాంతం పడిపోయాయి. ఎంతలా అంటే టన్ను ఏకంగా రూ.70 వేలకు పడిపోయింది. అది కూడా కాయకు ఎటువంటి మచ్చలు లేకపోతే, పెద్ద పరిమాణంలో ఉంటేనే వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా 18 వేల ఎకరాల్లో దానిమ్మ పంట సాగులో ఉంది.

**చీలికలు.. మచ్చలు**

సాధారణంగా దానిమ్మ పంటకు నీటి శాతం తక్కువగా ఉండాలి. ముఖ్యంగా కోతకు వచ్చే సమయంలో నీటిని ఎక్కువగా వినియోగించరు. వాతావరణం పొడిగా, సూర్యరశ్మి ఉంటే...కాయల పరిమాణం బాగా వృద్ధి చెందుతుంది. వారం రోజులుగా ముసురు, చిరుజల్లుల కారణంగా కాయలకు తెగులు వ్యాపిస్తోంది. బ్లైట్ అనే తెగులుతో కాయకు మచ్చపడి సగానికి చీలుతోంది. ఆంత్రాక్నోస్ సోకితే మచ్చలు ఎక్కువగా పడుతున్నాయి. దీన్ని సకాలంలో గమనించకపోతే తోటంతా వ్యాపించి రైతులకు కోలుకోని దెబ్బస్తుంది.

మార్కెట్‌లో దొరికే పురుగు మందులను పిచికారీ చేసి రూ.లక్షలు ఖర్చు చేస్తున్నారు. తెగులు సోకిన కాయలను రైతులు తొలగించేస్తున్నారు. ఈ నేపథ్యంలో కాయలు నాణ్యంగా లేవని కొనుగోలు చేసేందుకు వ్యాపారులు ముందుకు రావడం లేదు. గతంలో ఒప్పందం చేసుకున్న వారు అప్పటి ధర చెల్లించలేమంటున్నారని రైతులు వాపోతున్నారు. దిగుబడి ఉంటే, ధరలు ఉండవు... మంచి ధరలున్నప్పుడు దిగుబడి ఉండటం లేదని రైతులు కన్నీటి పర్యంతమవుతున్నారు.

**ధరలు పెరిగే అవకాశాలు ఉన్నాయి**

చెన్నై, బెంగళూరుతోపాటు ఇతర ప్రాంతాల్లో వర్షాలు కురుస్తున్నందున దానిమ్మ ధరలు తగ్గాయని వ్యాపార వర్గాలు చెబుతున్నాయి. కొద్ది రోజుల్లోనే ధరలు పెరుగుతాయని అంటున్నారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. బ్లైట్, ఆంత్రాక్నోస్ తెగుళ్ల నివారణకు కార్బన్డజిమ్ ఒక గ్రాము, ఎం45 అనే మందు 2.5 గ్రాములను లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

చంద్రశేఖర్, శ్రీసత్యసాయి జిల్లా ఉద్యాన శాఖాధికారి

# అనుమతి గోరంత.. దోపిడీ కొండంత!



పుట్టపర్తి: ప్రగతి పేరుతో ప్రకృతి వనరులను ఇష్టారాజ్యంగా ధ్వంసం చేస్తున్నారు. అడ్డుకోవాల్సిన అధికారులు తమకు పట్టనట్లు వ్యవహరిస్తూ పరోక్షంగా తోడ్పాటునందిస్తున్నారు. దీంతో ప్రభుత్వ ఆదాయానికి గండిపడుతోంది. వందల ఏళ్లనాటి కొండలు, గుట్టలు కరిగిపోతున్నాయి. జాతీయ రహదారుల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం భారీగా నిధులు ఇస్తుంది. గుత్తేదారులు నాణ్యమైన రహదారులు నిర్మించాల్సి ఉంటుంది. నిధులు మిగిలించుకునేందుకు కొందరు అక్రమ దారులు ఎంచుకుంటున్నారు.

జిల్లాలో గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. నల్లమాడ వద్ద జరుగుతున్న పనులకు అవసరమైన నాణ్యమైన ఎర్రమట్టి కోసం గుత్తేదారు సంస్థ రెవెన్యూ, గనులశాఖలకు దరఖాస్తు చేసుకుంది. నల్లమాడలో సర్వే నంబరు 1368లో 2.45 ఎకరాల్లో 25వేల మెట్రిక్ టన్నుల వరకు తవ్వుకోవడానికి తాత్కాలిక అనుమతి ఇచ్చినట్లు అధికారులు చెబుతున్నారు. ఇందుకోసం సదరు సంస్థ రాయల్టీ ఛార్జీల కింద రూ.3.25 లక్షలు చెల్లించింది. మట్టిని బెంగళూరు- విజయవాడ ఎకనమిక్ కారిడార్‌లోని వానవోలు నుంచి వక్రకుంట వరకు జరుగుతున్న పనులకు వాడాలని తాత్కాలిక అనుమతి పత్రంలో పేర్కొన్నారు. మట్టిని ప్రస్తుతం నల్లమాడ వద్ద జరుగుతున్న పనులకు వాడుతున్నారు.

**ఒకటే.. తోలుడు**

వాస్తవానికి అనుమతి తీసుకున్న ప్రాంతం చుట్టూ హద్దురాళ్లు పాతాలి. అందులోనే తవ్వకాలు జరపాలి. ప్రస్తుతం ఆ ప్రాంతానికి వెళ్లి చూస్తే కళ్లు బైర్లుకమ్మాల్సిందే. కనీసం 50 ఎకరాలకు పైగానే కొల్లగొట్టేశారు. 3 మీటర్ల లోతుతో ముళ్లకంపలు, ఎర్రమట్టితో కప్పబడిన చిన్న దిబ్బని మాత్రమే తాత్కాలిక అనుమతి పత్రంలో పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో పెద్దకొండ దర్శనమిస్తుంది. పుట్టపర్తి నుంచి నల్లమాడకు వెళ్లే రహదారి పక్కనే ఇంత జరుగుతున్నా.. ఎవ్వరూ పట్టించుకోవడం లేదు.

**అధికారుల తాత్సారం**

మట్టి తవ్వకానికి అనుమతి ఇచ్చిన ప్రాంతం పక్కనే పుట్టపర్తి వ్యవసాయ మార్కెట్‌యార్డు స్థలం ఉంది. స్థలాన్ని పరిశీలించిన అనంతరం పక్కనే యథేచ్ఛగా జరుగుతున్న దోపిడీ విషయాన్ని వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ పూల శివప్రసాద్ గనులు, రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. వారు స్పందించలేదు. మరుసటి రోజు రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. మూడ్రోజులైనా చర్యలు లేవు. మరోవైపు తవ్వకాలు జోరుగా సాగుతూనే ఉన్నాయి.

**తనిఖీలు చేస్తాం**నల్లమాడ వద్ద గుట్టను పరిమితికి మించి తవ్వుతున్నట్లు ఫిర్యాదులు అందాయి. సంయుక్తంగా తనిఖీలు చేయాలని నిర్ణయించాం. ఎంత మొత్తంలో తవ్వేశారో గుర్తించి అందుకనుగుణంగా తగిన చర్యలు తీసుకుంటాం. ఓబుళరెడ్డి, గనులశాఖ ఏడీ, మనోజ్‌కుమార్, ఇన్‌ఛార్జి తహసీల్దార్

# నెట్టికంటయ్యా.. మురుగు తొలగేదెన్నడయ్యా!



గుంతకల్లు : రాయలసీమలోనే నెట్టికంటి ఆంజనేయస్వామి ఆలయానికి ప్రత్యేకత ఉంది. వ్యాసరాయలు ప్రతిష్ఠించిన క్షేత్రాల్లో అత్యంత ప్రధానమైనది కావడం విశేషం. ఇంతటి ప్రాధాన్యమున్న ఆలయాన్ని దాతల సహకారంతో ప్రగతి పనులు చేపడుతున్నారు. అన్నీ బాగానే ఉన్నా.. కసాపురం గ్రామానికి చెందిన ప్రధాన మురుగు కాలువ కోవెల అభివృద్ధికి అవరోధంగా మారింది. నిత్యం వివిధ ప్రాంతాల నుంచి క్షేత్ర సందర్శనకు వచ్చే వందలాది మంది భక్తులు మురుగు గుండా వెళ్లాల్సి వస్తోంది.

కసాపురం గ్రామంలో దాదాపు 1500 ఇళ్లు, 3 వేల జనాభా ఉన్నారు. గృహాల నుంచి వచ్చే మురుగు బయటకు వెళ్లడానికి ప్రత్యేకంగా డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేయకపోవడంతో ఆలయ సమీప పరిసరాల్లో మురుగు పారుతోంది. గతంలో చిన్నపాటి కాలువను ఆలయం వెనుకభాగంలో గోడకు ఆనుకుని ఏర్పాటు చేశారు. దీంతో భక్తులు మురుగుతో ఇబ్బంది పడుతున్నారు.

**రూ.2 కోట్లు దారి మళ్లాయి!**

కసాపురం గ్రామంలో మురుగు సమస్య పరిష్కారానికి నాలుగేళ్ల కిందట ప్రభుత్వం కాలువ నిర్మాణానికి రూ.2 కోట్లు కేటాయించింది. ఆయా పనులకు అప్పటి ఎమ్మెల్యే వెంకటరామిరెడ్డి భూమి పూజ చేశారు. తరువాత ప్రభుత్వం నిధులను దారి మళ్లించడంతో పనులు ప్రారంభం కాలేదు. ఫలితంగా మురుగుతో గ్రామప్రజలే కాకుండా వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు నానా అగచాట్లు పడుతున్నారు.

**సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం**

ఆలయ పరిసరాల్లోకి మురుగు రాకుండా దారి మళ్లించడానికి తగిన చర్యలు తీసుకుంటాం. ఈమేరకు ప్రణాళిక రూపొందిస్తాం. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగు చర్యలు తీసుకుంటాం.

వెంకటేశ్వరుడు, సహాయ కార్యనిర్వహణాధికారి

# పరిహారం ఇవ్వక.. లీజు సొమ్ము అందక

పుట్టపర్తి: తమ ప్రాంతంలో పెద్ద జలాశయం వస్తుందని సంబరపడిపోయారు. తాము కొంత త్యాగంచేస్తే ఇతర రైతులకూ మేలు జరుగుతుందని తలంచారు. తమకున్నది కొంతే అయినా ప్రజాప్రయోజనం ఆశించి భూమిని ఇచ్చేశారు. లీజుపేరుతో తీసుకొన్న పొలంలో అధికారులు కట్ట నిర్మించేశారు. అయినా నేటికీ ప్రాజెక్టు పూర్తవలేదు. దీంతో జిల్లేడుబండ జలాశయ నిర్వాసితులు అయోమయ పరిస్థితిలో ఉన్నారు. జిల్లేడుబండ జలాశయ నిర్మాణ పనులు రూ.680 కోట్లతో 2021, డిసెంబరులో ప్రారంభమయ్యాయి. తెలంగాణకు చెందిన గుత్తేదారు సంస్థ పనులను దక్కించుకుంది. ముదిగుబ్బ మండలంలోని గుడ్డంపల్లితండా, బుక్కపట్నం మండలంలోని గోపాలపురం గ్రామాలకు చెందిన 30ఎకరాల భూములు కట్ట నిర్మించే ప్రాంతంలో ఉన్నాయి. అందులో వేరుసెనగ, చీనీ, మామిడి ఇతరత్రా పంటలు సాగులో ఉన్నాయి. భూములు లీజుకిస్తే ఎకరాకు ఏడాదికి రూ.30వేల చొప్పున చెల్లిస్తామని, ముంపు భూములన్నింటికీ పరిహారం వచ్చినప్పుడు మీకు కూడా ఇస్తామని గుత్తేదారు చెప్పారు. ఈమేరకు రైతులతో అగ్రిమెంటు తీసుకుని భూములను తీసుకున్నారు. పంటపొలాలన్నీ తొలగించి ఆ ప్రాంతమంతా మట్టితో కప్పి 7.92 కిలోమీటర్ల మేర కట్ట నిర్మించారు.



**కొందరికే...**

అగ్రిమెంటు ప్రకారం మూడేళ్లు రైతుల ఖాతాల్లో లీజు నగదు జమ చేశారు. తర్వాత కొందరికి జమ కాలేదు. జలాశయ ముందు భాగంలో కట్ట నిర్మాణానికి ఖర్చయిన సుమారు రూ.వందకోట్ల వరకు బిల్లులను గుత్తేదారు పూర్తి చేసుకున్నారు. పరిహారంపై వైకాపా ప్రభుత్వం నుంచి స్పష్టత ఇవ్వకపోవడంతో పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. తర్వాత ప్రభుత్వం మారడంతో గుత్తేదారు వెనక్కివెళ్లిపోయారు. ఇప్పుడు రైతులకు లీజు డబ్బులు, పరిహారం చెల్లించలేదు. తిరిగి సాగు చేసుకుందామంటే భూములన్నీ కట్టనిర్మాణంలో కలిసిపోయాయి.

ఇటీవల రైతులు.. మంత్రులు సత్యకుమార్ యాదవ్, నిమ్మల రామానాయుడు దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. త్వరలోనే క్షేత్రస్థాయిలో పర్యటించి వివరాలు సేకరించేలా అధికారులను పంపుతామని, ముంపు బాధితులకు న్యాయం చేస్తామని మంత్రులు హామీ ఇచ్చారు.

**అందరికీ న్యాయం జరిగేలా చూస్తాం** భూములు కోల్పోయినవారికి లీజు ప్రకారం గుత్తేదారు ఏటా నగదు చెల్లిస్తున్నారు. జలాశయం ముంపు భూములకు పరిహారం కోసం ఇప్పటికే ఉన్నతాధికారులకు నివేదించాము. త్వరలోనే పరిహారం అందేలా తగిన చర్యలు తీసుకుంటాం ఖైలేష్, ఏఈ, నీటిపారుదల శాఖ

# మీ డబ్బు.. మీ హక్కు

విశాఖపట్నం: జిల్లాలో వినియోగించని బ్యాంకు ఖాతాల్లో రూ.195 కోట్ల డబ్బు పోగుబడి ఉందంటే నమ్ముతారా? అవును ఇది వాస్తవం. ఆయా బ్యాంకుల అధికారులు దీన్ని ధ్రువీకరించారు. పదేళ్లు, అంతకు మించి లావాదేవీలు జరగని ఖాతాల్లో ఉన్న నగదును బ్యాంకులు తిరిగిచ్చేస్తున్నాయి. ఈ మేరకు ఆర్‌బీఐ ఆదేశాలిచ్చింది. ఇలా ఏళ్ల తరబడి నిర్వహించని ఖాతాలను డీఈఏఎఫ్ (డిపాజిటర్ ఎడ్యుకేషన్ అండ్ అవేర్‌నెస్ ఫండ్) అని పిలుస్తారు. ఏయే బ్యాంకుల్లో ఎన్ని ఖాతాలు అలాంటివి ఉన్నాయి, వాటిల్లో ఎంత నగదు ఉందో వివరాలు తెప్పించుకుంది. ఇందులో భాగంగా డిసెంబరు నెలాఖరు వరకు జిల్లాలో అన్ని చోట్ల ప్రత్యేక శిబిరాలు నిర్వహించి ఆ నగదును వెనక్కి ఇస్తారు.

**ఎవరిని సంప్రదించాలంటే..**ఖాతా ఉన్న బ్యాంకు మరోదాంట్లో విలీనమై ఉంటే ఆ బ్యాంకును సంప్రదించొచ్చు.ఆధార్, పాస్‌పోర్టు, ఓటరు ఐడీ, డ్రైవింగ్ లైసెన్స్ పత్రాల్లో ఏదో ఒకదాన్ని సమర్పించాలి.పరిశీలన అనంతరం బ్యాంకు ప్రతినిధి ధ్రువీకరించిన తర్వాత ఆ మొత్తం అక్కడే పొందొచ్చు.ఖాతాదారు మృతి చెందితే సంబంధిత కుటుంబ సభ్యులు మరణ ధ్రువీకరణ పత్రం అందజేయాలి

**ఇలా తెలుసుకోవచ్చు..:**

జిల్లాలో డీఈఏఎఫ్ ఖాతాలు 6.22 లక్షలు ఉండగా, వాటిల్లో రూ.195 కోట్ల నగదు నిల్వలు ఉన్నాయని ఎల్‌డీఎం శ్రీనివాస్ తెలిపారు.. నిర్వహణలో లేని ఖాతాలను ఆ బ్యాంకు వెబ్‌సైట్ లింకులోనూ తెలుసుకోవచ్చు. అదేవిధంగా ఆర్‌బీఐ యూడీజీఏఎం పోర్టల్ %https://udgam.rbi.org.in% లోనూ చూడొచ్చు.ఆ డబ్బు తీసుకోండి..: వినియోగించని బ్యాంకు ఖాతాల్లో ఉన్న డబ్బును సంబంధిత వినియోగదారులు సులభంగా పొందొచ్చు. రిజర్వ్‌బ్యాంకు కల్పించిన ఈ అవకాశాన్ని అర్హులు ఉపయోగించుకోవాలి. జిల్లాలోని అన్ని బ్యాంకుల్లో ఆరు లక్షలకుపైగా ఖాతాల్లో డబ్బులు ఉండిపోయాయి. దీనికి సంబంధించి ఇటీవల సిరిపురం ఎస్బీఐ బ్యాంకులో ఖాతాదారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించాం.శ్రీనివాస్, ఎల్‌డీఎం, విశాఖ

# బొమ్మల పరిశ్రమపై కదలిక

నక్కపల్లి: పారిశ్రామికంగా జిల్లాను పరుగులు పెట్టిస్తున్న కూటమి ప్రభుత్వం మరో పరిశ్రమ ఏర్పాటుకు రంగం సిద్ధం చేస్తోంది. మంత్రి వంగలపూడి అనిత చొరవతో నక్కపల్లి మండలంలో బొమ్మల తయారీ కంపెనీ స్థాపనకు అడుగులు పడుతున్నాయి.

పరిశ్రమల నిమిత్తం గతంలో సేకరించిన భూముల్లో బల్క్‌డ్రగ్ పార్కు, ఆర్సెలార్ మిత్తల్ ఉక్కు పరిశ్రమ ఏర్పాటవుతున్నాయి. వీటికి అనుమతులు వచ్చాయి. బల్క్‌డ్రగ్‌కు ప్రధాని మోదీ ఈ ఏడాది జనవరిలో శంకుస్థాపన చేశారు. స్టీల్ ప్లాంట్‌కు తొలి విడతలో 2020 ఎకరాలు కేటాయించారు. రెండో విడతలో మరో మూడు వేల ఎకరాలు ఇవ్వనున్నారు. పరిశ్రమ ఏర్పాటులో భాగంగా క్యాప్టివ్ పోర్టు, టౌన్‌షిప్ నిర్మించనున్నారు.

'పాల్స్ ప్లష్' బొమ్మల పరిశ్రమ ఏర్పాటుకు కసరత్తు జరుగుతోంది. దీనిపై కొద్ది నెలల కిందట సీఎం ఆదేశాలతో మంత్రి అనిత సంబంధిత కంపెనీ ప్రతినిధులు, ఉన్నతాధికారులతో మాట్లాడి సమన్వయం చేశారు. ఈ పరిశ్రమ ఏర్పాటుకు సుమారు వెయ్యి ఎకరాల భూమి అవసరమవుతుందని ప్రతిపాదించారు. ఉపమాక, ఎన్.నర్సాపురం, నల్లమట్టిపాలెం, బుచ్చిరాజుపేట తదిరత ప్రాంతాల్లో కేటాయించాలని నిర్ణయించడంతోపాటు ప్రాథమికంగా భూమిని గుర్తించారు. దీనిపై కలెక్టర్ తదితరులతో మంత్రి చర్చించారు.

బొమ్మల పరిశ్రమ ఏర్పాటైతే మహిళలకు వేలాదిగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయి. సుమారు 25 వేల మందికి అవకాశం ఉంటుందని మంత్రి అనిత పలు సందర్భాల్లో ప్రకటించారు. విశాఖలో జరిగిన పెట్టుబడుల సదస్సులో బొమ్మల తయారీ పరిశ్రమ అధ్యక్షుడు అజయ్ సిన్హా ముఖ్యమంత్రితో భేటీ కావడం ప్రాధాన్యతను సంతరించుకుంది.

# నిఘాకు మసక.. వ్యాపారి మస్కా

కర్నూలు : పంట చేతికొచ్చింది.. అమ్మకానికి సిద్ధంగా ఉన్న దిగుబడులను ఇటీవల వచ్చిన మొంథా తుపాన్ నిండా ముంచేసింది.. తడిసిన గింజలను వ్యాపారులు తక్కువ ధరకు కొనుగోలు చేసి ఇతర రాష్ట్రాలకు తరలించి సొమ్ము చేసుకొంటున్నారు. తనిఖీ కేంద్రాల వద్ద సిబ్బంది జేబులు నింపి సరిహద్దులు దాటిస్తున్నారు. సీసీ కెమెరాలు లేకపోవడంతో సిబ్బంది వసూళ్ల దుకాణం పెట్టారు.

**కనిపించని సీసీ కెమెరాలు**

నంద్యాల జిల్లాలో 24, కర్నూలులో 12 వ్యవసాయ తనిఖీ కేంద్రాలు ఉన్నాయి. కొన్ని చోట్ల డబ్బా రేకుల్లో కేంద్రాలుండగా.. మరికొన్ని చోట్ల అవికూడా కూడా లేవు. ఆయా కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి. ప్రతి 12 గంటలకు ఇద్దరు చొప్పున పనిచేయాల్సి ఉంది. ఉద్యోగులు లేక కొన్ని ఉదయం.. మరికొన్ని రాత్రిళ్లు మూతపడుతున్నాయి. మార్కెటింగ్ శాఖ సూపర్‌వైజర్ స్థాయి అధికారులు విధులు నిర్వహించాలి. అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో సెక్యూరిటీ గార్డులు పనిచేస్తున్నారు.

**రైతు పేరుతో దాటిస్తున్నారు**

రైతులే స్వయంగా ఇతర ప్రాంతాల్లో ధాన్యాన్ని విక్రయించడానికి తరలిస్తే మార్కెట్ కమిటీలకు ఎలాంటి ఫీజు చెల్లించనక్కర్లేదు. వ్యాపారులైతే రెండు శాతం ఫీజు చెల్లించాల్సి ఉంది. కొందరు వ్యాపారులు రైతుల పేరుతో సరిహద్దు దాటిస్తున్నారు.




సెక్యూరిటీ గార్డులు, మార్కెట్ కమిటీ సిబ్బంది కలిసి వసూళ్లకు పాల్పడుతున్నారు. బిల్లు పుస్తకాలు వారి దగ్గరే ఉన్నా.. ఐదు లారీలు రవాణా చేస్తే.. ఒక లారీకి మార్కెట్ సెస్ వసూలు చేయడం.. డబ్బులు తీసుకొని మిగిలిన లారీలను పంపిస్తున్నట్లు ఫిర్యాదులొచ్చాయి. ఒక్కో కేంద్రం వద్ద నిత్యం రూ.3 వేల వరకు వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది.

తగ్గిన ఆదాయం క్వింటా ధాన్యం రూ.2 వేల ధర ఉంటే ఒక లారీ 30 టన్నుల సామర్థ్యంతో రవాణా చేస్తారు. నిబంధనల ప్రకారం మార్కెట్ కమిటీకి 2 శాతం అంటే రూ.12 వేలు ఫీజు చెల్లించాలి. పర్యవేక్షణ లేకపోవడంతో మార్కెటింగ్ శాఖకు భారీగా గండి పడుతోంది. కర్నూలు జిల్లాలో ఏడు మార్కెట్ కమిటీలుండగా.. ఒక్క పత్తికొండ మినహా మిగతా మార్కెట్లలో ఆదాయం తగ్గిపోయింది. నంద్యాల జిల్లాలో 8 వ్యవసాయ మార్కెట్లు ఉండగా 23 చెక్‌పోస్టులున్నాయి. రూ.12.57 కోట్లు వసూలైంది.

ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయలేదు.. రైతులకు వ్యాపారులే దిక్కయ్యారు. దీన్ని ఆసరాగా తీసుకొని ధర అమాంతం తగ్గించారు. రైతుల వద్ద తక్కువ ధరకు కొనుగోలు చేసిన వ్యాపారులు సరిహద్దు జిల్లాలకు తరలిస్తున్నారు.

సాగు (హెక్టార్లలో)
4,22,540 సాధారణం
3,83,072 సాగైంది
ఆదాయం (రూ.కోట్లలో)
ఈ ఏడాది లక్ష్యం: 40.40ఇప్ప
టికీ వసూలైంది: 13.07

# నిధులు దండి.. వివరాలు తొండి

కర్నూలు : కర్నూలు సర్వజన వైద్యశాలలో ఎన్టీఆర్ వైద్యసేవ 'లెక్క' తప్పింది.. ప్రతి నెలా సుమారు 3,200 మంది సేవలు పొందుతున్నారు.. రాష్ట్రంలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో మొదటిస్థానంలో ఉన్నట్లు వైద్యాధికారులు గొప్పలు చెప్పుకొంటున్నారు. ఈ లెక్కలన్నీ డొల్లే అన్నట్లు తేలిపోయింది. ఆన్‌లైన్‌లోని లెక్కలకు.. ఆస్పత్రిలో రోగుల సంఖ్యకు సరిపోలని విషయం బయటపడింది.

**నమోదు 800.. ఉన్నది 300**ఎన్టీఆర్ వైద్య సేవల కింద చికిత్స పొందుతున్న వివరాలు పరిశీలించాలని ఆదేశాలు రావడంతో ఎన్టీఆర్ వైద్యసేవల జిల్లా సమన్వయకర్త భాస్కర్‌రెడ్డి తదితరులు బుధవారం తనిఖీలు చేశారు. ఆస్పత్రిలో ఎన్టీఆర్ వైద్యసేవల కింద 860 అడ్మిషన్లు ఉన్నట్లు ఆన్‌లైన్‌లో చూపుతోంది. వివిధ విభాగాల్లో ఉన్న పడకలపై 300 మందికి మించి రోగులు లేరు.

**నాడితప్పిన పర్యవేక్షణ** జనరల్ మెడిసిన్, పీడియాట్రిక్, గైనిక్‌కు సంబంధించి కేసుల తీవ్రతను బట్టి ఎన్టీఆర్ వైద్యసేవల కింద రోగులను అడ్మిట్ చేసుకోవాలి. అలాకాక ప్రతి ఒక కేసును ఎన్టీఆర్ వైద్యసేవల కింద చేర్చారు. ఒకటి, రెండు రోజుల్లో నయమైపోవడంతో పలువురు



చెప్పకుండా వెళ్లిపోయారు. ఇలాంటి వారు వందల సంఖ్యలో ఉన్నారు. వారందరూ ఉన్నట్లు ఆన్‌లైన్‌లో చూపుతోంది.

శస్త్రచికిత్సలు వాయిదా వేయడం.. నిరంతరం తిప్పుకొంటుండటంతో పలువురు వైద్యులకు చెప్పకుండా వెళ్లిపోయిన కేసులు వందల సంఖ్యలో ఉన్నాయి. చనిపోయినవారు 120 మంది వరకు ఉన్నారు. ఈ కేసులను మూసేయాల్సి ఉండగా అలానే ఉంచేశారు.

**నమోదు నలత**

ఎన్టీఆర్ వైద్యసేవల కింద విధులు నిర్వహించే డేటా ఎంట్రీ ఆపరేటర్‌ను ఆసుపత్రిలో ఆయా విభాగాల హెచ్‌వోడీలు సమన్వయం చేసుకోవాలి. వైద్యాలయంలో ఆ పరిస్థితి కానరావడం లేదు.

ఆస్పత్రిలో ఎంతమంది చేరుతున్నారు.. ఎంతమంది డిశ్చార్జి అవుతున్నారన్న వివరాలు పర్యవేక్షకుడికి తెలియడం లేదు.

ఎన్టీఆర్ వైద్య సేవలు కింద చికిత్స తీసుకుని డిశ్చార్జి అయి వెళ్లినవారికి ఛార్జీలు, మందులతోపాటు వైద్య పరీక్షలు బయట చేసి ఉంటే వాటికి సంబంధించిన బిల్లులు ఇవ్వాల్సి ఉంది. గత ఆరు నెలలుగా చాలామందికి ఇవ్వలేదు. ఖాతాల్లో వేస్తామని రోగులకు చెప్పి పంపేస్తున్నారు.

# రాయితీ, ప్రోత్సాహకం ఏదీ?



హిందూపురం : హిందూపురం మార్కెట్‌లో పట్టుగూళ్ల క్రయవిక్రయాలు జరగలేదు. ప్రభుత్వం బైవోల్టిన్ రైతులకు ప్రోత్సాహక మొత్తం, మల్బరీ సాగుకు ఎరువులు, మందులపై రాయితీ ఇవ్వకపోవటంతో పంట సాగుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వైకాపా ప్రభుత్వ పాలనలోనే వాటిని నిలిపేయడంతో రూ.20 కోట్ల వరకు బకాయి ఉంది. చెల్లించాలని రైతులు ఆందోళనలు చేపట్టినా ఫలితం లేకపోయింది. దీంతో కూటమి ప్రభుత్వంపై ఆశలు పెట్టుకున్నారు. పంటసాగు, పట్టుగూళ్ల పెంపకానికి పెరిగిన పెట్టుబడి వ్యయంతో రైతులు అవస్థలు పడుతున్నారు. 1985లో పట్టుగూళ్ల మార్కెట్ ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటి వరకు క్రయవిక్రయాలు బంద్ అయిన సందర్భాలు లేవని స్థానికంగా చెబుతున్నారు. ఇక్కడి మార్కెట్‌లో లావాదేవీల ద్వారా ప్రభుత్వానికి ఏటా రూ.కోటికిపైగా ఆదాయం వస్తోంది.

**ఉపాధిపై ప్రభావం**

మార్కెట్‌లో జరిగే పట్టుగూళ్ల లావాదేవీ ద్వారా రీలర్లు, కూలీల దాదాపు 8వేల మంది రీలింగ్ యూనిట్లపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. పట్టుగూళ్లు రాకపోతే రీలింగ్ యూనిట్లు కొనసాగక ఉపాధికి విఘాతం కలుగుతుంది. యూనిట్లు కొనసాగాలంటే ఇతర ప్రాంతాలకు తరలిపోతున్న గూళ్లు ఇక్కడికి తీసుకురావాలని రీలర్లు కోరుతున్నారు.

**కర్ణాటకకు తరలిస్తూ..**

కర్ణాటక రాష్ట్రంలోని రాంనగర్, శిద్దలఘట్ట మార్కెట్‌లలో కిలోకు రూ.50 నుంచి 100 వరకు అదనంగా ధర లభిస్తుండటంతో ఈ ప్రాంతంలోని రైతులు బైవోల్టిన్, సీబీ పట్టుగూళ్లు తీసుకెళుతున్నారు. గతంలో బైవోల్టిన్ రైతులకు రాష్ట్ర ప్రభుత్వం కిలోకు రూ.50 ప్రోత్సాహకం అందిస్తుండటంతో అధికశాతం మంది పురం తీసుకొచ్చి విక్రయించేవారు. ప్రస్తుతం కర్ణాటక మార్కెట్ మేలు అనే అభిప్రాయాన్ని రైతులు వ్యక్తం చేస్తున్నారు.

**ప్రజాప్రతినిధులు చొరవ తీసుకోవాలి**

జిల్లా ప్రజాప్రతినిధులు చొరవ తీసుకొని బైవోల్టిన్ రైతులకు రాయితీ, ప్రోత్సాహకం అందేలా చూడాలి. లేదంటే రైతులు కర్ణాటకకే పట్టుగూళు తరలించుకొని వెళ్లే అవకాశం ఉంది. నాలుగు దశాబ్దాల మార్కెట్ చరిత్రలో పట్టుగూళ్లు రాని రోజంటూ లేదు. దీనిని గుణపాఠంగా భావించాలి.

సిద్ధారెడ్డి, కార్యదర్శి, ఉమ్మడి జిల్లా పట్టు రైతుల సంఘం

**దిగుబడి తక్కువగా ఉంటోంది**

చలికాలంలో పట్టుగూళ్ల దిగుబడి తక్కువగా ఉంటోంది. ప్రస్తుతం చలి తీవ్రత పెరిగినందున పట్టుగూళ్లు అంతంతమాత్రంగా వస్తున్నాయి. నుంచి గూళ్లు మార్కెట్‌కు వచ్చే అవకాశాలు ఉన్నాయి.హంపయ్య, హిందూపురం మార్కెట్ ఇన్‌స్పెక్టర్

# ద్రవిడ వర్సిటీలో పరిశోధనం



కుప్పం : వి.కోట ప్రాంతానికి చెందిన ఓ పరిశోధక విద్యార్థిని 'చిత్తూరు జిల్లా స్త్రీవాద రచయిత్రుల కథలు, స్త్రీ జీవిత చిత్రణ' అంశంపై పరిశోధన చేశారు. దీనిపై సిద్ధాంత గ్రంథాన్ని ద్రవిడ వర్సిటీలో ఓ ఆచార్యుడికి సమర్పించగా.. తిరుపతిలోని ఓ వ్యక్తికి సిఫార్సు చేశారు. సదరు వ్యక్తి రూ.80 వేలు ఇస్తే.. ఈ పరిశోధన అంశాన్ని పూర్తిచేస్తామని చెప్పగా... రూ.10 వేలు అడ్వాన్స్‌గా ఇచ్చింది. రెండేళ్ల తర్వాత గ్రంథాన్ని తిరిగిచ్చినట్లు విద్యార్థిని ఆవేదన చెందుతోంది.

**ద్రావిడ భాషలు..** సంస్కృతి.. సంప్రదాయాలు పరిరక్షించాలనే లక్ష్యంతో త్రిరాష్ట్ర కూడలి అయిన కుప్పంలో ద్రవిడ విశ్వవిద్యాలయం ఏర్పాటైంది. పరిశోధనల దిశగా అడుగులు వేస్తూ యూజీ, పీజీ కోర్సులకు కూడా శ్రీకారం చుట్టింది. కాలక్రమేణా నాటి పాలకులు.. అధ్యాపకులు.. ఆచార్యుల ఇష్టారాజ్యంగా వ్యవహరించడంతో పరిశోధనలకు ప్రాధాన్యం ఇవ్వడం లేదు. పర్యవేక్షణ కొరవడటంతో విద్యార్థులు నాణ్యమైన పరిశోధనలు చేపట్టలేకపోతున్నారు.

ద్రవిడ వర్సిటీలో పీహెచ్‌డీ ప్రవేశాల కోసం సెప్టెంబరు 11న వర్సిటీ రిజిస్ట్రార్ నోటిఫికేషన్ విడుదల చేశారు. మొత్తం 14 విభాగాల్లో 62 సీట్ల భర్తీకి నోటిఫికేషన్ ఇవ్వగా.. ఇప్పటివరకు నెట్, జేఆర్ఎఫ్‌లో ఉత్తీర్ణత సాధించిన 26 మందికి ప్రవేశాలు కల్పించారు. ఇక్కడ నెలకొన్న లోపాలతో పూర్తిస్థాయిలో సీట్లు భర్తీ అవుతాయన్న నమ్మకం కొరవడింది.

ద్రవిడ విశ్వవిద్యాలయంలోని ఓ విభాగంలో పేరు చెప్పేందుకు ఇష్టపడని ఓ పరిశోధక విద్యార్థి తమిళనాడు రాష్ట్రం క్రిష్ణగిరి జిల్లాలో 'హొసూరు తెలుగు కథల'పై క్షేత్రస్థాయిలో తిరిగారు. అంతరించిపోతున్న కళలు.. కథలు.. సంస్కృతి.. సంప్రదాయాలపై పరిశోధన చేసి 2023లో పరిశోధన సిద్ధాంత గ్రంథాన్ని వర్సిటీకి సమర్పించారు. ఇంతవరకు పట్టా అందకపోవడంతో అతను వర్సిటీ చుట్టూ ప్రదక్షిణ చేయాల్సిన పరిస్థితి కొనసాగుతోంది.

కుప్పానికి చెందిన ఓ పరిశోధకురాలు తమిళనాడు రాష్ట్రం కంచి, మదురై ప్రాంతాల్లో పర్యటించి 'తొండనాడు కథలు'పై పరిశోధన చేసి సిద్ధాంత గ్రంథాన్ని వర్సిటీలో సమర్పించుకునేందుకు యత్నించారు. అక్కడ సరైన స్పందన లభించలేదని ఆమె ఆవేదన చెందడం గమనార్హం.

**సమర్పించినా.. కాలయాపన**

కొందరు విద్యార్థులు పరిశోధన గ్రంథాలను సమర్పించినా.. ఏదో ఒక కారణాలు చూపుతూ పట్టాలు ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. దీనివల్ల విద్యార్థుల సంఖ్య కనీస స్థాయికి పడిపోయి ఉద్యోగులకు సైతం జీతాలు ఇవ్వలేని పరిస్థితుల్లో ద్రవిడ విశ్వవిద్యాలయం కొట్టుమిట్టాడుతోంది.

**కిం కర్తవ్యం**

కొందరు పరిశోధక విద్యార్థులను పలుకరిస్తేనే ఇన్ని విషయాలు వెలుగులోకి వచ్చాయంటే.. ఇక పీహెచ్‌డీ పట్టాల జారీలో జాప్యం.. ప్రవేశాల రద్దు తదితర విషయాలపై లోతుగా ఆరా తీస్తే ఏ స్థాయిలో పరిశోధకులు ఇబ్బందులు పడుతున్నారో వెల్లడవుతుంది.

**30 శాతం సీట్లు భర్తీ చేశాం..**

యూజీసీ నిబంధనల ప్రకారం 30 శాతం నెట్, జేఆర్ఎఫ్‌లో ఉత్తీర్ణత సాధించిన 26 మందికి వర్సిటీలో నేరుగా ప్రవేశాలు కల్పించాం. మిగిలిన సీట్ల వివరాలను ఏపీఆర్‌సెట్‌కు సమర్పించాం. అర్హులందరికీ పీహెచ్‌డీ పట్టాలు ఇస్తున్నాం. ఏదైనా సమస్యలుంటే మా దృష్టికి తీసుకురావాలి. – ఆచార్య కిరణ్‌కుమార్, రిజిస్ట్రార్

# ఆపరేషన్ స్వర్ణతో ఆటకట్టు




తిరుపతి : విశాలమైన లేఅవుట్‌లు, ఎనిమిది ఎకరాల్లో ఫాంహౌస్‌లు, అపార్టుమెంట్లు, అక్రమ కట్టడాలు, వందల ఎకరాల్లో మామిడి తోటలు.. ఇలా ఎన్నో అక్రమాలకు నెలవుగా మారింది స్వర్ణముఖి పరీవాహక ప్రాంతం. 'ఆపరేషన్ స్వర్ణ'లో భాగంగా తిరుపతి గ్రామీణ మండలంలో చేపట్టిన సర్వేలో గుర్తించిన ఆక్రమణల విలువ రూ.వెయ్యి కోట్ల పైమాటే. కొందరు రియల్టర్లు లేఅవుట్లు వేసి విక్రయించగా.. కొందరు ఐదారు అంతస్తుల భవనాలు నిర్మించుకున్నారు. వందల ఎకరాల్లో మామిడి తోటలు ఏపుగా పెరిగాయి. కుంట్రపాకం వద్ద విలాసవంతమైన ఫామ్ హౌస్ స్వర్ణముఖిలో వెలిసింది.

**తిరుపతి గ్రామీణ మండలంలోనే ఎక్కువ**

జిల్లాలోని 9 మండలాల మీదుగా ప్రవహించే స్వర్ణముఖి ఎక్కువగా ఆక్రమణకు గురైంది మాత్రం తిరుపతి గ్రామీణ మండలంలోనే. స్వర్ణముఖి, దాని బఫర్ జోన్‌లో సుమారు 2 వేల కట్టడాలు ఉన్నట్లు తెలుస్తోంది. చిగురువాడ, వేదాంతపురం, దుర్గసముద్రం, తిరుచానూరు, అవిలాల ప్రాంతాల్లో కుంట్రపాకం ప్రాంతాల్లో ఎక్కువగా ఆక్రమణలు ఉన్నాయి. పరీవాహక ప్రాంతాల్లో 10 నుంచి 50 ఎకరాల వరకు ఆక్రమించుకుని పొలాలుగా మార్చారు. తిరుపతి గ్రామీణ మండలం తరువాత చంద్రగిరి, ఏర్పేడు, శ్రీకాళహస్తి, తొట్టంబేడు మండలాల్లో ఎక్కువగా ఆక్రమణలు ఉన్నాయని రెవెన్యూ అధికారులు అంటున్నారు.

**లక్షల మందిని ప్రమాదంలో పెట్టలేం: సి.దివాకర్‌రెడ్డి, ఛైర్మన్, తుడా**

ఆపరేషన్ స్వర్ణ ముఖ్యమంత్రి అనుమతితో ప్రారంభమైంది. వేలాది ఆక్రమణలతో లక్షలాది మందిని ప్రమాదంలో పెట్టలేం. ఇలాగే వదిలేస్తే భావితరాలకు స్వర్ణముఖి పవిత్రను, ప్రయోజనాల్ని ఇవ్వలేం. రాష్ట్ర ప్రభుత్వ చొరవతో ఆక్రమణల్ని గుర్తించగలిగాం. వంద మీటర్ల బఫర్ జోన్‌ను 50 మీటర్లకు కుదించారు. ఆ నిబంధనల ప్రకారం సరిహద్దు రాళ్లు పాతుతాం. స్వర్ణముఖి కబ్జాకు గురికాకుండా చర్యలు తీసుకుంటాం.

**నది పొడవునా ఇలా..**

ముక్కోటి నుంచి కుంట్రపాకం వరకు సర్వే చేశారు.

స్వర్ణముఖి నది, దానికి ఇరువైపులా 50 మీటర్ల బఫర్ జోన్ హద్దుల్ని నిర్ణయించారు.

వీటి మధ్యలో ఉన్న కట్టడాలు, పొలాలు, లేఅవుట్‌లను గుర్తించి వాటి వివరాలు సేకరిస్తున్నారు.

తొలి విడతలో చంద్రగిరి నుంచి శ్రీకాళహస్తి వరకు సర్వే పూర్తి చేసి.. జనవరి నుంచి క్షేత్రస్థాయిలో సరిహద్దురాళ్లు పాతనున్నారు.

నిరుపేదలుంటే వారికి ప్రత్యామ్నాయంగా స్థలాలు కేటాయిస్తారు.

అక్రమార్కుల చెరలోని నిర్మాణాలు కూల్చివేస్తారు. స్థలాలను స్వాధీనం చేసుకుంటారు.

అవసరమైన ప్రాంతాల్లో పూడిక తొలగిస్తారు.

స్వర్ణముఖి విస్తరించిన 155 కి.మీల మేర సర్వే పూర్తయ్యాక.. ఆక్రమణకు గురవుతున్న ప్రాంతాలకు ఇరువైపులా 4 మీటర్ల వెడల్పు గల తాత్కాలిక రోడ్లను నిర్మిస్తారు.

# మాన్యమున్నా.. నైవేద్యమేదీ

ప్యాపిలి : ప్యాపిలి పట్టణం నడిమిగేరిలోని లక్ష్మీచెన్నకేశవ స్వామి ఆలయం శిథిలావస్థకు చేరింది. ఒకప్పుడు ధూపదీప నైవేద్యాలతో కళకళలాడగా నేడు పట్టించుకునేవారే కరవయ్యారు. ఆలయానికి 201 ఎకరాల మాన్యం ఉన్నప్పటికీ అభివృద్ధి చేయడం లేదు. దేవాదాయ శాఖ అధికారులు సైతం పట్టించుకోకపోవడం గమనార్హం.

**కూలిపోయేలా ఉన్నా..**

లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయాన్ని శతాబ్దాల కిందట నిర్మించారు. ప్రస్తుతం ఆలనాపాలనా కరవైంది. గుడి స్తంభాలు, పైకప్పు దూలాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఎప్పుడు కూలిపోతుందో తెలియని పరిస్థితి నెలకొంది. దీంతో భక్తులు తమ ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని స్వామి, అమ్మవార్లను దర్శించుకుంటున్నారు. దేవాదాయ శాఖ అధికారులు పలుమార్లు ఆలయాన్ని పరిశీలించినా ప్రయోజనం శూన్యమే. **దేవాదాయ శాఖ పట్టించుకోక..**

దేవాలయానికి 201 ఎకరాల మాన్యం ఉంది. నలుగురు పూజారులు



30 ఎకరాలు సాగు చేసుకుంటున్నారు. ఇనాం భూముల కింద స్వామి సేవకులకు సంబంధించి 143 ఎకరాలు వారి ఆధీనంలో ఉంది. ఇందులో కొందరు మాత్రమే సాగు చేసుకుంటున్నారు. మిగిలిన 28 ఎకరాలకు మాత్రమే ఏటా కౌలుకు వేలం నిర్వహిస్తుంటారు. దీనిద్వారా రూ.35 వేలు మాత్రమే వస్తోంది. ఈ నిధులతోనే ఉత్సవాల సమయంలో ధూపదీప నైవేద్యాలకు వినియోగిస్తున్నారు. ఎమ్మెల్యే కోట్ల జయసూర్యప్రకాష్‌రెడ్డి ఇటీవల ఆలయాన్ని పరిశీలించారు.. అభివృద్ధికి తమవంతు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలో దేవాదాయ శాఖ అధికారులు స్పందించి ఆలయ అభివృద్ధికి చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

# అతివకు చిరుసాయం

రాజాం : ఉమ్మడి జిల్లాలో చిరుధాన్యాల సాగు ఎక్కువ. ఉత్పత్తుల తయారీ, మార్కెటింగ్ తదితర అంశాల్లో మన రైతులు ముందున్నారు. మహిళలు సైతం ప్రధాన పాత్ర పోషిస్తున్నారు. ఈక్రమంలో స్థానికంగా మిల్లెట్ క్లస్టర్ ఏర్పాటు చేయాలనే డిమాండు ఎప్పటినుంచో వినిపిస్తోంది. ఈమేరకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి కేంద్రానికి అనేక ప్రతిపాదనలు వెళ్లాయి. తాజాగా సూత్రప్రాయ అంగీకారం తెలిపింది. తమ ఆమోదంతో సంబంధం లేకుండా పనులు ప్రారంభించాలని ఇప్పటికే రాష్ట్రానికి సమాచారం ఇచ్చినట్లు తెలుస్తోంది. దీంతో విజయనగరంలోని వైద్య కళాశాల సమీపంలో 13.48 ఎకరాలు గుర్తించినట్లు డీఆర్డీఏ అధికారులు తెలిపారు.

**ప్రస్తుతం ఉన్నవి..**రాగి బిస్కెట్లు, రాగి లడ్డూలు, కొర్రలతో జంతికలు, మురుగులు తదితరాలు తయారు చేస్తున్నారు. మన్యంలో ఊదలతో ఇడ్లీలు, మిల్లెట్ పెరుగన్నం, మిల్లెట్ పెసరట్టు, కిచిడీ, మల్టీగ్రైన్ చపాతీలు, నువ్వుండలు, జొన్న గారెలు దుకాణాల్లో కనిపిస్తున్నాయి. ఇప్పటికే రస్తాకుంటుబాయిలోని కేవీకేలో మహిళలకు శిక్షణ ఇచ్చారు. అక్కడే యంత్రాలను బిగించి తయారీపై అవగాహన కల్పిస్తున్నారు.

**1000 మందికి లబ్ధి..**

దేశవ్యాప్తంగా చిరుధాన్యాల ఉత్పత్తులకు ప్రాధాన్యం పెరిగింది. ఆరోగ్యం దృష్ట్యా చిన్నారుల నుంచి వృద్ధుల వరకు ఆసక్తి చూపుతున్నారు. దీంతో డ్వాక్రా సంఘాల మహిళలకు లబ్ధి కలగనుంది. క్లస్టర్ పరిధిలో ఏర్పాటయ్యే యూనిట్లతో వివిధ రకాల వంటల తయారీకి అవకాశం ఏర్పడుతుంది. ఈ విధంగా దాదాపు 1000 మంది లబ్ధి పొందుతారని భావిస్తున్నారు.

**సర్వే జరుగుతోంది..**

'సాగు విస్తీర్ణం, ఉత్పత్తి అంశాలపై సర్వే చేపడుతున్నాం. యూనిట్ల ఏర్పాటుకు ఎంత మంది ఆసక్తి చూపుతారు? ఏఏ ఉత్పత్తులకు అవకాశం ఉంది.. విలువ జోడింపు తదితర అంశాలపై కసరత్తు చేస్తున్నాం. పూర్తిస్థాయి అనుమతులు వస్తే ముందుకెళతాం' అని డీఆర్డీఏ పీడీ శ్రీనివాస్ తెలిపారు. తృణధాన్యాల వినియోగంతో ఆరోగ్యంగా ఉండొచ్చని, వ్యాపారాలు బాగుంటాయని కేవీకే గృహవిజ్ఞాన విభాగం శాస్త్రవేత్త ఉమాజ్యోతి తెలిపారు.

విజయనగరం జిల్లాలో..సంఘాల ఆధ్వర్యంలో సాగు..
రాగులు ఎకరాల్లో 846 రైతులు 886
గంటిలు ఎకరాల్లో 330 రైతులు 535
కొర్రలు ఎకరాల్లో 27.5 రైతులు 59
జొన్నలు ఎకరాల్లో 15 రైతులు 25
మన్యంలో 5,400 ఎకరాల్లో చిరుధాన్యాలు సాగవుతున్నాయి

# సొంత నిధులు పెంచుకునేలా!!

విజయనగరం : జిల్లా కేంద్ర సహకార బ్యాంకు(డీసీసీబీ)కు సొంత నిధులు లేవు. ఆప్కాబ్, నాబార్డు ఇచ్చే సొమ్ముపైనే ఆధారపడుతోంది. అందులోనుంచే రుణాలిస్తోంది. తగినంత డిపాజిట్లు లేకపోవడమే ఈ పరిస్థితికి ప్రధాన కారణం. ఉమ్మడి జిల్లాలో 24 సహకార బ్యాంకులున్నాయి. వీటి ద్వారా డిపాజిట్ల సేకరణపై దృష్టిసారించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక పర్సన్ ఇన్‌ఛార్జుల ఆధ్వర్యంలో రూ.23 కోట్లు వచ్చాయి.

**రూ.400 కోట్ల లక్ష్యంతో..**

బ్యాంకు పరంగా ఏటా రూ.2,232 కోట్ల మేర టర్నోవర్ జరుగుతోంది. ఇందులో రుణాల కింద రూ.1893 కోట్లు ఇస్తున్నారు. దీని ప్రకారం రూ.800 కోట్ల మేర డిపాజిట్ ఉండాలి. ప్రస్తుతం రూ.339 కోట్లు మాత్రమే ఉన్నాయి. ఆరు నెలల వ్యవధిలో రూ.27 కోట్లను సేకరించారు. డిసెంబరు నాటికి మరో రూ.375 కోట్లను సమీకరించాలని నిర్ణయించారు. 2026 మార్చి నాటికి రూ.400 కోట్లు వచ్చేలా లక్ష్యంగా పెట్టుకున్నారు. వినియోగదారులను ఆకట్టుకునేందుకు సహకార బ్యాంకుల్లో అయితే 7.90 శాతం వడ్డీ, సొసైటీల్లో అయితే 8.90 శాతం వడ్డీ ఇవ్వనున్నారు.**కారణాలివీ..**గత పాలకవర్గాల్లో సొసైటీల స్పందన అంతంత మాత్రమే కావడంతో బ్యాంకు నష్టాల్లోకి వెళ్లింది. తొలి నాళ్లలో డిపాజిట్లపై నిషేధం ఉండడం కూడా ప్రధాన కారణంగా కనిపిస్తోంది. సహకార రంగంలో కొన్ని బ్యాంకులు, సంస్థలు దివాలా తీయడంతో ఆ ప్రభావం సైతం పడింది. రెండు జిల్లాల్లో 94 సొసైటీలున్నాయి. ఇందులో కెల్ల, తెట్టంగి, సతివాడ మినహా మిగిలిన అన్నింట్లో ధాన్యం కొనుగోలు ద్వారా వచ్చిన కమిషన్‌నే డిపాజిట్‌గా చూపుతున్నారు. వ్యక్తిగతంగా సేకరించడం లేదు. ఈ నేపథ్యంలో ప్రచారం చేయనున్నారు.**రైతుల మేలు కోసమే..**డిపాజిట్లు పెంచే దిశగా సొసైటీలతో సంప్రదింపులు జరుపుతున్నాం. ఇప్పటికే గాజులరేగ, చీపురుపల్లి తదితర కార్యాలయాలను సందర్శించాం. సొంత నిధులు పెంచుకోవడంతో తక్కువ వడ్డీకే రైతులకు రుణాలు ఇవ్వొచ్చు. దీంతో లక్ష్యాలు విధించాం.

# తాడిపత్రి రాళ్లలో.. ఎన్నెన్ని సొబగులో

తాడిపత్రి : దేశవ్యాప్తంగా తాడిపత్రిలో లభించే గ్రానైట్ బండలకు ప్రత్యేక గుర్తింపు ఉంది. 25 ఏళ్లుగా ఇక్కడి పాలిషింగ్ యూనిట్లలో కోస్తున్న రంగు బండలు మన్నిక, నాణ్యతకు పేరు గాంచాయి. ముడిసరకు ఇక్కడ లభించకపోయినా ఇతర జిల్లాల నుంచి తెప్పించి...కటింగ్, పాలిషింగ్ చేసి ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేస్తున్నారు. తాడిపత్రి పరివాహక ప్రాంతంలోని పెన్నా నది ఒడ్డున పుష్కలంగా నీరు ఉండటంతో పెద్ద సంఖ్యలో పరిశ్రమలు వెలిశాయి. ప్రతి నెలా పన్నులు, విద్యుత్తు బిల్లుల రూపంలో ప్రభుత్వానికి రూ.2.50 కోట్లకు పైనే ఆదాయం వస్తోంది. ఈ పరిశ్రమల ద్వారా కర్నూలు, కడప జిల్లాలతో పాటు కదిరి, గుంతకల్లు ప్రాంతాలకు చెందిన దాదాపు



8 వేలకు పైగా కార్మికులు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి పొందుతున్నారు. దేశంలోని ఇతర రాష్ట్రాలు, జిల్లాలతో పోలిస్తే తాడిపత్రిలో గ్రానైట్ తక్కువ ధరకు లభించడం ముదావహం.

తక్కువ ధరకే గ్రానైట్ పలకలు
గ్రానైట్ పరిశ్రమలు: 180
నెలకు వచ్చే ముడిసరకు: 1500 క్యూబిక్ మీటర్లు
ఏటా టర్నోవర్: రూ.100కోట్లకుపైనే
ప్రభుత్వానికి ఆదాయం (నెలకు): పన్ను, విద్యుత్తు ఛార్జీల రూపంలో రూ.2.50 కోట్లు
ఎగుమతులు: ముంబయి, చెన్నై, దిల్లీ, కోల్‌కతా తదితర రాష్ట్రాలకు
లభించే రకాలు: గ్రీన్, బ్లాక్, ఫిషర్ బ్లాక్, వైట్, రెడ్

## ప్రభుత్వ విద్యార్థి.. అందుకో బహుమతి

తిరుపతి : మీరు ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్నారా.. అయితే మీకో అవకాశం. మీ ప్రతిభకు పరీక్ష. ఇందులో విజయం సాధిస్తే నగదు ప్రోత్సాహకాలు ఇస్తారు. ఎపిఫనీ మెరిట్ టెస్ట్ (ఈఈఎంటీ 2025)లో సత్తా చాటితే చాలు. ఈ వివరాలు ఏంటో తెలుసుకుందామా..!

**పరీక్షా విధానం**

పరీక్ష రెండు దశల్లో ఉంటుంది.
ప్రిలిమ్స్ ఇంటి నుంచి లేదా పాఠశాలలోనైనా ఆన్‌లైన్‌లో రాయాలి. ఇందులో ప్రతిభ కనబరిచితే మెయిన్స్‌కు ఎంపిక చేస్తారు. నిర్దేశించిన కేంద్రాల్లో పరీక్ష నిర్వహిస్తారు.
సిలబస్: ఏపీ ప్రభుత్వ, ఎస్‌సీఈఆర్టీ, పాఠ్యపుస్తకాలపై (గణితం, సైన్స్,



సోషల్, మానసిక సామర్థ్యం) ప్రశ్నలు ఉంటాయి.
పరీక్ష సమయం: 60 నిమిషాలు
ముఖ్యమైన తేదీలు: రిజిస్ట్రేషన్‌కు గడువు: ఈ నెల 14
ప్రిలిమ్స్: డిసెంబర్ 29
మెయిన్స్: జనవరి 19
ప్రోత్సాహకాలు
అర్హులు: ప్రభుత్వ పాఠశాలల్లో 7, 10వ తరగతి విద్యార్థులు.
ఫీజు: రిజిస్ట్రేషన్ ఉచితం.
బహుమతులు: రాష్ట్ర, జిల్లా స్థాయిలో విజేతలకు మొత్తం రూ.9 లక్షల వరకు నగదు, సర్టిఫికెట్లు.
పదో తరగతి: రాష్ట్ర స్థాయిలో మొదటి మూడు ర్యాంకులకు రూ.30 వేలు, రూ.25 వేలు, రూ.20 వేలు.
7వ తరగతి: రూ.20 వేలు, రూ.15 వేలు, రూ.10 వేలు అందిస్తారు.
మండల స్థాయిలో ప్రతిభ కనబర్చిన వారికి గుర్తింపు (సర్టిఫికెట్లు, మెడల్స్) లభిస్తుంది.

## ఎప్పుడైనా విత్తుకునేలా..

చిత్తూరు : తెగుళ్లను తట్టుకుని అధిక దిగుబడులనిచ్చే కొత్త వరి వంగడాన్ని వ్యవసాయశాఖ అందుబాటులోకి తెచ్చింది. నెల్లూరు వ్యవసాయ పరిశోధన కేంద్రం పరిశోధన చేపట్టి ఎన్‌ఎల్‌ఆర్-3648 రకం కొత్త వరి వంగడాన్ని సిద్ధం చేసింది. ఇది సన్నరకం. పొట్టిగా ఉంటుంది. వ్యవసాయ శాస్త్రవేత్తలు పరిశోధన క్షేత్రంలోనే ప్రయోగాత్మకంగా తొలుతగా దీని సాగు చేపట్టారు. ఆశించిన స్థాయిలో మంచి ఫలితాలు వచ్చాయి. దీంతో దీని విస్తరణకు మొదటగా జిల్లాకు 15కిట్లు(కిట్‌లో రెండు కిలోలు) అందజేశారు.

**అగ్గి తెగులు దరిచేరదు**

కొత్త రకం ఎన్‌ఎల్‌ఆర్-3648 వంగడం జిల్లాకు ఎంతో అనుకూలం. ఈ నెలలోనే సాగు చేపట్టాలనే నిబంధన లేదు. ఏడాదిలో ఎప్పుడైనా, ఏరోజైనా విత్తు కోవచ్చు. పంట కాలం 125 రోజులు. వరి కాండం గడుసుగా, వెన్ను దట్టంగా పెరుగుతుంది. ఎకరాకు 34-35 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. జిల్లాలో ప్రయోగాత్మకంగా దీని సాగుకు ఆసక్తి కలిగిన రైతులకు విత్తన కిట్లు అందజేస్తామని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మురళీకృష్ణ తెలిపారు. మంచి దిగుబడులు లభిస్తే కొత్త రకం వంగడం సాగు విస్తరణకు చర్యలు తీసుకుంటామన్నారు. విత్తన కిట్లు కావలసిన రైతులు ఏవోలను సంప్రదించాలని ఆయన కోరారు.

# కుదిరితే కప్పు కాఫీ.. నాలుగు మాటలు



అనంతపురం : నగరాల్లో నలుగురు మిత్రులు కలిసి సరదాగా మాట్లాడుకోవడానికి, ఉరుకులు పరుగులతో అలసిన మనసుకు ఒత్తిడి తగ్గించుకునేందుకు, స్థిరాస్తి వ్యాపార లావాదేవీలకు టీ కేఫ్‌లు వేదికలవుతున్నాయి. ఎక్కడా లేని టీ కేఫ్ సంస్కృతి అనంతపురం నగరంలో, 44వ జాతీయ రహదారి వెంబడి రోజురోజుకు విస్తరిస్తోంది. అర కిలోమీటరు విస్తీర్ణం కూడా లేని ఆదిమూర్తినగర్‌లో 60కి పైగా ఉన్నాయంటే మార్పు ఏ రీతిలో ఉందో అర్థం చేసుకోవచ్చు ఏ కేఫ్‌లో, ఏ సమయంలో చూసినా ఉదయం నుంచి సాయంత్రం దాకా సగటున 50, 60 మందికి తగ్గకుండా ఉంటున్న తీరు మారుతున్న ధోరణికి అద్దం పడుతోంది.

**భారీ పెట్టుబడి లేకుండానే..**


నగరంలో కనీసం 5 నుంచి 10 సెంట్ల ఖాళీ స్థలం ఉంటే చాలు. వ్యాపారం చేద్దామనుకున్న వారికి టక్కున మదిలోకి వచ్చేది టీ కేఫ్ పెట్టాలన్న ఆలోచనే. పైన రేకులు వేయడం, గుండ్రని టేబుళ్లు పరవడం, కింద రాళ్లతో చిప్స్ వేయడం, కొంతభాగం ఖాళీగా ఉంచి తక్కువ ఖర్చుతో ఏర్పాటు చేసేస్తున్నారు.

**విస్తరణ ఇలా..**

నగరంలోని సాయినగర్ నుంచి అశోక్‌నగర్, విద్యుత్తు నగర్ కూడలి, హౌసింగ్ బోర్డు, జేఎన్‌టీయూ రోడ్డు, బెంగళూరు రోడ్డు, రాంనగర్ నుంచి శ్రీనగర్ కూడలి, ఆదిమూర్తినగర్, ఎన్టీఆర్ మార్గ్, 44వ జాతీయ రహదారి తపోవనం కూడలి, బళ్లారి, కళ్యాణదుర్గం, రుద్రంపేట నడకదారి, రాప్తాడు సమీపంలో ప్రసన్నాయపల్లి కూడలి వరకు పెద్ద సంఖ్యలో కేఫ్‌లు విస్తరిస్తున్నాయి.

**ఏమేం ఉంటాయి** ఇరానీ టీ, గ్రీన్, తాటిబెల్లం, అల్లం, జింజర్, బ్లాక్, మసాలా, బ్లూ, బ్లాక్ జింజర్, దమ్, రాగి మాల్ట్

# ఆ 'గంట' గడిస్తే చాలు



అనంతపురం : గుండె నిమిషానికి 72 సార్లు కొట్టుకుంటుంది. 2 వేల గ్యాలన్ల రక్తాన్ని శుద్ధిచేసి 60 వేల మైళ్ల దూరం పంపింగ్ చేయగలుగుతుంది. ఆధునిక మనిషి పరుగు వేగం అందుకునేందుకు అంతటి గుండెకు సైతం ఒత్తిడి పెరుగుతోంది. అలుపెరుగని హృదయానికి వచ్చే జబ్బులపై కన్నేసి కాపాడుకుంటేనే మనకు జీవితం..

1. ఆందోళన : ఇటీవల కాలంలో వయసుతో సంబంధం లేకుండా ఎక్కువ మంది గుండెపోటుకు గురై ప్రాణాలు కోల్పోతున్న ఘటనలు
2. కారణాలు : కల్తీ ఆహార పదార్థాలు తినటం, సరైన ఆహారం తీసుకోక, చెడు వ్యసనాలకు అలవాటు, శారీరక వ్యాయామం లేకపోవడం
3. ఊరట : ఆసుపత్రుల్లో రూ.45 విలువ చేసే టెనెక్టప్లేస్ ఇంజక్షన్ అందుబాటులో..

**గోల్డెన్ అవర్..**

గుండె సమస్యతో సదరు ఆసుపత్రులకు రోగులు వస్తే వెంటనే వారికి బీపీ, ఈసీజీ పరీక్ష చేసి వచ్చే పలితాలను ప్రభుత్వం ఏర్పాటు చేసిన స్టెమీయాప్ ద్వారా గుండె వైద్య నిపుణులకు పంపితే వారు వాటిని పరిశీలించి రోగికి ఎలాంటి చికిత్సలు అందించాలో సూచిస్తారు. ఆ మేరకు టెనెక్టప్లేస్ ఇంజక్షన్‌ను వైద్యులు, సిబ్బంది రోగికి వేసి ప్రాణాలను కాపాడుతున్నారు. గుండె సమస్య తలెత్తిన గోల్డెన్ అవర్‌లో రోగిని ఆసుపత్రికి తీసుకువస్తే వారికి సకాలంలో ఇంజక్షన్ వేసి పునర్జన్మ ఇస్తున్నారు.

గుండెపోటు బాధితులకు సీపీఆర్ చేయాలి. వారిని గోల్డెన్ అవర్‌లోనే తీసుకొస్తేనే బతికించడం సాధ్యం అవుతుంది. వైద్యులు సూచించిన చికిత్స విధానాలు చేపడితే కొన్ని నిమిషాల్లో కుదుట పడతారు. అప్పటికీ ఆరోగ్య పరిస్థితి బాగోలేకపోతే వెంటనే టెనెక్టప్లేస్ ఇంజెక్షన్ వేయాలి. ఆరోగ్యం నిలకడగా ఉన్న తరువాత ఆసుపత్రులకు తరలిస్తే శస్త్రచికిత్స ఉచితంగా చేస్తారు.

డాక్టర్ డేవిడ్ సిల్వన్‌రాజ్, జిల్లా ఆసుపత్రుల సమన్వయకర్త

**ఈ లక్షణాలుంటే..** గుండెదడ, ఛాతీపై బరువు, మంటగా ఉండటం, శ్వాసలో ఇబ్బంది, వాంతులు, దవడ నొప్పి, చెమటలు పట్టడం, తలతిరిగి కిందపడిపోవటం, ఛాతినొప్పి, ఎడమచేతి వరకూ రావటం వంటి లక్షణాలు కనిపిస్తే ఏమాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలి.

# ఎక్కడ ఆగుతాయో ఏమో!



అనంతపురం : నిరంతర ప్రయాణం.. సంవత్సరాలు పెరిగే కొద్దీ బస్సులు రిపేర్లు రావడం సాధారణం. ఎప్పటికప్పుడు సక్రమంగా చూసుకొని మరమ్మతులు సాగిస్తేనే బండి ముందుకు కదులుతుంది. నిత్యం వేలాది ప్రయాణికులను గమ్యానికి చేర్చే ఆర్టీసీ బస్సుల సామర్థ్యాన్ని నిరంతరం పరిశీలించాల్సిందే. అయితే అలాంటి వాతావరణం ఉందా.. ఆర్టీసీలో ప్రస్తుతం ఉన్న బస్సుల్లో సగానికి పైగా పదేళ్లు దాటినవే. అనంతపురం ఆర్టీసీ డిపోలో రెండు బస్సులు తుక్కుకు పంపగా మరో 4 బస్సులు పంపాల్సి ఉంది. 2026లో మరో 15 బస్సులు గడువు ముగుస్తోంది. వాటిని తుక్కుకు పంపాల్సి ఉంది. జిల్లాలోని 7 డిపోల పరిధిలో కాలం సమీపిస్తున్న బస్సులు ఇదే తరహాలోనే ఉన్నాయి. వాహనచట్టం ప్రకారం 15 ఏళ్లు కంటే ఎక్కువ సంవత్సరాలు బస్సుల్ని నడపకూడదు. 14 సంవత్సరాలు దాటిన బస్సులు కాలం సమీపిస్తుండటంతో అవి ఎక్కడికక్కడ ఆగిపోతున్నాయి.

ఆగస్టు 15 నుంచి స్త్రీ శక్తి పథకం ప్రారంభం తర్వాత 72 శాతం ఉన్న ఆక్యుపెన్సీ రేటు తాజాగా 85కు చేరుకుంది. గడువు సమీపిస్తున్న బస్సుల్లో ఈ తరహా ప్రయాణాలు ఆపేయాల్సి ఉంది.

ఈనెల 3న అనంతపురం డిపో బస్సు తాడిపత్రికి వెళ్లింది. తిరుగు ప్రయాణంలో ప్రయాణికులతో వస్తుండగా క్లచ్ పని చేయలేదు. డ్రైవర్ బస్సును పాతూరు మార్కెట్ మీదుగా కాకుండా ఎన్టీఆర్ మార్గ్ మీదుగా తీసుకొచ్చి ప్రధాన రోడ్డులో ఆపి దించాల్సి వచ్చింది.

ఈనెల 5,6 తేదీల్లో వరుసగా పుట్లూరు మండలంలో బస్సులు అదుపు తప్పాయి. 5న చింతకుంటలో అదుపు తప్పి గుంతలోకి దూసుకెళ్లింది. 60 మంది ప్రయాణికులకు ప్రమాదం తప్పింది.

మరమ్మతులు చేసి పంపుతున్నాం..

షెడ్యూల్ ప్రకారం బస్సును పరిశీలించి మరమ్మతులు చేసి పంపుతున్నారు. సక్రమంగా లేని విడిభాగాలను తొలగిస్తున్నాం. 15 సంవత్సరాల గడువు తీరిన బస్సులు ఎక్కడా పంపడం లేదు.

శ్రీలక్ష్మి, జిల్లా ప్రజా రవాణా అధికారిణి

అనంతలో ఆర్టీసీ డిపోలు: 7
బస్సులు: 470
15 సంవత్సరాలకు దగ్గరలో ఉన్న బస్సులు: 70
సగటున రోజుకు ప్రయాణికులు: 2.10 లక్షలు

# ప్రకృతి వనరు.. దోపిడీ ఆపరు



పుట్టపర్తి: పచ్చనిచెట్లతో ఆహ్లాదం పంచే కొండలు, గుట్టలను చూస్తే ఎవరికైనా మనసు పరవశించిపోతుంది. అక్రమార్కులకు వాటిని చూస్తే నోట్ల కట్టలు కనిపిస్తున్నాయి. తవ్వుకున్నోడికి తవ్వుకున్నంత అన్నట్లు స్థానిక నాయకులు.. అధికారులతో కుమ్మక్కై ప్రకృతి వనరులను దోచేస్తున్నారు.

**రూ.లక్షల్లో గండి..** కొండలు, గుట్టలు, అటవీ ప్రాంతాలు, ప్రభుత్వ భూముల్లో రాయి, ఇసుక, మట్టి తవ్వకాలు జరిపే ముందు ఎలాంటి అనుమతులు తీసుకోలేదు. కొత్తచెరువులో పట్టా భూమి అని చెబుతున్నా.. మైనింగ్ శాఖ నుంచి అనుమతులు లేవు. వ్యవసాయ యోగ్యం కాని గుట్టకు అప్పటి అధికారులు జేబులు నింపుకొని పట్టాలిస్తే.. గత వైకాపా ప్రభుత్వంలో ఫ్రీహోల్డ్ చేసి చేతులు దులుపుకొన్నారు. ఫలితంగా 50 శాతం గుట్టను అక్రమార్కులు మింగేశారు.

**కాసులు కురిపిస్తున్న ఇసుక** బత్తలపల్లి, ముదిగుబ్బ మండలాల్లో ఇసుక రీచ్ నుంచి ట్రిప్పర్ల ద్వారా ధర్మవరం మీదుగా బెంగళూరుకు అక్రమంగా తరలిపోతోంది. చిత్రావతి నది నుంచి బత్తలపల్లి మీదుగా అనంతపురం, ముదిగుబ్బ, కదిరి మీదుగా మదనపల్లికి రవాణా చేస్తున్నారు. కొత్తచెరువు మండలం వంగపేరు నుంచి పట్టపగలే ట్రాక్టర్లతో తరలిస్తున్నారు.

ఎక్కడ? కొత్తచెరువు మండలం నాగిరెడ్డిపల్లికాలనీకి సమీపంలో సర్వే నంబరు.392లో ఉన్న దాసరిపాము గుట్ట

ఏం చేస్తున్నారు? హిటాచీ, టిప్పర్లతో మట్టిని యథేచ్ఛగా తరలిస్తున్నారు. పెద్ద బండరాళ్లను ముక్కలు చేయడానికి పేలుళ్లు నిర్వహిస్తున్నారు. స్థానికుల మాట కొత్తచెరువులో రెండ్రోజుల కిందట పేలుళ్లు జరిగాయి. వణికిపోయాం. ఇదేమని అడిగితే తమ పేరుతో పట్టా ఉందంటున్నారు. సొంత స్థలమైతే ఇష్టారాజ్యంగా పేలుళ్లు చేసుకోవచ్చా? అని అడిగితే సమాధానం లేదు.

**చర్యలు తీసుకుంటాం** అనుమతి లేకుండా కొండలు, గుట్టలు తవ్వితే విచారణ చేపడతాం. పేలుళ్లు చేయాలన్నా నిబంధనలు పాటించాల్సిందే. స్థానిక అవసరాలకు కాకుండా వ్యాపారం చేస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటాం. ఓబుళరెడ్డి, మైనింగ్‌శాఖ ఏడీ

## రూ. 50 కోట్లతో పద్మావతి ఘాట్

తిరుపతి : పవిత్ర స్వర్ణముఖి తీరంలోని తిరుచానూరులో పద్మావతి ఘాట్ ఏర్పాటుకు తుడా ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నది. పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాల్లో భాగంగా జరిగే పంచమీ తీర్థం నాడు లక్షలాది మంది ఇక్కడ పుణ్యస్నానాలు ఆచరిస్తుంటారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఘాట్ నిర్మాణం చేపట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సూచించడంతో యంత్రాంగం రంగంలోకి దిగింది.

**సుమారు 50 ఎకరాల్లో..**

తిరుచానూరు నుంచి పాడిపేటకు వెళ్లే మార్గంలో ప్రస్తుతం వాహనాల పార్కింగ్ కోసం వినియోగిస్తున్న స్థలం వద్ద సుమారు 50 ఎకరాల్లో పద్మావతి ఘాట్ నిర్మించాలని నిర్ణయించారు. స్నానాలు ఆచరించడానికి నీటి నిల్వ చేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఎగువ భాగంలో 11 చెక్‌డ్యాంలను నిర్మించి నీటిని నిల్వ చేసేలా సర్వే చేపట్టారు. అందుకోసం రూ.18 కోట్లు అవసరమని అధికారులు నివేదికలు పంపించారు.రాజమండ్రికి చెందిన ఓ నిపుణుడు ఇప్పటికే ఘాట్ ప్రతిపాదిత ప్రాంతాన్ని పరిశీలించి నమూనాలు సిద్ధం చేసేందుకు అంగీకారం కోరినట్లు చెబుతున్నారు. ప్రతి శుక్రవారం పద్మావతి ఘాట్‌లో హారతి ఇచ్చేలా కార్యాచరణ రూపొందించారు.



జలవనరుల శాఖతో సంబంధం లేకుండా రూ.50 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేయాలని తుడా ప్రతిపాదించింది.

**మురుగును అడ్డుకోవడమే సవాలు**

ఘాట్ ప్రతిపాదిత ప్రాంతానికి ఎగువ భాగంలో స్వర్ణముఖిలోకి పలు ప్రాంతాల్లో మురుగునీరు ప్రవేశిస్తోంది. ఇవి నది పవిత్రతను దెబ్బతీస్తున్నాయనే ఆవేదన భక్తుల్లో ఎక్కువగా ఉంది. దీంతో అవసరమైన ప్రాంతాల్లో మురుగు నీటి శుద్ధి ప్లాంట్లు ఏర్పాటు చేసి కలుషితాలను నియంత్రించేందుకు నగరపాలిక సహకారం తీసుకోనున్నారు. ఇందులో రెవెన్యూ, జలవనరుల శాఖ, తుడా ప్రణాళిక విభాగం, సర్వే శాఖలను భాగస్వాములను చేశామని తుడా ఛైర్మన్ సి.దివాకర్‌రెడ్డి తెలిపారు.

## అత్యవసర వైద్య సేవలకు సన్నద్ధం

విశాఖపట్నం: ఆంధ్ర విశ్వవిద్యాలయం ప్రాంగణంలో నిర్వహించనున్న భాగస్వామ్య సదస్సుకు వివిధ ప్రాంతాల నుంచి ఉన్నతస్థాయి ప్రముఖులు, ప్రతినిధులు హాజరుకానున్నారు. ఈ నేపథ్యంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు.వైద్యారోగ్య సేవలను పర్యవేక్షించే బాధ్యతను డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు, కేజీహెచ్ సూపరింటెండెంట్ డా.వాణికి అప్పగించారు. అత్యవసర పరిస్థితి ఎదురైతే సేవలందించేందుకు సిద్ధంగా ఉండేందుకు వైద్యులు, సిబ్బందిని సన్నద్ధం చేస్తున్నారు.

**వైద్య బృందాలు.. అంబులెన్సులు**


సదస్సు ప్రాంగణంలో వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నారు. గురు, శుక్ర, శనివారాల్లో మూడు షిఫ్టుల్లో అక్కడ వైద్యులు, సిబ్బంది సేవలందిస్తారు.అత్యవసర సేవలందించేందుకు వైద్య బృందాలు, అంబులెన్సులు, ప్రథమ చికిత్స కేంద్రాలను సిద్ధం చేస్తున్నారు.
జనరల్ ఫిజీషియన్, హృద్రోగ నిపుణులు, ఇతర వైద్య నిపుణులు, నర్సింగ్, ఇతర సిబ్బంది ఇక్కడుంటారు. పరిస్థితికి తగ్గట్టుగా చికిత్స చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.
ప్రథమ చికిత్స సామగ్రి, అవసరమైన మందులు, ప్రాథమిక రోగనిర్ధారణ పరికరాలు సిద్ధం చేస్తున్నారు.
కలెక్టరేట్‌లోని కంట్రోల్‌రూం నుంచి వైద్యారోగ్య శాఖ తరఫున ఒక ప్రతినిధి నిత్యం పరిస్థితిని పర్యవేక్షిస్తారు.
కంట్రోల్ రూం, హాస్టల్, పార్కింగ్ స్థలం తదితర ఆరు ప్రాంతాల్లో అంబులెన్సులు అందుబాటులో ఉంటాయి.
ప్రతినిధులు బస చేయనున్న రాడిసన్ బ్లూ, నొవొటెల్, గ్రాండ్ బే, దసపల్లా హోటళ్ల వద్ద అంబులెన్సులతో పాటు వైద్య బృందాలు సిద్ధంగా ఉంటాయి. - కేజీహెచ్, అపోలో, కేర్, మెడికవర్ ఆసుపత్రుల యాజమాన్యాలను అప్రమత్తం చేశారు. అత్యవసర పరిస్థితుల్లో సేవలందించేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు.
ప్రయాణ సమయంలో తక్షణ వైద్య సహాయం కోసం వీవీఐపీ కాన్వాయ్‌లో ప్రత్యేక అంబులెన్సును ఏర్పాటు చేయనున్నారు.

## ఆధార్ అధనంపై ఫిర్యాదు చేయొచ్చు

నంద్యాల : ఆధార్ కార్డుల్లోని తప్పుల సవరణ, పేరు, చిరునామాల్లో మార్పులు, నవీకరణ తదితరాల కోసం జనం ఆధార్ కేంద్రాల వద్ద బారులు తీరుతున్నారు. కేంద్ర ప్రభుత్వం ఆధార్‌కు సంబంధించిన వివిధ మార్పులు చేర్పుల కోసం ఇదివరకు ఉన్న సర్వీసు రుసుము కాస్త పెంచింది. కేంద్రాల నిర్వాహకులు ఆ మేరకే వసూలు చేయాలి.

**ఆన్‌లైన్లో సంప్రదించొచ్చు**

రెసిడెంట్.యూఐడీఏఐ.ఇన్‌లోకి వెళ్లి లింక్ ద్వారా నేరుగా ఫిర్యాదు చేయొచ్చు లేదంటే హెల్ప్(అట్)యూఐడీఏఐ.జీవోవీ.ఇన్‌కు ఈమెయిల్ ద్వారా ఫిర్యాదు చేయొచ్చు.




ఫిర్యాదు చేసిన వెంటనే రెఫరెన్స్ నంబరు వస్తుంది. దాని ద్వారా నివేదికను ట్రాక్ చేసుకోవచ్చు.

కొత్త సర్వీసు ఛార్జీలు

కొత్తగా ఆధార్ నమోదు ఉచితం. డాక్యుమెంటు అప్‌లోడ్ చేయడానికి రూ.75 ఛార్జీలు ఉంటాయి. 5-7, 15-17 ఏళ్ల లోపు వారికి బయోమెట్రిక్ అప్‌డేట్ ఉచితం. పేరు, చిరునామా, పుట్టిన తేదీ, జెండర్, చరవాణి నంబరు, ఈ మెయిల్ ఐడీ నమోదుకు రూ.75 ఛార్జీలు ఉంటాయి. 17ఏళ్ల పైనున్న వారికి బయోమెట్రిక్ అప్‌డేట్ రూ.125 ఛార్జీలు ఉన్నాయి. ఆధార్ కార్డు డౌన్‌లోడ్, ప్రింట్‌కు రూ.40 ఛార్జీలు ఉన్నాయి. 1947 నంబరుకు ఫోన్ చేస్తే..

ఆధార్ కేంద్రాల్లో నిర్దేశిత రుసుము కంటే అధికంగా వసూలు చేస్తే 1947 నంబరుకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయొచ్చు.

# చక్కనమ్మ చిక్కినా అందమే అన్నట్లు..!

ఇండస్ట్రీ ఏదైనా హీరోయిన్‌గా ఎంట్రీ ఇచ్చిన మొదటి సినిమాతోనే సూపర్ హిట్ దక్కించుకోవడం అనేది చాలా అరుదుగా జరుగుతూ ఉంటుంది. ఒకవేళ అలా మొదటి సినిమాతోనే సూపర్ హిట్‌ను సొంతం చేసుకుంటే ఆ హీరోయిన్ వెనక్కి తిరిగి చూసుకునే అవకాశం రాదు. వరుస సినిమా ఆఫర్లు దక్కించుకుని కెరీర్‌లో దూసుకు పోవడం మనం చూస్తూ ఉంటాం. ఆ తర్వాత కెరీర్ గురించి పక్కన పెడితే వరుసగా నాలుగు అయిదు సినిమాలకు సైన్ చేయడం మనం చూస్తూ ఉంటాం. కానీ అర్జున్ రెడ్డి వంటి బ్లాక్ బస్టర్ విజయాన్ని సొంతం చేసుకున్న హీరోయిన్ షాలిని పాండే పాపం కెరీర్ పరంగా ఏమాత్రం ముందుకు సాగలేక పోయింది. షాలిని పాండే మొదటి సినిమా హిట్ అయినా ఆ తర్వాత నుంచి ఆఫర్లు పెద్దగా రాలేదు. ఆ సినిమాలో ఆమె పోషించిన పాత్ర కారణంగా ఆఫర్లు రాలేదా... మరేదైనా కారణమా అనే విషయమై ఇప్పటికీ చర్చ జరుగుతూనే ఉంది.

**అర్జున్ రెడ్డి హీరోయిన్‌కి ఆఫర్లు...** అందంతో పాటు, ప్రతిభ ఉన్న నటి అయినప్పటికీ షాలిని పాండేకు దక్కాల్సిన గుర్తింపు, స్టార్‌డం దక్కలేదు అని ఆమె అభిమానులు అంటూ ఉంటారు. సోషల్



మీడియాలో ఆమెను ఫాలో అయ్యే లక్షల మంది ఆమెకు ఇంకాస్త మెరుగ్గా సినిమా ఆఫర్లు రావాల్సింది అనే అభిప్రాయంను వ్యక్తం చేస్తారు. ముందు ముందు అయినా ఈ అమ్మడికి వరుస ఆఫర్లు వస్తాయి అనే విశ్వాసంతో ఎదురు చూస్తున్నారు. సోషల్ మీడియాలో ఆమె రెగ్యులర్‌గా షేర్ చేసే అందాల ఆరబోత ఫోటోలు, వీడియోల కారణంగా ఎప్పటికప్పుడు వైరల్ అవుతూనే ఉంటుంది. ఆ సమయంలో ఈమెకు కచ్చితంగా హీరోయిన్‌గా మంచి భవిష్యత్తు ఉందని చాలా మంది అనుకుంటూ ఉంటారు. తీరా చూస్తే సినిమా ఆఫర్లు కనుమరుగు అవుతూ ఉంటాయి. కనీసం చిన్న సినిమాల్లో నటించే అవకాశాలు రాకపోవడంతో ఈ అమ్మడు ఆఫర్ల కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది.

**సోషల్ మీడియాలో అందాల ఫోటోలు...** సోషల్ మీడియాలో ఎప్పటి మాదిరిగానే తాజాగా మరో అందమైన ఫోటో షూట్ ను షాలిని పాండే షేర్ చేసింది. వైట్ డ్రెస్‌లో సాధారణంగానే అమ్మాయిలు మరింత అందంగా కనిపిస్తూ ఉంటారు. షాలిని పాండే విభిన్నమైన ఈ వైట్ ఔట్ ఫిట్‌ను ధరించడం ద్వారా అందరి దృష్టిని ఆకర్షించింది. ఆకట్టుకునే అందంతో పాటు మంచి ఫిజిక్ ఈ అమ్మడి సొంతం అంటూ మరోసారి నిరూపితం అయ్యింది. క్లీవేజ్ షో చేస్తూ చూపు తిప్పనివ్వకుండా అందంగా కనిపిస్తున్న షాలిని పాండే ఈ ఔట్ ఫిట్ లో అంతకు మించి అన్నట్లుగా ఉందని పలువురు అంటూ ఉన్నారు. ఇక ఈ ఫోటోల్లో షాలిని కాస్త బక్క చిక్కినట్లు గా అనిపిస్తుంది. అందుకే నెటిజన్స్ ఈ అమ్మడు చిక్కినా అందంగానే ఉంది అన్నట్లుగా కామెంట్స్ చేస్తున్నారు. చక్కన్నమ్మ చిక్కినా అందమే అంటూ మరికొందరు సోషల్ మీడియా ద్వారా ఈ ఫోటోలు షేర్ చేస్తూ తెగ కామెంట్స్ చేస్తూ వైరల్ చేస్తున్నారు.

## రుక్కు కోసం స్టార్స్ వెయిటింగ్..?

కన్నడ భామ రుక్మిణి వసంత్ ఇప్పుడు సూపర్ ఫామ్ కొనసాగిస్తుంది. కన్నడలో అమ్మడు చేస్తున్న సినిమాలు సూపర్ హిట్ అవ్వడమే కాదు ఆమెకు సౌత్ లో బీభత్సమైన క్రేజ్ తెచ్చాయి. కాంతారా చాప్టర్ 1లో కనకావతి రోల్ లో అమ్మడి పర్ఫార్మెన్స్, గ్లామర్ అన్నీ రుక్మిణికి మరింత పాపులారిటీ తెచ్చాయి. అందుకే అమ్మడికి వరుస ఆఫర్లు వస్తున్నాయి. ఆల్రెడీ ఈ అమ్మడు ఎన్ టీ ఆర్, ప్రశాంత్ నీల్ కాంబినేషన్ ప్రాజెక్ట్ లో నటిస్తుంది. ఈ సినిమాలో రుక్మిణికి కూడా మంచి రోల్ దక్కినట్టు తెలుస్తుంది.

**టాలీవుడ్ లో వరుస స్టార్ హీరోలతో రుక్మిణి వసంత్..** రుక్మిణి వసంత్ ఎన్టీఆర్ తర్వాత టాలీవుడ్ లో వరుస స్టార్ హీరోలతో జత కట్టే ఛాన్స్ ఉందని తెలుస్తుంది. అమ్మడికి తెలుగులో కూడా సూపర్ క్రేజ్ ఏర్పడింది. రష్మిక, పూజా హెగ్డే లాంటి వాళ్లను వెనక్కి నెట్టి రుక్మిణి ప్రస్తుతం ట్రెండింగ్ లో ఉంటుంది. అందుకే స్టార్స్ కూడా ఆమెకే



ఓటేస్తున్నారు. రుక్మిణి వసంత్ ఎన్ టీ ఆర్ సినిమా రిలీజ్ అవ్వడమే ఆలస్యం నెక్స్ట్ లిస్ట్ లో అల్లు అర్జున్, రామ్ చరణ్ కూడా ఉన్నారని తెలుస్తుంది. సుకుమార్ చరణ్ కాంబినేషన్ సినిమాలో రుక్మిణి వసంత్ నే హీరోయిన్ గా తీసుకునే అవకాశం ఉందని తెలుస్తుంది. ఇక అల్లు అర్జున్, అట్లీ మూవీ తర్వాత నెక్స్ట్ సినిమాకు యూత్ లో మంచి ఫాలోయింగ్ ఉన్న రుక్మిణి వసంత్ నే తన సినిమాలో తీసుకోవాలనే ప్లానింగ్ ఉందట. సో రుక్మిణి ఈ కొత్త జోడీలు ఫ్యాన్స్ కి సూపర్ ఎంటర్టైన్మెంట్ అందిస్తాయి. ఐతే రుక్మిణి వసంత్ కేవలం స్టార్ హీరోలతోనే కాదు తెలుగులో మంచి లవ్ స్టోరీస్ చేయాలని ఆడియన్స్ కోరుతున్నారు.

**సప్త సాగరాలు దాటి సినిమాలో ప్రియ పాత్రలో..** సప్త సాగరాలు దాటి సినిమాలో ప్రియ పాత్రలో అలరించిన రుక్మిణి తెలుగులో కూడా అలాంటి లవ్ స్టోరీస్ ని చేస్తే బెటర్ అని భావిస్తున్నారు. కమర్షియల్ సినిమాలు చేసినా ఆమె మార్క్ నటనతో ఆకట్టుకుంటే మాత్రం రుక్మిణి నెక్స్ట్ టాలీవుడ్ బిగ్ స్టార్ అయ్యే ఛాన్స్ ఉందని చెప్పొచ్చు. తెలుగులో నిఖిల్ తో అప్పుడో ఇప్పుడో ఎప్పుడో సినిమా చేసింది కానీ అది ఎలా వచ్చిందో అలానే వెళ్లింది. అందుకే ఎన్ టీ ఆర్ సినిమాతో అమ్మడు గ్రాండ్ ఎంట్రీ ఇవ్వాలని ఫిక్స్ అయ్యింది. కన్నడలో పాపులారిటీ ఉన్న రష్మిక తెలుగులో కాస్త ఫామ్ రాగానే అక్కడ సినిమాలు తగ్గించింది ఐతే రుక్మిణి మాత్రం తెలుగు సినిమాలు చేసినా కూడా కన్నడ ఛాన్స్ లను మాత్రం అసలు వదిలేదని అంటుంది. మరి అమ్మడు అక్కడ ఇక్కడ ఎలా బ్యాలెన్స్ చేస్తుంది అన్నది చూడాలి.




# రాజా సాబ్ పై అవతార్ ఎఫెక్ట్.. అందుకే అక్కడ అలా..



పాన్ ఇండియా స్టార్ ప్రభాస్, డైరెక్టర్ మారుతి కాంబినేషన్ లో రూపొందుతున్న మూవీ ది రాజా సాబ్. హారర్ కామెడీ థ్రిల్లర్ గా తెరకెక్కుతున్న ఆ సినిమా.. వచ్చే ఏడాది జనవరిలో ప్రేక్షకుల ముందుకు రానుంది. సంక్రాంతి పండుగ కానుకగా వరల్డ్ వైడ్ గా తెలుగు, హిందీ, తమిళం, కన్నడ, మలయాళ భాషల్లో సందడి చేయనుంది. ఇప్పటికే సినిమాపై ఆడియన్స్ లో భారీ అంచనాలు క్రియేట్ అవ్వగా.. వాటిని అందుకుంటామని మేకర్స్ ధీమా వ్యక్తం చేస్తున్నారు. అందుకు తగ్గట్టే హార్డ్ వర్క్ కూడా చేస్తున్నారు. అయితే సినిమాను 2026 జనవరి 9వ తేదీన ఐమాక్స్ వెర్షన్‌తో సహా అన్ని ఫార్మాట్ లలో ఒకేసారి ప్రేక్షకుల ముందుకు రానుందని ఇప్పటికే తెలిపారు. ఇప్పటికే సినిమాకు సంబంధించిన టీజర్, గ్లింప్స్ కూడా ఐమ్యాక్స్ లో రిలీజ్ చేశారు.

దీంతో మూవీ ఐమ్యాక్స్ వెర్షన్ కోసం అంతా వెయిట్ చేస్తున్నారు. అయితే ఓవర్సీస్ లో ఆ ఫార్మాట్ లో ఇప్పుడు రాజా సాబ్ సినిమా రిలీజ్ అవ్వడం లేదని తెలుస్తోంది. ఈ మేరకు డిస్ట్రిబ్యూషన్ సంస్థ పోస్ట్ పెట్టింది. ఓవర్సీస్ ప్రముఖ డిస్ట్రిబ్యూషన్ సంస్థ ప్రత్యంగిరా సినిమాస్.. విదేశాల్లో రాజాసాబ్ ను రిలీజ్ చేయనుంది. అయితే ఇప్పుడు ఓవర్సీస్ లో ఐమ్యాక్స్ ఫార్మాట్ లో రాజా సాబ్ రిలీజ్ అవ్వడం లేదని సోషల్ మీడియాలో తెలిపింది. అవతార్ 3, ఐమ్యాక్స్ మధ్య నాలుగు వారాలు ప్రత్యేక ఒప్పందం ఉండడమే అందుకు కారణంగా వెల్లడించింది. అందుబాటులో ఉన్న అన్ని PLF, DBOX, ఇతర ప్రత్యేక ఫార్మాట్ ల్లో సినిమా చూడండని కోరింది. అయితే ఆ ఫార్మాట్ లు కూడా నాలుగు వారాల పాటు అవతార్ 3తో ఒప్పందం చేసుకుని ఉన్నాయని, కానీ ఎప్పటిలాగే వీలైనన్ని ఎక్కువ ప్రత్యేక ఫార్మాట్ షోలను పొందేందుకు తాము తీవ్రంగా కృషి చేస్తున్నామని ప్రత్యంగిరా తెలిపింది. నిజానికి.. అవతార్ -3 మూవీ డిసెంబర్ 19వ తేదీన రిలీజ్ కానుంది. రాజా సాబ్.. జనవరి 9వ తేదీన విడుదల అవ్వనుంది. రెండింటికి మధ్య నాలుగు వారాల కన్నా తక్కువ గ్యాప్ ఉంది. కాబట్టి ఇప్పటికే అవతార్ మేకర్స్.. ఐమ్యాక్స్ తో ఒప్పందం చేసుకోవడంతో రాజా సాబ్ పై ఆ ఎఫెక్ట్ పడింది. ఐమ్యాక్స్ ఫార్మాట్ లో రిలీజ్ కావడానికి వీలు లేకుండా పోయింది. దీంతో కొందరు ఓవర్సీస్ ఫ్యాన్స్ నెట్టింట నిరాశ వ్యక్తం చేస్తున్నారు.

# రియాలిటీ చెడకుండానే విజువల్ మాయాజాలం



భారతదేశంలో నెవ్వర్ బిఫోర్ అని చెప్పుకునేలా ఒక భారీ చిత్రం 2027లో విడుదలకు వస్తుంది. ఇది వార్నర్ బ్రదర్స్ సినిమాలాగా, కామెరూన్ సినిమాలాగా ఆశ్చర్యపరుస్తుందని అభిమానులు బలంగా నమ్ముతున్నారు. ఇది ఏ సినిమానో ఈపాటికే అర్థమై ఉంటుంది. కచ్చితంగా అది ఎస్.ఎస్.రాజమౌళి తెరకెక్కిస్తున్న వారణాసి. సూపర్ స్టార్ మహేష్ – ప్రియాంక చోప్రా ప్రధాన పాత్రలలో నటిస్తున్న ఈ సినిమాని ఇండియానా జోన్స్ లైన్స్ లో అత్యంత భారీగా రూపొందిస్తున్నారు. ఈ చిత్రం కోసం దాదాపు 900కోట్ల మేర బడ్జెట్ ని ఖర్చు చేస్తున్నారని కూడా గుసగుసలు వినిపిస్తున్నాయి. అడవులు, కొండలు కోనల్లో ఈ సినిమా కీలక సన్నివేశాలను తెరకెక్కిస్తూ దర్శకధీరుడు అంచనాల్ని మరింత ఎక్కువగా పెంచారు. ఇప్పుడు ఎంపిక చేసుకున్న కాన్వాసు, బడ్జెట్ దృష్ట్యా కూడా ఈ సినిమా రాజమౌళి తెరకెక్కించిన అన్ని ఇతర చిత్రాల కంటే అత్యంత భారీతనంతో కళ్లు మిరుమిట్లు గొలిపే ట్రీట్ ఇస్తుందని అంచనా వేస్తున్నారు. ఇలాంటి సమయంలో రాజమౌళి అనుయాయుడు అయిన దర్శకరచయిత దేవకట్టా ఓ మాట చెప్పారు. ఇది ఈగ, బాహుబలి, ఆర్.ఆర్.ఆర్ లను మించి విజువల్ మాయాజాలంతో కట్టి పడేస్తుందని, కాన్వాస్ మరో లెవల్ లో ఉంటుందని చెబుతున్నారు. అంతేకాదు, విజువల్ గ్రాఫిక్స్, ఎఫెక్ట్స్ తో తెరకెక్కించినా ఎక్కడా వాస్తవికత చెడకుండా లాజిక్స్ మిస్ కాకుండా ఉంటుందని దేవకట్టా చెప్పారు. అంతేకాదు సన్నివేశాల్లో ఎమోషన్ కూడా ఎక్కడా డ్రాప్ అవ్వదని అన్నారు. మొత్తానికి వారణాసి గురించి దేవకట్టా చెబుతున్న విషయాలు మరింత క్యూరియాసిటీని పెంచుతున్నాయి. ఈసారి బడ్జెట్, స్కేల్ దృష్ట్యా ఈ చిత్రాన్ని వరల్డ్ వైడ్ మార్కెట్ ని దృష్టిలో పెట్టుకుని నిర్మించారని కూడా అర్థం చేసుకోవచ్చు. ఆస్కార్ విన్నింగ్ సినిమా తీసిన డైరెక్టర్ గా అతడి పేరు ప్రపంచవ్యాప్తంగా మార్మోగుతోంది. గోల్డెన్ గ్లోబ్స్, హాలీవుడ్ క్రిటిక్స్ పురస్కారాలను కూడా తెచ్చిన ఘనత జక్కన్నకే చెందుతుంది. భారతదేశంలో ఇప్పటివరకూ ఏ ఇతర దర్శకుడికి చేతకాని దానిని కూడా తనకు మాత్రమే సాధ్యమవుతుందని నిరూపించాడు. అందుకే వారణాసి చిత్రంపై ఇప్పుడు అత్యంత భారీ అంచనాలేర్పడ్డాయి. ఇటీవల విడుదల చేసిన టైటిల్ గ్లింప్స్ ఇంటర్నెట్ లో చాలా రికార్డులను బ్రేక్ చేసిన సంగతి తెలిసిందే.

# రకుల్ స్విమ్ సూట్ హొయలు.. ఇది నెవ్వర్ బిఫోర్ లుక్

టాలీవుడ్ నుంచి బాలీవుడ్ వరకు తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకున్న రకుల్ ప్రీత్ సింగ్, గ్లామర్ విషయంలో ఎప్పుడూ తగ్గేదే లేదని నిరూపిస్తోంది. ఫిట్?నెస్?కు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచే ఈ బ్యూటీ, తన లేటెస్ట్ ఫొటోషూట్‌తో సోషల్ మీడియాలో ఒక్కసారిగా ఉష్ణోగ్రతలు పెంచేసింది. ప్రముఖ మ్యాగజైన్ కవర్ పేజీ కోసం ఆమె ఇచ్చిన పోజులు కుర్రాళ్ళ మనసులను దోచేస్తున్నాయి. ఈ ఫొటోషూట్‌లో రకుల్ నీలి రంగు స్విమ్ సూట్ తరహా డ్రెస్ లో దర్శనమిచ్చి అందరినీ ఆశ్చర్యపరిచింది. ఆ డ్రెస్‌లో ఆమె గ్లామర్ ను హైలెట్ చేస్తూనే తన చూపులతో కూడా ఎట్రాక్ట్ చేసింది. ఆమె గ్లామర్ హొయలు చూసేవారికి కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. స్విమ్మింగ్ పూల్ పక్కన నిలబడి, తీక్షణమైన చూపులతో ఆమె విసిరే గ్లామర్ బాణాలకు నెటిజన్లు ఫిదా అవుతున్నారు.




ఈ లుక్‌ను మరింత ఎలివేట్ చేయడానికి రకుల్ బంగారు ఆభరణాలను ఎంచుకుంది. మెడలో లేయర్స్‌గా ఉన్న గోల్డ్ చైన్స్, చేతికి బ్రాస్లెట్స్, వేళ్లకు రింగులు ధరించి రాయల్ లుక్?ను సొంతం చేసుకుంది. మోడ్రన్ అవుట్‌ఫిట్‌కి ట్రెడిషనల్ టచ్ ఇస్తూ ఆమె చేసిన ఈ ప్రయోగం ఫ్యాషన్ ప్రియులను విశేషంగా ఆకట్టుకుంటోంది. కెరీర్ పరంగా చూస్తే రకుల్ ప్రస్తుతం ఫుల్ స్వింగ్‌లో ఉంది. ముఖ్యంగా బాలీవుడ్‌లో వరుస సినిమాలతో బిజీగా గడుపుతోంది. త్వరలో రాబోతున్న ఒక సినిమాలో ఆమె పాత్రపై భారీ అంచనాలు ఉన్నాయి. పెళ్లి తర్వాత కూడా గ్లామర్ షోలో ఏమాత్రం వెనక్కి తగ్గకుండా, మరింత రెట్టింపు ఉత్సాహంతో దూసుకుపోతోంది. సోషల్ మీడియాలో ఈ ఫొటోలు ఇప్పుడు వైరల్ అవుతున్నాయి. లీడింగ్ లేడీ అనే ట్యాగ్‌తో మ్యాగజైన్ ఆమెను కవర్ పేజీపై ప్రచురించడం ఆమె క్రేజ్‌కు అద్దం పడుతోంది. ఫిట్?నెస్, అందం, అభినయం కలగలిసిన రకుల్, రాబోయే రోజుల్లో ఇంకెన్ని సంచలనాలు సృష్టిస్తుందో చూడాలి.

## వాళ్లిద్దరి బాండింగ్ ఎంత స్ట్రాంగ్ అంటే?

బాలీవుడ్ నటి సోనాక్షి సిన్హా-రైటర్ జహీర్ ఇక్బాల్ ప్రేమించి పెళ్లి చేసుకున్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఈ జంట ధాంపత్య జీవితం సంతోషంగా సాగిపో తుంది. అయితే సోనాక్షి...జహీర్ ని పెళ్లి చేసుకోవడం ఇంట్లో ఇష్టం లేదనే కథనాలు తెరపైకి వచ్చాయి. కొన్ని రకాల అసమానతలు కారణంగా సోనాక్షి కుటుంబ సభ్యులకు ఇష్టం లేనట్లు వార్తలొచ్చాయి. ఈ వివాహం ఎంతో నిరాడం బరంగా జరిగింది. ఇరు పెద్దల సమక్షంలోనే వివాహం జరిగింది. ఈ వేడుకలో సోనాక్షి సోదరుడు కనిపించలేదు. దీంతో సోనాక్షి పెళ్లికి తల్లిదండ్రులు అంగీకరించినా? సోదరుడికి ఇష్టం లేదన్నది ప్రధానంగా హైలైట్ అయింది.

**ప్రేమలో ఉన్నప్పుడే కలహాలు:** ఇదంతా పక్కన బెడితే ఆ జంట ఇప్పుడు ఎంతో అన్యోన్యంగా ఉంది. అయితే ఈ జోడీ ప్రేమలో ఉన్న సమయంలోనే అన్నిరకాల ఎడబాట్లు చూసేసింది. మూడేళ్ల ప్రేమలో ఎన్నో గొడవలు జరిగినట్లు సోనాక్షి గుర్తు చేసుకుంది. ఒకర్ని ఒకరు తిట్టు కోవడం నుంచి కొట్టు కోవడం వరకూ మనస్పర్థల వరకూ వెళ్లారు. కానీ విడిపోవాలి అనే ఆలోచన రానివ్వలేదంది. ఆ సమయంలో కపుల్స్ థెరపీకి వెళ్దామని జహీర్ సలహా ఇవ్వడంతో రెండు సిట్టింగ్స్ లోనే ఇద్దరి మధ్య తలెత్తిన అన్ని వివాదాలకు ఫుల్ స్టాప్ పడిందంది.



అన్ని విషయాలను నెగిటివ్ గా చూడకూడదన్నది అర్థమైందంది.

**ఆ రెండింటినీ బ్యాలెన్స్ చేయాలి:** ఏ విషయాన్ని ఎలా ట్రీట్ చేయాలి? అని తెలిసినా కొన్ని క్షణాలు పాజిటివ్ గా ఆలోచించడం కంటే నెగిటివిటీనే బ్రెయిన్ కోరుకునేదంది. అప్పుడే సరైన నిర్ణయా లు తీసుకున్నామంది. నెగిటివ్..పాజిటివిటీని రెండింటిని బ్యాలెన్స్ చేసినప్పుడే జీవితం సంతోషంగా ఉంటుందని తన అనుభవాన్ని చెప్పుకొచ్చింది. దీంతో సోనా క్షి-జహీర్ ల బాండింగ్ ఎంత బలంగా మారిందన్నది ఈ సన్నివేశంతో తేటతెల్ల మవుతోంది. ప్రేమ పేరుతో లివ్ ఇన్ రిలేషన్ షిప్స్ లో ఉండటం..కొన్నాళ్ల తర్వాత విడిపోవడం ఎంతో మంది జీవితాల్లో చూసినదే.

**టాలీవుడ్ లోనూ లాంచ్ అయింది:** పెళ్లి అయిన తర్వాత కూడా విడిపోవడం అన్నది సెలబ్రిటీ లైఫ్ లో సహజంగా మారిపోయింది. చిన్న చిన్న కారణాలతోనే బంధాలు వీగిపోతున్నాయి. మనస్ప ర్థలు, సరైన సఖ్యత లేకపోవడం వంటివి ప్రధాన కారణాలుగా కనిపిస్తున్నాయి. వీటన్నింటిని సోనాక్షి-జహీర్ దంపతులు దాటుకుని వచ్చిన నేపథ్యంలో? ఆ బంధం మరింత బలంగానూ మారుతుందన్నది విశ్లేషకుల మాట. ఇక సోనాక్షి కెరీర్ సంగతి చూస్తే? అమ్మడు బాలీవుడ్ లో ఇంకా స్టార్ లీగ్ లో చేరలేదు. నటిగా అనుకున్నంత గుర్తింపు దక్కలేదు. ఇటీవలే జటాధర సినిమాతో తెలుగులోనూ లాంచ్ అయిన సంగతి తెలిసిందే.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536